

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

విజయవాడ

: fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

5-1-2026 సోమవారం సంపుటి: 31 సంచిక: 335 పేజీలు: 10+4 వెల: 6.50


## కిమ్ మళ్లీ కవ్వింపు చర్యలు

క్షిపణిపరీక్షలతో తూర్పు ఆసియాలో ప్రకంపనలు

5లో

## పుతిన్‌ను ఇలాగే తీసుకు రాగలరా?

అమెరికా కాంగ్రెస్ సభ్యుడు రోఖన్నా







# భోగాపురానికి ఫ్లైట్

# ఎపికి గేమ్ ఛేంజర్!



ఆదివారం భోగాపురం ఎయిర్‌పోర్టులో విమానం దిగిన అనంతరం విక్టరీ సింబల్ చూపుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్

**విజయనగరం/ విజయవాడ, జనవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నం ఎట్టకేలకు సాకారమైంది. భోగాపురం ఎయిర్ పోర్ట్ నుంచి గగన విహారానికి తొలి అడుగు పడింది. ఢిల్లీ నుంచి వచ్చిన ఎయిర్ ఇండియా తొలి వాణిజ్య వాలిడేషన్ ఫ్లైట్ ఆదివారం భోగాపురం ఎయిర్ పోర్ట్‌లో విజయవంతంగా ల్యాండ్ అయింది. ఈ విమానంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు, ఏటీసీ చైర్మన్‌తోపాటు పలువురు ఉన్నతాధికారులు భోగాపురం ఎయిర్ పోర్టుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా వీరికి జిల్లా ఉన్నతాధికారులతోపాటు విమానయాన సంస్థ అధికారులు ఘన స్వాగతం పలికారు. అత్యాధునిక టెక్నాలజీతో భోగాపురం ఎయిర్‌పోర్ట్‌ను నిర్మిస్తున్నారు. ఇప్పటికే 96 శాతం ఎయిర్ పోర్ట్ పూర్తయిందని జీఎంఆర్ సంస్థ తెలిపింది. జూన్ 26వ తేదీన ఈ ఎయిర్ పోర్ట్‌ను ప్రారంభించనున్నారు. భోగాపురంలో తొలి విమానం ల్యాండ్ కావడం ఎయిర్‌పోర్ట్ చరిత్రలో కీలక మైలురాయి అని సిఎం చంద్రబాబు నాయుడు అభివర్ణించారు. ఆదివారం భోగాపురం ఎయిర్‌పోర్ట్‌లో తొలి విమానం >>2



**ఉత్తరాంధ్రలో చారిత్రక ఘట్టం ఆవిష్కృతం**

**ఇది కీలక మైలురాయి: సిఎం చంద్రబాబు**

**ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఊతమిస్తుంది**

**రోడ్డు కనెక్టివిటీపైనా దృష్టి సారించాం**

**కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు**

భాష, వారసత్వం, సంస్కృతి వల్లే

# మన సంబంధాలు బలోపేతం



ఇంగ్లీష్ భాష వినియోగం పెరుగుదల ఆందోళనకరం

తెలుగు వంటి ప్రాచీన భాషపై ప్రతికూల ప్రభావం

ప్రపంచ తెలుగు మహాసభలలో మారిషస్ దేశాధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్

తెలుగు సాహిత్యం, భాషను ప్రోత్సహించడంలో ఎపి సిఎం చంద్రబాబు విశేష కృషి అంటూ ప్రశంసలు

సంప్రదాయాలతో మారిషస్‌లో ఉగాది పండుగ నిర్వహించుకుంటున్నామని వెల్లడి

**విజయవాడ, జనవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి:** ఇంగ్లీష్ భాష ఎక్కువగా వినియోగించడంతో తెలుగు వంటి ప్రాచీన భాషపై ప్రతికూల ప్రభావం చూపుతోందని మారిషస్ దేశాధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్ వ్యాఖ్యానించారు. మారిషస్‌లో తెలుగు సాహిత్యం, భాషను ప్రోత్సహించడంలో ఎపి పిఎం చంద్రబాబు నాయుడు విశేష కృషి చేశారని అన్నారు. చంద్రబాబు మారిషస్ వచ్చినపుడు దేశంలో విద్య, తెలుగు సంస్కృతి అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. గుంటూరులో మూడో ప్రపంచ తెలుగు మహాసభలు వైభవంగా కొనసాగుతోన్నాయి. ఆదివారం రెండవ రోజుఈ సభలో పాల్గొని ప్రసంగించారు. తెలుగు భాషాభివృద్ధి కోసం కృషి చేస్తోన్న సిఎం చంద్రబాబుకు హృదయపూర్వకంగా అభినందిస్తున్నానని తెలిపారు ఈ శతాబ్దం చివరి నాటికి ప్రపంచంలో సగానికి పైగా భాషలు అంతరించిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పూర్వీకుల నుంచి వచ్చిన మాతృభాషను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి విధిగా తీసుకోవాలని సూచించారు. చారిత్రాత్మక, విశిష్టమైన మూడో ప్రపంచ తెలుగు మహాసభలు గుంటూరు జిల్లాలో జరపడం అభినందనీయమని >>2

## నీళ్ల లెక్కలు త్వరలో అన్నీ బయటపెడతా!

సిఎం చంద్రబాబు

తెలంగాణ అసెంబ్లీలో సిఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యల నేపథ్యంలో ప్రాధాన్యం

**విజయవాడ,జనవరి4,ప్రభాతవార్తప్రతినిధి:** నీటి పంపకాల అంశానికి సంబంధించి అన్ని విషయాలను త్వరలోనే ప్రజలకు తెలియజేస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ అంశంపై ప్రభుత్వం పూర్తిగా అధ్యయనం చేసి, వివరంగా మాట్లాడుతామని ఆయన స్పష్టం చేశారు. నీటి వనరుల నిర్వహణలో రాష్ట్ర ప్రయోజనాలే ప్రధాన లక్ష్యమని సీఎం పేర్కొన్నారు. నీటి పంపకాల (లిఫ్ట్ ఇరిగేషన్) అంశంపై త్వరలో పూర్తి వివరాలు తెలియజేస్తామని చంద్రబాబు చెప్పారు. ఇటీవల తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను తన విన్నపం మేరకు ఆపించినట్టు చెప్పిన నేపథ్యంలో చంద్రబాబు వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టు పనులు 2020లోనే ఎన్జీటీ, కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ఆగిపోయాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందే సంబంధిత పనులు ఆగాయని ఏపీ ప్రభుత్వం >>2

# అక్రమ రిజిస్ట్రేషన్లకు చెక్

రిజిస్ట్రేషన్ల చట్టానికి సవరణ చేస్తూ ఉత్తర్వులు

**విజయవాడ,జనవరి4,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో ప్రభుత్వం నకిలీ పత్రాలతో నిషేధిత భూముల రిజిస్ట్రేషన్లను అరికట్టేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయడానికి జిల్లా కలెక్టర్ నేతృత్వంలో ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో జాయింట్ కలెక్టర్, ఆర్డీవో సభ్యులుగా ఉంటారు. రిజిస్ట్రేషన్ చేసే అధికారి కావాలనే తప్పు చేస్తే, వారిపై కఠిన చర్యలు తీసుకుంటారు. ఈ విషయాన్ని రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ తెలిపారు. ఆయన ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.



# తీరు మార్చుకోకపోతే మీపైనా చర్యలు

క్యూబా, మెక్సికో, కొలంబియాలకు ట్రంప్ వార్నింగ్

న్యూయార్క్ డ్రగ్స్ ఏజెన్సీ కార్యాలయంలో బేడీలతో మదురో

వెనిజులాను పాలించేది మేమే: అమెరికా అధ్యక్షుడు

దేశ తాత్కాలిక అధ్యక్షురాలిగా డెల్సీ రోడ్రిగ్స్


ప్రజలకు స్వేచ్ఛ లభించింది: ప్రతిపక్ష నేత మచాడో

పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నాం: భారత్ విదేశాంగ శాఖ ప్రకటన

చమురు నిల్వల కోసమే వెనిజులాపై ట్రంప్ దాడులు

అమెరికా మాజీ ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ ధ్వజం

వెనిజులా ప్రజలకు మస్క్ స్టార్‌లింక్ ఉచిత ఇంటర్నెట్



5లో



## నీటి హక్కులపై రాజీ ప్రసక్తే లేదు

**2020లోనే ఎన్‌జిటి ఆదేశంతో నిలిచిన ఎత్తిపోతల పథకం**

రాష్ట్ర బిసి సంక్షేమశాఖ మంత్రి సవిత స్పష్టీకరణ

రాయలసీమ ద్రోహి జగన్ అంటూ మండిపాటు

**విజయవాడ, జనవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి నీటి హక్కులు, రాయలసీమ సాగునీటి ప్రయోజనాల విషయంలో రాజీ ప్రసక్తే లేదని రాష్ట్ర బిసి, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత తేల్చి చెప్పారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. సిఎం చంద్రబాబును బూచిగా చూపి రాజకీయ ఉనికి చాటుకోవడం తెలంగాణ రాష్ట్ర అధికార, విపక్షాలకు అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు. 2020లో ఎటువంటి అనుమతులు లేకుండా రాయలసీమ ఎత్తిపోతల పథక నిర్మాణం చేపడుతున్నామని జగన్ ప్రభుత్వం అట్టహాసంగా ప్రకటించిందన్నారు. ఈ ప్రకటనపై ఆనాటి తెలంగాణ ప్రభుత్వం ఫిర్యాదు చేయడంతో, కేంద్రంతో పాటు ఎన్జీటీ రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని అడ్డుకున్నాయన్నారు. ఇదేవిషయంపై అప్పట్లో మీడియాలోనూ ప్రచురితమైన విషయాన్ని మంత్రి సవిత గుర్తు చేశారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం నిలిచిపోవడానికి ప్రధాన కారణం వైఎస్ జగన్మోహన్ రెడ్డేనని మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. రాయలసీమకు >>2




## రాష్ట్ర పండుగగా వడ్డే ఓబన్న జయంతి

11న అనంతపురంలో రాష్ట్ర స్థాయి జయంతోత్సవం

2లో


అన్ని జిల్లా కేంద్రాల్లోనూ నిర్వహణ:మంత్రి సవిత



## అసోం ఎన్నికల ఇన్‌ఛార్జిగా ప్రియాంక గాంధీ

**న్యూఢిల్లీ, జనవరి 4:** కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీకి ఆ పార్టీ కీలక బాధ్యతలు అప్పగించింది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అస్సాం స్క్రీనింగ్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఆమెను నియమించింది. ఐఏసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న ఐదు రాష్ట్రాలకు స్క్రీనింగ్ కమిటీలను నియమించారు. ప్రియాంక గాంధీ వాద్రా నేతృత్వంలోని అస్సాం స్క్రీనింగ్ కమిటీలో సప్తగిరి శంకర్ ఉలక, ఇమ్రాన్ మసూద్, సిరివెల్ల ప్రసాద్ సభ్యులుగా ఉన్నారు. అస్సాంతోపాటు, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి, పశ్చిమ బెంగాల్‌లకు స్క్రీనింగ్ కమిటీలను కూడా కాంగ్రెస్ పార్టీఏర్పాటు చేసింది. కేరళ కమిటీకి మధుసూదన్ మిస్త్రీ అధ్యక్షత వహిస్తారు. సయ్యద్ నసీర్ హుస్సేన్, నీరజ్ డాంగి, అభిషేక్ దత్ సభ్యులుగా ఉంటారు. మరోవైపు తమిళనాడు, పుదుచ్చేరి స్క్రీనింగ్ కమిటీకి టీఎస్ సింగ్ డియో నేతృత్వం వహిస్తారు. యశోమతి ఠాకూర్, జీసీ చంద్రశేఖర్, అనిల్ కుమార్ యాదవ్ సభ్యులుగా ఉంటారు. పశ్చిమ బెంగాల్ కమిటీకి బీకే హరిప్రసాద్ చైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. మహ్మద్ జావేద్, మమతా దేవి, బీపీ సింగ్ సభ్యులుగా ఉన్నారు. అభ్యర్థుల ఎంపిక, అంతర్గత సంప్రదింపులు వంటి బాధ్యతలను స్క్రీనింగ్ కమిటీలు నిర్వహిస్తాయి.

# 2036 ఒలింపిక్స్‌కు భారత్ ఆతిథ్యం



ఆ లక్ష్యంగా ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాం

వారణాసిలో జాతీయ వాలీబాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం

ప్రధాని నరేంద్ర మోడీ

**న్యూఢిల్లీ, జనవరి 4:** క్రీడా రంగంలో భారతదేశం సరికొత్త శిఖరాలను అధిరోహించే దిశగా అడుగులు వేస్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. వారణాసిలో 72వ జాతీయ వాలీబాల్ ఛాంపియన్‌షిప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న ఆయన క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా భారత్ భవిష్యత్తులో చేపట్టబోయే మెగా స్పోర్ట్స్ ఈవెంట్ల గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. 2036 ఒలింపిక్స్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వడమే లక్ష్యంగా భారత్ ముమ్మర ప్రయత్నాలు చేస్తోందని ప్రధాని వెల్లడించారు. ఈ ప్రతిష్ఠాత్మక ఈవెంట్ హక్కులను దక్కించుకోవడానికి ఎక్కడా రాజీపడకుండా కృషి చేస్తున్నామన్నారు. అలాగే, 2030 కామన్వెల్త్ గేమ్స్ కూడా భారత్‌లోనే జరగనున్నాయని మోదీ స్పష్టం చేశారు. అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించడంలో భారత్ తన సత్తాను చాటుతోందని, గత దశాబ్ద కాలంలో అండర్17 ఫిఫా వరల్డ్ కప్, హాకీ వరల్డ్ కప్, చెస్ టోర్నమెంట్లతో సహా 20కి పైగా అంతర్జాతీయ ఈవెంట్లను మన దేశం విజయవంతంగా నిర్వహించిందని గుర్తు చేశారు. వాలీబాల్ క్రీడ గొప్పతనాన్ని వివరిస్తూ ఇది కేవలం ఆట మాత్రమే కాదని, సహకారం, సమతుల్యత (బ్యాలెన్స్)తో కూడిన ప్రక్రియ అని మోడీ అభివర్ణించారు. బంతిని కింద పడకుండా గాలిలోనే ఉంచేందుకు చేసే ప్రయత్నంలో క్రీడాకారుల పట్టుదల కనిపిస్తుందన్నారు. టీమ్ ఫస్ట్ అనే నినాదంతో ప్రతి క్రీడాకారుడు జట్టు విజయం కోసమే ఆడాలని సూచించారు. వ్యక్తిగత నైపుణ్యాలు వేరైనా, సమష్టి కృషితోనే విజయాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. ఆదివారం నుంచి 11 వరకు జరగనున్న ఈ 72వ జాతీయ వాలీబాల్ టోర్నీలో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, >>2



ఆదివారం హైదరాబాద్‌లో సాయిబాబా కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

# సాయిబాబా సేవలు మరువలేనివి

## కుటుంబసభ్యులను పరామర్శించిన సీఎం చంద్రబాబు

**విజయవాడ, జనవరి 4, ప్రభాతవార్త:** టీడీపీ సీనియర్ నేత, సికింద్రాబాద్ పార్లమెంట్ కన్వీనర్, ఎన్టీఆర్ అభిమాన సంఘాల సమాఖ్య అధ్యక్షులు సాయిబాబా తెలుగుదేశం పార్టీకి చేసిన సేవలు మరువలేనివని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు కొనియాడారు. ఆదివారం సాయంత్రం విదేశీ పర్యటన ముగించుకుని, హైదరాబాద్ చేరుకున్న చంద్రబాబు విమానాశ్రయం నుంచి నేరుగా సాయిబాబా నివాసానికి వెళ్లి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా సాయిబాబా చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. సాయిబాబా సతీమణి పి.సరళను, కుమారులు భార్గవ్, వంశీ, చిన్నారులు ధైర్యం చెప్పి, సాయిబాబాతో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. ఒక మంచి కుటుంబ సభ్యుడిని తెలుగుదేశంపార్టీ కోల్పోయిందని, సాయిబాబా మరణం పార్టీకి తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. సాయిబాబా కుటుంబ సభ్యులకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. చంద్రబాబు వెంట పొలిట్‌బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు, అరవిందకుమార్‌గౌడ్, కంభంపాటి రామ్మోహన్‌రావు, కాట్రగడ్డ ప్రసూన, పొలంపల్లి అశోక్, శ్రీపతి సతీష్‌కుమార్ ఉన్నారు. అనంతరం టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నేతలను కలిసిన చంద్రబాబు, సాయిబాబా స్ఫూర్తితో ముందుకు సాగా లని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్, నాగు నగేష్, టీటీడీ సభ్యులు నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దేశంలోనే తొలిసారి రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీల తగ్గింపు

## విద్యుత్ భారాన్ని ప్రజలపై పడనివ్వం: మంత్రి అచ్చెన్నాయుడు



**అమరావతి, జనవరి 4 ప్రభాతవార్త:** విద్యుత్ ఛార్జీల భారం ప్రజలపై పడకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకుంటున్నారని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. "కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సుపరిపాలన అందిస్తు ప్రజల మన్ననలను పొందుతోంది. ఆర్థిక పరిస్థితి సరిగా లేనప్పటికీ ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ.. ఇవ్వని హామీలను కూడా అమలు చేసుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా పరుగులు పెట్టిస్తోంది. గడిచిన ఐదేళ్ల జగన్ రెడ్డి పాలనలో ప్రజలు అనేక కష్టాలు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా రాష్ట్ర విద్యుత్ వ్యవస్థ అనిశ్చితి, ఆర్థిక ఒత్తిడి, గందరగోళం ఎదుర్కొంది. విద్యుత్ అనేది ప్రభుత్వానికి రాజకీయ అస్త్రం కాదు, ప్రజల జీవితాలతో ముడిపడిన కీలక మౌలిక రంగం. అలాంటి రంగాన్ని మూర్ఖపు నిర్ణయాలతో అప్పులపాలు చేశారు. 2019లో అధికారం నుంచి దిగిపోయే నాటికి మిగులు విద్యుత్ రాష్ట్రంగా నిలిపారు. కానీ జగన్ రెడ్డి విద్యుత్ ఛార్జీలను తగ్గిస్తానని చెప్పి, తన ఐదేళ్ల పాలనలో 9 సార్లు ఛార్జీలు పెంచి దాదాపు రూ.32 వేల కోట్లు ప్రజలపై భారం మోపాడు. విద్యుత్ కోతలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేశాడు. కమీషన్ల కోసం విద్యుత్ కొనుగోలు చేసి వారి జేబులు నింపుకున్నారు. ఈ తప్పుడు నిర్ణయాలతో రాష్ట్ర విద్యుత్ వ్యవస్థను ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకుని రూ.1.29 లక్షల కోట్లు అప్పులు మిగిల్చారు" అని మంత్రి అచ్చెన్నాయుడు వివరించారు.

**బాధ్యతాయుత పాలన, చారిత్రాత్మక నిర్ణయాలు:** "2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిర్వీర్యమైన విద్యుత్ వ్యవస్థను గాడిన పెట్టేందుకు సంస్కరణలు చేపడుతోంది. ఎన్నికల సమయంలో అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచేది లేదని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం వేల కోట్లు విలువైన ట్రూఅప్ భారాన్ని ప్రభుత్వం భరించింది. 2019-2024 కాలానికి సంబంధించి రూ.4,498 కోట్లు ట్రూఅప్ ఛార్జీలు వసూలు చేయాలంటూ ఏపీఈఆర్సీ లేఖ రాసినా, ఈ భారాన్ని ప్రభుత్వమే భరిస్తుందని చెప్పడం చారిత్రాత్మక నిర్ణయం. 1999లో ఏపీఈఆర్సీ ఏర్పాటైన నాటి నుంచి తొలిసారి ట్రూడౌన్ ఛార్జీలు నమోదు కావడం, ముఖ్యమంత్రి చేపడుతున్న విద్యుత్ సంస్కరణల ఫలితం. ట్రూడౌన్ అమలు ద్వారా యూనిట్‌కు 13 పైసలు తగ్గాయి" అని మంత్రి తెలిపారు.

**రైతులకు, వినియోగదారులకు నేరుగా లాభం:** "జగన్ రెడ్డి పాలనలో అక్వా రైతులకు యూనిట్ రూ.3.50 వసూలు చేస్తే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత యూనిట్ రూ.1.50కు తగ్గించడం కీలక నిర్ణయం. గత ప్రభుత్వంలో రూ.5.19కు విద్యుత్ కొనుగోలు చేస్తే, ఇప్పుడు రూ.4.70కు కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటోంది. మారుతున్న కాలానికి అనుగుణంగా తక్కువ ధరకే విద్యుత్తు కొనుగోలు చేస్తూ, రిన్యూవబుల్ ఎనర్జీకి ప్రాధాన్యతనిస్తోంది. సోలార్ పవర్ విద్యుత్ ఏర్పాటే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. సోలార్ పవర్ ప్రోత్సాహానికి ఎస్సీ, ఎస్టీలకు ఉచిత సోలార్ రూఫ్‌టాప్‌లు, బీసీ వర్గాలకు కేంద్రం ఇస్తున్న సబ్సిడీపై అదనంగా రూ.20 వేల అధిక సబ్సిడీని కూటమి ప్రభుత్వం అందిస్తోంది" అని మంత్రి అచ్చెన్నాయుడు తెలియజేశారు.

# క్రీడాకారుల సంక్షేమమే ధ్యేయం

## 15 లోపు స్పోర్ట్స్‌యాప్‌లో సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాలి: శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు

**విజయవాడ,జనవరి4,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌ను క్రీడాంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయంగా ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు స్పష్టం చేశారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలోని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఛైర్మన్ అనిమిని రవి నాయుడు మాట్లాడుతూ.రాష్ట్రంలో క్రీడలను ఉద్యమంగా మార్చి, ప్రతి జిల్లాలో మౌలిక వసతులు కల్పించి, అంతర్జాతీయ స్థాయి



మీడియా సమావేశంలో క్రీడా యాప్ సమాచార పత్రాన్ని ప్రదర్శిస్తున్న శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు

క్రీడాకారులను తయారు చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని శాప్ ఛైర్మన్ స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గతంలో క్రీడాకారులకు రావాల్సిన బకాయిలుగా సుమారు రూ.16 కోట్లను ఇప్పటికే విడుదల చేసినట్లు, అలాగే ఫిబ్రవరి నెలలో మరో రూ.8 కోట్లను క్రీడాకారులకు అందించనున్నట్లు తెలిపారు. ఈ సుదీర్ఘ క్రీడా అభివృద్ధి ప్రయాణంలో మీడియా పాత్ర అత్యంత కీలకమని అనిమిని రవి నాయుడు పేర్కొన్నారు. 2025 సంవత్సరంలో రాష్ట్ర క్రీడా శాఖకు, ముఖ్యంగా క్రీడాకారుల సంక్షేమం మరియు క్రీడా రంగ అభివృద్ధికి నిరంతర సహకారం అందించిన మీడియా వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. 2026 సంవత్సరంలో కూడా ఇదే విధంగా మీడియా మద్దతు కొనసాగాలని ఆకాంక్షి ంచారు.గతంలో రాష్ట్రంలో క్రీడా విభాగానికి స్పష్టమైన క్రీడా విధానం లేకుండా, సరైన మౌలిక వసతులు లేక నిద్రాణావస్థలో కొనసాగిందని తెలిపారు. తాను ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సమయంలో రాష్ట్రానికి సమగ్ర క్రీడా పాలసీ లేకపోవడంతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రానికి సమగ్ర క్రీడా పాలసీని ప్రకటించడం జరిగిందన్నారు. ఈ పాలసీ రూపకల్పనలో మీడియా ప్రతినిధులు, క్రీడా సంఘాలు, ప్లేయర్స్ అసోసియేషన్ల నుంచి వచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకున్నామని, అవసరమైన మార్పులు, సవరణలు త్వరలో చేపట్టనున్నట్లు తెలిపారు.ఒలింపిక్స్, కామన్‌వెల్త్, ఏసియన్ గేమ్స్‌లను లక్ష్యంగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అమలు చేస్తున్న విధానాన్ని రాష్ట్రంలోనూ అనుసరించేందుకు నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ఈ దిశగా క్రీడల్లో ముందున్న తమిళనాడు సహా దాదాపు 17 రాష్ట్రాల క్రీడా విధానాలు, పనితీరును అధ్యయనం చేశామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా క్రీడా మౌలిక వసతుల అభివృద్ధి కోసం సుమారు రూ.54 కోట్ల విలువైన ప్రాజెక్టులకు టెండర్లు పూర్తి చేసి, అన్ని ప్రాంతాల్లో పారదర్శకంగా పనులు కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. శాశ్వత క్రీడా మౌలిక వసతుల అభివృద్ధి భాగంగా శ్రీకాకుళంలోని కోడి రామ్మూర్తి స్టేడియం అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, విశాఖపట్నం కొమ్మాదిలో సుమారు రూ.25 కోట్లతో ఆధునిక స్టేడియం నిర్మాణం కొనసాగుతోందని తెలిపారు. విజయనగరంలో ఈ ఏడాదే స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అలాగే అరకు-పాడేరు ప్రాంతాల్లో క్రీడల్లో ప్రతిభ ఉన్న గిరిజన పిల్లల కోసం ఎస్టీ కంపోనెంట్ నిధులు, స్పోర్ట్స్ అథారిటీ సహకారంతో రెసిడెన్షియల్ స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.కాకినాడలో ఖేలో ఇండియా పథకం కింద సింథటిక్ ట్రాక్ పూర్తి చేసి, అక్కడే క్రీడా అకాడమీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వాటర్ గేమ్స్ తో పాటు మల్టీ పర్పస్ స్పోర్ట్స్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. రాజమండ్రిలో అమరావతి పుష్కరాల పేరుతో మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియం ఇప్పటికే ప్రారంభమైందని, అలాగే ఏలూరులో వెయిట్‌లిఫ్టింగ్ తదితర క్రీడలకు అనుకూలంగా సుమారు రూ.8 నుండి రూ.10 కోట్లతో మరమ్మత్తుల పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు.రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో కీలక క్రీడా మైదానాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆయన తెలిపారు.

# ఎపికి గేమ్ ఛేంజర్!

>> ల్యాండింగ్ కావడంపై సీఎం చంద్రబాబు నాయుడు తన ఎక్స్ ఖాతా వేదికగా స్పందించారు. ఏపీ విమానయాన రంగంలో మరో చరిత్రాత్మక ఘట్టం నమోదైందన్నారు. వ్యాలిడేషన్ ఫ్లైట్‌ను విజయవంతంగా పూర్తి చేయడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర ప్రజలకు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ప్రాంతీయ అనుసంధానం (కనెక్టివిటీ) బలోపేతం అవుతుందని.. ఇది ఉత్తరాంధ్ర అభివృద్ధికి భారీగా ఊతమిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టుకు మద్దతు అందించిన ప్రధాని మోడీకి ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు కృతజ్ఞతలు తెలియజేశారు. త్వరలోనే ప్రజల సేవలకు విమానాశ్రయం సిద్ధమవుతోందని చెప్పారు. ఈ ఏడాది జూన్ నుంచి ఈ ఎయిర్ పోర్ట్ ద్వారా వాణిజ్య విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయన్నారు. ఈ ఎయిర్ పోర్ట్‌తో ఉత్తరాంధ్ర అభివృద్ధి పథంలో ముందుకెళ్తోందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. నిర్దేశించుకున్న లక్ష్యం కంటే ముందే భోగాపురం ఎయిర్ పోర్ట్ నిర్మాణం పూర్తికానుందని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

**ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఊతమిస్తుంది: కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు**

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, డిజిసిఎ అధికారులు ఈ విమానంలో వచ్చారు. విజయనగరం జిల్లా భోగాపురంలో గ్రీన్‌ఫీల్డ్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ నిర్మితమవుతుంది. ఆదివారం ఈ ఎయిర్‌పోర్ట్‌లో న్యూఢిల్లీ నుంచి వచ్చిన ప్రత్యేక విమానం ల్యాండింగ్ అయింది. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ ఇది ఉత్తరాంధ్ర ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న చారిత్రక ఘట్టమని పేర్కొన్నారు. ఫ్లైట్‌లో పైలట్ చేసిన 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయానికి స్వాగతం' అనే ప్రకటన తనను భావోద్వేగానికి గురి చేసిందన్నారు. భోగాపురం విమానాశ్రయానికి బీజం వేసింది విజనరీ నాయకుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడేనని, 2016లో అప్పటి కేంద్ర మంత్రి పూసపాటి అశోక్ గజపతి రాజు కృషితో కేంద్రం నుంచి ఇన్‌ప్రిన్సిపల్ అప్రూవల్ లభించిందని గుర్తు చేశారు. మధ్యలో జాప్యాలు వచ్చినప్పటికీ, గత 18 నెలలుగా నిరంతర సమీక్షలతో ప్రాజెక్టును వేగంగా ముందుకు తీసుకొచ్చామని తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌ను సొంత ప్రాజెక్ట్‌లా అభివృద్ధి చేసిన జిఎంఆర్ గ్రూప్, నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన ఎల్ అండ్ టి, అలాగే డిజిసిఎ, ఏఏఐ, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ శాఖల సమన్వయానికి మంత్రి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా భూములు త్యాగం చేసిన స్థానిక రైతులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. భోగాపురం విమానాశ్రయం వల్ల విశాఖపట్నం- విజయనగరం- శ్రీకాకుళం ఉమ్మడి జిల్లాలకు అంతర్జాతీయ కనెక్టివిటీ, ఉద్యోగ అవకాశాలు, వాణిజ్యం, కార్గో, టూరిజం, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు గణనీయంగా పెరుగుతాయని పేర్కొన్నారు. హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ తరహాలో భోగాపురం ప్రాంతం కూడా ప్రపంచ స్థాయి అభివృద్ధి కేంద్రంగా మారుతుందని ఆకాంక్షించారు. ఎయిర్‌పోర్ట్‌తో పాటు మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్ హాల్, ఏరో ఇండస్ట్రీస్ కోసం 500 ఎకరాలు, అలాగే యువతకు స్కిల్లింగ్, ట్రైనింగ్ అందించే ఎడ్యు సిటీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వచ్చే నాలుగు నుంచి ఐదు నెలల్లో ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా విమానాశ్రయాన్ని ప్రారంభించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని వెల్లడించారు. టెస్ట్ ఫ్లైట్ ల్యాండింగ్ అనేది కీలక పనులన్నీ పూర్తి దశకు చేరుకున్నాయనడానికి సంకేతమన్నారు. రాత్రింబవళ్లు శ్రమించిన కార్మికులు, సిబ్బందికి రామ్మోహన్ ఈ సందర్భంగా ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన పలువురు ఎమ్మెల్యేలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**రోడ్డు కనెక్టవిటీపై ప్రత్యేక దృష్టి**

భోగాపురం ఎయిర్ పోర్టు కార్యకలాపాలు ప్రారంభమయ్యే నాటికి రోడ్డు కనెక్టవిటీ పూర్తయ్యేలా కార్యాచరణ రూపొందించామని, విశాఖపట్టణం నుంచి ఇక్కడకు సులభంగా చేరుకునేలా ఏడు రోడ్లతో కూడిన ప్రణాళిక సిద్ధం చేసినట్లు మంత్రి రామ్మోహన్ నాయుడు చెప్పారు. విశాఖపట్టణం, మూలపేట పోర్టులకు కూడా దీనితో అనుసంధానం ఏర్పాటు చేస్తామని, అలాగే విశాఖ - రాయ్‌పూర్ హైవేతో కనెక్టవిటీకి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. భోగాపురం ఎయిర్ పోర్ట్‌లో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ భోగాపురం ఎయిర్ పోర్టుతో పాటు చేపట్టబోయే ఇతర ప్రాజెక్టుల గురించి కూడా వివరించారు. మెట్రోను కూడా త్వరలోనే పట్టాలెక్కిస్తామన్నారు. ఆనందపురం వద్ద కూడలిని విస్తరిస్తామని చెప్పారు. వైజాగ్ పోర్టు నుంచి భోగాపురం వరకు ప్రత్యామ్నాయ రోడ్డు నిర్మాణం కోసం ఇప్పటికే కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్చించారని గుర్తు చేశారు. ఫాస్ట్ ట్రాక్ మోడ్‌లో అన్ని పనులు చేస్తున్నామని, ముఖ్యమంత్రి చొరవ వలన ఇప్పటికే విశాఖ కేంద్రంగా పలు కంపెనీలు వచ్చాయని, 15 బిలియన్ల డాలర్ల పెట్టుబడితో గూగుల్ వచ్చిందని ఇదొక మైలురాయని పేర్కొన్నారు. ఎం.ఆర్.వో. ఇండస్ట్రీస్ కార్యకలాపాల కోసం ప్రభుత్వం మరొక 500 ఎకరాలు కేటాయించామని, వరల్డ్ క్లాస్ ఏవియేషన్ హబ్‌గా భోగాపురానికి అనుసంధానంగా నెలకొల్పుతున్న ఎడ్యుసిటీ కోసం మాన్సాస్ సంస్థ 136 ఎకరాల భూమి ఉచితంగా కేటాయించిందని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు.

# అభివృద్ధిలో ఒక మైలురాయి: జగన్

## మా హయాంలోనే భూసేకరణకు రూ. 960 కోట్లు ఖర్చు చేశామని వెల్లడి

**విజయవాడ,జనవరి4,ప్రభాతవార్తప్రతినిధి :** విశాఖపట్నంలోని భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో తొలి విమానం ల్యాండ్ అవ్వడంపై వైసీపీ అధినేత జగన్ స్పందించారు. ఇది ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రస్థానంలో ఒక మైలురాయి అని, విజన్ వైజాగ్ లక్ష్య సాధన దిశగా పడిన కీలక అడుగు అని ఆయన అభివర్ణించారు. ఈ ప్రాజెక్టు ప్రస్తుత దశకు చేరుకోవడానికి తమ ప్రభుత్వ హయాంలో వేసిన బలమైన పునాదే కారణమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా జగన్ స్పందిస్తూ, "మా పాలనా కాలంలో ఈ ప్రాజెక్టుకు వేగవంతమైన అనుమతులు సాధించాం. భూసేకరణ, నిర్వాసితుల పునరావాసం కోసం సుమారు రూ. 960 కోట్లు ఖర్చు చేయడం ద్వారా ప్రాజెక్టుకు పటిష్ఠమైన పునాది వేశాం. ప్రాజెక్టుకు సంబంధించిన ప్రధాన పనుల్లో గణనీయమైన భాగం అప్పుడే పూర్తయింది. ఆ రోజు మేం చేసిన కృషే ఇవాళ్టి ఈ కీలక మైలురాయిని చేరుకోవడానికి ముఖ్య కారణం" అని వివరించారు. ఎయిర్‌పోర్టు నిర్మాణంలో అసాధారణ కృషి చేసిన జీఎంఆర్ గ్రూప్‌కు జగన్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. అదేవిధంగా, విశాఖపట్నం పోర్టును భోగాపురం విమానాశ్రయంతో అనుసంధానించే బైపాస్ జాతీయ రహదారి ప్రాజెక్టుకు 2023 మార్చిలో ఆమోదం తెలిపిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

# నీటి హక్కులపై రాజీ ప్రసక్తే లేదు

>> మొదటిసారిగా నీళ్లిచ్చిన ఘనత అన్న ఎన్టీఆర్‌దేన్నారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సిఎం చంద్రబాబు 2016-17లో గాలేరు-నగరి కాలువ ద్వారా గండికోట రిజర్వాయర్ నింపి పులివెందుల పైడిపాలెం ప్రాజెక్టుకు లిఫ్ట్ ద్వారా నీరందించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. అక్కడి నుంచి సిబిఆర్ ప్రాజెక్ట ద్వారా కడపకు నీరందించామన్నారు. 40 ఏళ్లలో వైఎస్ కుటుంబం చేయలేని పనిని సిఎం చంద్రబాబు చేసి చూపించారని మంత్రి సవిత కొనియాడారు. రాయలసీమను హార్టీకల్చర్ హబ్‌గా సిఎం చంద్రబాబు తీర్చిదిద్దారని, హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా కుప్పం వరకూ సాగు నీరందించామని వెల్లడించారు. రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీరందించేలా సిఎం చంద్రబాబు రేయింబవళ్లు కృషి చేస్తున్నారన్నారు. రాయలసీమకు తాగు, సాగునీరు కల్పించిన ఘనత చంద్రబాబుదేని మంత్రి సవిత స్పష్టంచేశారు.

**రాయలసీమ ద్రోహి జగన్:** రాయలసీమ ద్రోహి జగన్ అని, తన రాజకీయ ఉనికి చాటుకోవడం కోసం డ్రామాలు ఆడడం ఆయనకు అలవాటేనని మంత్రి సవిత విమర్శించారు. 2024 ఫిబ్రవరి 26వ తేదీన చిత్తూరు జిల్లా రామకుప్పం మండలం రాజుపేట వద్ద కుప్పం నియోజక వర్గానికి హంద్రీనీవా కాలువకు జగన్ నీటిని విడుదల చేస్తున్నట్లు ఒక డ్రామా ఆడారన్నారు. సినిమా సెట్టింగ్ మాదిరిగా ఓ గేటు పెట్టి... దాన్ని ఎత్తుతున్నట్లు మీడియా ముందు జగన్ హడావుడి చేశారన్నారు. ఆరోజు సాయింత్రానికి అదంతా ఒట్టి మోసమని తెలిపోయిందన్నారు. ప్రారంభించిన గేటు వెంట చుక్క నీరు కూడా పారలేదన్నారు. ఆ మరుసటి రోజు జేసీబీని తీసుకొచ్చి ఆ గేటును అక్కడి నుంచి తరలించిన విషయాన్ని మీడియాలో కూడా పెద్ద ఎత్తున ప్రచురితమైందన్నారు. డ్రామాల జగన్ రెడ్డి... ప్రాజెక్టుల కోసం మాట్లాడడం సిగ్గు చేటని మంత్రి సవిత విరుచుకుపడ్డారు. అయిదేళ్లలో జగన్ రాయలసీమలో ఎక్కడైనా ఒక్క పిల్ల కాలువ తవ్వారా? అని ప్రశ్నించారు. కొత్త ప్రాజెక్టులు కట్టకపోగా, ఉన్న ప్రాజెక్టుల నిర్వహణను కూడా పట్టించుకోలేదన్నారు. అన్నమయ్య డ్యామ్ గేట్ కొట్టుకుపోయి 42 మంది మృతిచెందినా జగన్ పట్టించులేదని మంత్రి సవిత మండిపడ్డారు.

# విజయవాడలో ఐఎఎస్ భార్య అనుమానాస్పద మృతి

**విజయవాడ,జనవరి4,ప్రభాతవార్తప్రతినిధి:**విజయవాడలో ఐఏఎస్ అధికారి భార్య అనుమానస్పద స్థితిలో మృతి చెందింది. ఐఏఎస్ అధికారి గుజ్జర కిషో భార్య సత్యదీపిక గొంతుకు ఇన్‌ఫెక్షన్ సోక డంతో గత నెల 31న ఆస్పత్రిలో చేర్పించారు. ఆమె మరుసటి రోజు చికిత్స పొందుతూ మరణించారు. ఆమె మృతి పట్ల బంధువులు అనుమానాలు వ్యక్తం చేస్తూ పటమట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.కిషోర్‌కుమార్ ఏపీమిషన్ ఫర్‌క్లీన్ కృష్ణా కెనాల్ పీడీగా పనిచేస్తున్నారు.

# తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుపట్టిన ప్రభుత్వం

**విజయవాడ,జనవరి4,ప్రభాతవార్తప్రతినిధి:** తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఏపీ ప్రభుత్వం తప్పుబట్టింది.వాస్తవ విరుద్ధ ప్రకటనలు, లెక్కలు తెర మీదకు తీసుకుని రావొద్దని ప్రభుత్వం స్పష్టం చేసిందిజ తన విన్నపం మేరకు చంద్రబాబు రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు నిలిపివేశారని సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలు సరికాదన్న ఏపీ ప్రభుత్వం జగన్ హయాంలో అనుమతులు లేకుండా రాయలసీమ ఇరిగేషన్ లిఫ్ట్ ప్రాజెక్టును చేపట్టింది. జగన్ హయాంలోనే పనులు చేపట్టారు. సీమకు రోజుకు 3 టీఎంసీలు అంటూ గత ప్రభుత్వం హడావిడి చేసింది.



ఆదివారం భోగాపురం ఎయిర్‌పోర్టులో దిగిన తొలి ఎయిర్ ఇండియా విమానం

# మన సంబంధాలు బలోపేతం

>> తెలిపారు. ఈ మహాసభల్లో తనకు ప్రసంగించే అవకాశం కల్పించడం అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలతో ఉగాది పండుగను మారిషస్‌లో ఘనంగా నిర్వహించుకుంటామని చెప్పుకొచ్చారు. మారిషస్‌లో జాతీయ సెలవు దినంగా ప్రకటించి ఉగాది పండుగను చేసుకుంటున్నామని వెల్లడించారు. భాష, సంస్కృతి కాపాడటం ప్రతి దేశం బాధ్యత మాత్రమే కాదని.. అవసరం కూడా అని సూచించారు. అచెంచలమైన ప్రపంచానికి మార్గదర్శిగా తెలుగు భాషను అందించారని వివరించారు. దేశంలో అత్యధికంగా మాట్లాడే మూడో భాషగా తెలుగు గుర్తింపు పొందిందని తెలిపారు. 50 దేశాల్లో తెలుగును ఎక్కువగా మాట్లాడుతుండటం భాషకు ఉన్న గొప్పదనానికి నిదర్శనమని చెప్పుకొచ్చారు. తెలుగు తమ సంస్కృతిలో అంతర్భాగంగా ఉందని తెలిపారు. ఇండియా, మారిషస్‌లను కలిపే సాంస్కృతిక బంధాలుగా తెలుగు ఉందని వివరించారు. ఈ మహాసభలు తెలుగు ప్రవాసాంధ్రులు, ఖండాల మధ్య అనుబంధాన్ని పెంపొందింపజేస్తుందని ధరమ్ బీర్ గోకుల్ వెల్లడించారు.

**ఆర్థిక అభివృద్ధిలో కీలకమార్పు:** 'మారిషస్ దేశ సామాజిక, ఆర్థిక అభివృద్ధిలో కీలకమార్పు తీసుకురావడంలో తెలుగు సమాజం ఎంతో పాటుపడుతోంది. మారిషస్‌లో తెలుగు భాషను ప్రాథమిక, ద్వితీయ, తృతీయ భాషగా గుర్తించి విద్యాలయాల్లో బోధిస్తున్నాం. ఏపీ నవంబర్ 1వ తేదీన ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని మారిషస్‌లో సాంస్కృతిక వేడుకగా నిర్వహించుకుంటారు. తెలుగు భాష విద్య సంస్కృతిని కాపాడటంలో మారిషస్ తెలుగు మహాసభ ముఖ్య పాత్ర పోషిస్తోంది. ప్రపంచంలో అత్యంత ఎత్తయిన 108 అడుగుల వేంకటేశ్వరస్వామి విగ్రహంతో ఆలయం మారిషస్‌లో ఉంది. మహత్తరమైన వేంకటేశ్వరస్వామి విగ్రహం ఆధ్యాత్మిక, భౌగోళికంగా, భిన్న ఖండాల భక్తులను ఏకం చేస్తోంది'ధరమ్ బీర్ గోకుల్ అని సూచించారు.

**జాతీయ ఐక్యత పెరిగింది:**'మహాసభలను ఘనంగా నిర్వహిస్తూ తెలుగుపై చూపుతోన్న అంకిత భావానికి ఆంధ్ర సారస్వత పరిషత్‌ను అభినందిస్తున్నా. ఈ మహాసభల్లో జరిగిన చర్చలు, ఫలితాలు ప్రపంచంలో తెలుగు గుర్తింపును బలపరుస్తాయి. భారత్, మారిషస్ దేశాలు పరస్పరం అసాధారణ నాగరికత అనుబంధం కలిగిఉన్నాయి. భారత్, మారిషస్ దేశాలు సాంకేతిక అభివృద్ధిలో పరస్పరం సహకరించుకుంటున్నాయి.ఇరుదేశాల మధ్య వైవిధ్యాన్ని పెంపొందిస్తే జాతీయ ఐక్యతను, పరస్పర అవగాహనను పెంపొందింపజేస్తాయి. మారిషస్ జాతీయ నిర్మాణంలో మారిషస్‌లోని తెలుగు సమాజం చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తోంది' అని మారిషస్ దేశాధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్ వ్యాఖ్యానించారు.

# నీళ్ల లెక్కలు త్వరలో అన్నీ బయటపెడతా!

>> స్పష్టం చేసింది. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపకం వివాదం నేపథ్యంలో ఈ అంశం ఇప్పుడు చర్చనీయాంశమైంది. కాగా, రాష్ట్రం లో నీటి వనరుల నిర్వహణ, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పురోగతి (రాయలసీమ లిఫ్ట్, పట్టిసీమ వంటివి)కి సంబంధించి ఏపీ సీఎం చంద్రబాబు స్పష్టతనిచ్చే అవకాశం ఉంది. పోలవరం, వెలిగొండ వంటి మేజర్ ప్రాజె క్టులతో పాటు ఈ నీటి పంపకాలు ఏపీ రైతులకు కీలకం. చంద్రబాబు త్వరలో వివరణ ఇవ్వనుండడంతో ఈ అంశం మీద మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# రాష్ట్ర పండుగగా వడ్డే ఓబన్న జయంతి

**విజయవాడ,.జనవరి4,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామానికి ముందే దక్షిణ భారతదేశంలో బ్రిటీష్ వలస పాలకుల ఆగడాలు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా మొట్టమొదటి స్వాతంత్ర్య పోరాటం జరిపిన రేనాటి యోధుడు వడ్డే ఓబన్న జయంతి వేడుకలను ఈ నెల 11వ తేదీన రాష్ట్ర పండుగగా నిర్వహించనున్నట్టు బీసీ సంక్షేమ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఓబన్న జయంతిని అన్ని జిల్లా కేంద్రాల్లోనూ, అనంతపురం పట్టణంలో రాష్ట్ర స్థాయి జయంతిని నిర్వహించనున్నామన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వరరావు నేతృత్వంలో వడ్డెర సామాజిక వర్గీయులు మంత్రి సవితను కలిసి, వడ్డే ఓబన్న జయంతిపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, బీసీల ఆత్మగౌరవానికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తూ, విశ్వకర్మ, వాల్మీకి, కనకదాస, భగీరథ, వడ్డే ఓబన్న, గౌతు లచ్చన్న జయంతులను అధికారికంగా నిర్వహించామన్నారు. బీసీల ముద్దుబిడ్డ, స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతిని ఈ నెల 11న రాష్ట్ర పండుగగా నిర్వహించనున్నామన్నారు. అనంతపురం పట్టణంలో ఓబన్న రాష్ట్ర స్థాయి జయంతిని ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఓబన్న జయంతికి రాష్ట్ర పండుగగా నిర్వహించేలా గతంలోనే కూటమి ప్రభుత్వం శాశ్వత జీవో జారీచేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. బ్రిటీష్ పాలకుల దౌర్జన్యానికి వ్యతిరేకంగా రేనాటి వీరుడు వడ్డే ఓబన్న చేసిన పోరాట పటిమను భవిష్యత్ తరాలవారికి తెలియజేయాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయన జయంతి నిర్వహణను రాష్ట్ర పండుగగా నిర్వహించాలని నిర్ణయించారన్నారు. వడ్డే ఓబన్న జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించడంపై ఆయన సామాజిక వర్గీయులు హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా సీఎంచంద్రబాబుకు,మంత్రి సవితకు ధన్యవాదాలుతెలియజేశారు.ఈ కార్యక్రమంలో వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వరరావు, డైరెక్టర్లు, వడ్డెర సామాజిక వర్గీయులు పాల్గొన్నారు.

# అఖిల భారత రాష్ట్రీయ శైక్షిక మహాసంఘ్ డైరీ ఆవిష్కరించిన వెంకయ్య నాయుడు

**విజయవాడ.జనవరి4,ప్రభాతవార్తప్రతినిధి:**అఖిల భారత రాష్ట్రీయ శైక్షిక మహాసంగ్(ఎ.బి.ఆర్.ఎస్.ఎం.) 2026 సంవత్సరానికి సంబంధించిన క్యాలెండర్‌ను మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు ఆదివారం సాయంత్రం విజయవాడ ఆవిష్కరించారు. దేశవ్యాప్తంగా వివిధ విద్యాసంస్థల అధ్యాపకులతో ఏర్పాటు అయిన ఈ సంస్థ సభ్యుల వృత్తిపరమైన అంశాలు, శిక్షణ, సదస్సులు వంటి అనేక కార్యక్రమాలు చేపడుతుంది. విజయవాడ నగరం బందరు రోడ్డుని ఒక హోటల్లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎ.బి.ఆర్.ఎస్.ఎం. ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు ప్రొఫెసర్ రామిరెడ్డి, కార్యదర్శి ప్రొఫెసర్ సుబ్రహ్మణ్యం, ఈసీ సభ్యులు డా. బాలకృష్ణ, డా. జి.అనిత ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# 2036 ఒలింపిక్స్‌కు భారత్ ఆతిథ్యం

>> సంస్థల నుంచి 58 జట్లు పాల్గొంటున్నాయి. సుమారు 1,000 మందికి పైగా క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు. ఈ టోర్నీ ద్వారా భారతీయ వాలీబాల్‌లో ఉన్న అత్యుత్తమ ప్రమాణాలు, క్రీడా స్ఫూర్తి వెలుగులోకి వస్తాయని నిర్వాహకులు పేర్కొంటున్నారు.

## వారం - వర్జ్యం

05-01-2026, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
పుష్యమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, కృష్ణపక్షం,పూర్వాషాఢ కార్తె
విదియ ఉ.9.59
పుష్యమి మ.1.29
వర్జ్యం : రా.1.41-3.13, 2)మ.2.50-3.35
దు.మ.12.36-1.21, సా.5.30-6.30
శుభసమయం : ఉ.9.45-10.30
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** సన్నిహితుల నుండి కీలక సమాచారం అందుకుంటారు. విందు, వినోదాలు, శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు.

**వృషభం:** మీ మాటలకు వక్రభాష్యాలు చెప్పేవారు అధికంగా ఉంటారు. తగు జాగ్రత్తలు పాటించండి.

**మిథునం:**ప్రజా సంబంధాలు అధికంగా కలిగినటువంటి వ్యాపారస్తులకు అను కూలంగా ఉంటుంది. సదృష్టి అధికంగా ఉంటుంది.

**కర్కాటకం:**మీ ఆత్మ గౌరవానికి మచ్చ తేవడానికి ప్రత్యర్థులు చేసే ప్రయత్నాలు ఫలించవు. వెన్నునొప్పి బాధిస్తుంది.

**సింహం:** సనాతన విద్యల పట్ల ఆసక్తిని కనబరుస్తారు. ఒక సమస్య తీరితే మరో సమస్య పరిష్కరించుకోవలసి వస్తుంది.

**కన్య:** ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. మిత్రులకు మీ వంతు సహాయం అందిస్తారు. సంబంధబాంధవ్యాలు మెరుగుపడతాయి.

**తుల :** జీవిత భాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. విలువైన వస్తువులు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

**వృశ్చికం:**దూర ప్రాంతాల నుండి కీలక సమాచారం అందుకుంటారు. షేర్లు భూముల క్రయ విక్రయాలు ప్రోత్సాహకరంగా వుంటాయి.

**ధనుస్సు:** ముఖ్యమైన కార్యక్రమాలు నెమ్మదిగా పూర్తి కాగలవు. ఆరోగ్య సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు.

**మకరం:**స్థిరాస్తి వివాదాలు, కోర్టుకేసులు పరిష్కార దశకు చేరుకుంటాయి. ఉద్యోగులకు బదిలీలు వుంటాయి.

**కుంభం:**ఓర్పు, నేర్పులతో ముఖ్య వ్యవహారాలు సానుకూల పరుచుకునే యత్నాలు చేస్తారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు.

**మీనం:** మీ మనస్సులోని మాటను ఇతరులకు తెలియనివ్వకుండా జాగ్రత్త పడతారు. వ్యాపారాలలో స్వల్ప మార్పులు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



## "మన శంకరవరప్రసాద్" విజయవంతం కావాలని వేడుకున్నాం

తిరుమల, జనవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి: సినీనటుడు చిరంజీవి, నయనతార నటించిన 'మన శంకర వరప్రసాద్" చిత్రం ఈనెల 12న విడుదల కానుందని, ఆ చిత్రం విజయవంతం కావాలని ఏడుకొండల వేంకటేశ్వర స్వామిని ప్రార్థించినట్లు చిత్ర నిర్మాత సాహు గారపాటి, గేయ రచయిత రామజోగయ్యశాస్త్రి తెలిపారు. చిత్రం విజయవంతంకోసం ఆదివారం ఉదయం తిరుమలకు చేరుకుని స్వామివారిని దర్శించుకున్నట్లు చెప్పారు. చిత్ర దర్శకుడు అనిల్ రావిపూడి నిర్మాతతో కలసి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆదివారం సాయంత్రం 4గంటలకు చిత్రం ట్రైలర్ విడుదలైంది.

## ఆలయ గోపురం పైకెక్కిన నిందితుడికి రిమాండ్

తిరుమల, జనవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి: ఆధ్యాత్మికనగరం తిరుపతి నగరనడి బొడ్డున కొలువైన గోవిందరాజస్వామి ఆలయ మహాద్వారం రాజగోపురంపైకి మద్యంమత్తులో ఎక్కిన నిందితుడు తిరుపతి(43)ని తిరుపతి తూర్పు పోలీసులు అరెస్ట్ చేశారు. ఆలయ తలుపులు మూసివేసిన తరువాత శుక్రవారం రాత్రి అనధికారికంగా ఆలయంలోనికి వెళ్ళి భక్తుల మనోభావాలు దెబ్బతీసేవిధంగా వ్యవహరించిన అతనిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపడం జరిగిందని తిరుపతి డిఎస్పీ భక్తవత్సలం, సిఐ శ్రీనివాసులు తెలిపారు. తిరుపతి నడిబొడ్డున చుట్టూ ప్రజలే కాపలాగా ఉన్న గోవిందరాజస్వామి ఆలయంలో భద్రత తీసికట్టుగా తయారవడం, శుక్రవారం రాత్రి ఆలయం తలుపులు మూసివేసిన తరువాత 11గంటల ప్రాంతంలో మద్యం మత్తులో ఉన్న తెలంగాణ నిజామాబాద్ జిల్లా కూర్మవాడ పెద్దమల్లారెడ్డికాలనీకి చెందిన "కుతడి తిరుపతి"(43) గోడదూకి గోపురంపైకి చేరి భయాందోళన గొల్పించాడు. ఆలయ భద్రతకు భంగం వాటిల్లేలా ప్రవర్తించడంతో తిరుపతివాసులు తీవ్రంగా పరిగణించారు. అతనిని ఎట్టకేలకు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది త్రాళ్ళ సాయంతో క్రిందకు తీసుకురావడం జరిగింది. ఈ తప్పిదాలకు కారణమైన టిటిడి జమేదార్ పట్టాభిరెడ్డిపై చర్యలు తీసుకున్నారు. అతనిని ఆలయం నుండి తప్పించారు.

## హైకోర్టుకు చేరిన వేదిక్ వర్సిటి రగడ
### రిట్ పిటిషన్ దాఖలుచేసిన మాజీ విసి

తిరుపతి, జనవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర వేదిక్ విశ్వవిద్యాలయంలో పలుఅంశాలపై రగడ హైకోర్టుకు చేరింది. ఇప్పటికే విసిగా అనర్హుడుగా తొలగించిన రాణి సదాశివమూర్తి హైకోర్టులో రిట్‌పిటిషన్ దాఖలు చేయడం సంచలనంగా మారింది. గత వైసిపి ప్రభుత్వంలో గత టిటిడి బోర్డు రాణి సదాశివమూర్తిని వేదిక్ వర్సిటీ విసిగా నియమించింది. ఆయనపై అప్పట్లోనే పలు అరోపణలు దుమారం రేపాయి. ఈ నేపథ్యంలో ఇటీవల ఆయనను విసిగా తోలగిస్తూ టిటిడి బోర్డు తీర్మానించింది. ఈ విషయంపై హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలుతో రాష్ట్ర ప్రభుత్వం, ఎక్స్ ఎఫిషియో కార్యదర్శి, టిటిడి, సివిఎస్‌ఒను ప్రతివాదులగా చేర్చారు. విసి పదవికి ఆయన అనర్హుడని విజిలెన్స్ నివేదికల ఆధారంగా తొలగిచింది. ఆయన హైకోర్టును ఆశ్రయించడంతో ఏం జరగనుందనేది చూడాల్సిందే.

# ఉద్యోగుల హక్కులు పరిరక్షిస్తాం

- ప్రభుత్వ ఉద్యోగులే ప్రభుత్వానికి వారధులు
- దేశానికి సందేశం ఇచ్చేలా బిసి, ఓబిసి ఉద్యోగుల సదస్సు నిర్వహణ: మంత్రి ఎస్.సవిత
- బిసిల రక్షణ కోసం 'బిసి రక్షణ చట్టం': మంత్రి కొల్లు రవీంద్ర

సచివాలయం, జనవరి 4 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం బిసి ఉద్యోగులకు వెన్నుదన్నుగా ఉంటూ వారికి ఎంతో ప్రాముఖ్యాన్ని ఇస్తుందని రాష్ట్ర బిసి చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. స్థానిక తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బిసి, ఓబిసి ఉద్యోగుల రాష్ట్ర మహాసభ కు మంత్రి సవిత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బిసి ఉద్యోగుల క్యాలెండర్, డైరీ ఆవిష్కరించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ దేశానికి మంచి సందేశం ఇచ్చేలా బిసి, ఓబిసి ఉద్యోగుల సదస్సు నిర్వహణ ఉందన్నారు. ఒక బిసి మంత్రిగా కార్యక్రమంలో పాల్గొనడం తనకు గర్వకారణమన్నారు. ఈ మహాసభను విజయవంతం చేసిన బిసి అసోసియేషన్ అధ్యక్షులు గుత్తుల వీరబ్రహ్మం, గౌరవాధ్యక్షులు అప్పారావు సహా ఇతర బిసి నాయకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. మహాత్మా జ్యోతిరావు ఫూలే, సావిత్రిబాయి ఫూలే ఆశయాలను రాష్ట్రంలో అమలు చేసిన తొలి నాయకుడు స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు అని కొనియాడారు. బిసిలకు రిజర్వేషన్లు కల్పించి వారు రాజకీయంగా పారిశ్రామికంగా ఎదిగేలా చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆ ఒరవడిని కొనసాగిస్తూ బిసి ఉద్యోగుల పక్షపాతిగా అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో ఉద్యోగుల భయాలకు తావులేకుండా ప్రశాంతంగా పనిచేసే పరిస్థితి ఉందని భరోసా ఇచ్చారు. బిసి, ఓబిసి వర్గాల అభివృద్ధికి విద్యే కీలకమని, డిఎస్సీ, సివిల్ సర్వీసెస్ కోచింగ్‌లు, బిసి హాస్టళ్ళు, గురుకుల పాఠశాలల ఆధునికీకరణ ద్వారా ప్రభుత్వం మద్దతు ఇస్తుందన్నారు. ఏప్రిల్ 11న మహాత్మా జ్యోతిరావు ఫూలే జయంతిని రాష్ట్రస్థాయిలో ఘనంగా నిర్వహించేలా ముఖ్యమంత్రితో చర్చిస్తానన్నారు. రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా బిసి, ఓబిసి ఉద్యోగుల



కోసం ప్రత్యేకంగా అమరావతిలో ఈ మహాసభ జరగడం చారిత్రాత్మకమన్నారు. గతంలో బిసిలపై జరిగిన ఆణచివేతకు ఈ సభ ధైర్యాన్ని ఇచ్చిందని, భవిష్యత్తులో బిసిల వైపు చూడాలంటే భయపడేలా బీసీల రక్షణ కోసం ప్రత్యేక "బిసి రక్షణ చట్టం" తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తుందని తెలిపారు. బిసి ఉద్యోగులతో 26జిల్లాల కమిటీలను వేయడం అభినందించాల్సిన విషయమన్నారు. బిసి ఉద్యోగుల సంఘం నేత గుత్తుల వీరబ్రహ్మం మాట్లాడుతూ, రాష్ట్రంలో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్, రెగ్యూలర్ విభాగాల్లో కలిపి 7లక్షల మంది బిసి ఉద్యోగులున్నారని తెలిపారు. మహాత్మా జ్యోతిరావు ఫూలే జయంతి ఏప్రిల్ 11ను ప్రభుత్వ సెలవుగా ప్రకటించాలని, బిసిలకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు, క్రీమిలేయర్ తొలగింపు, బిసి అట్రాసిటి చట్టం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో బిసి వెల్ఫేర్ ముఖ్య కార్యదర్శి సత్యనారాయణ, బిసి, ఓబిసి ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ అసోసియేట్ ప్రెసిడెంట్ కేదారేశ్వరరావు, జనరల్ సెక్రటరీలు పి.శ్రీధర్, భూషణ్‌రావు, ట్రెజరర్ వై.శంకర్‌రావు, 26జిల్లాల ఉద్యోగులు పాల్గొన్నారు.

# కరెంటు చార్జీలు తగ్గించేందుకు సర్కార్ కసరత్తు

- సూర్యఘర్ పేదలకు వరం
- విద్యుత్ రంగాన్ని గత సర్కార్ నాశనం చేసింది: మంత్రి పార్థసారథి



నూజివీడు, జనవరి 4 ప్రభాత వార్త: రాష్ట్రంలో రానున్న రోజులలో విద్యుత్ చార్జీలు మరింత తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. నూజివీడులోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం పత్రికా విలేఖరుల సమావేశంలో మంత్రి పార్థసారధి మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే చార్జీలు పెంచబోమనే మాటకు తాము కట్టుబడి ఉన్నామని, అంతేకాక ప్రస్తుతం ఉన్నా విద్యుత్ చార్జీలు తగ్గించేందుకు సిఎం చర్యలు తీకుంటున్నారన్నారు. ప్రజలకు మంచి చేసే తమ ప్రభుత్వం ట్రూ డౌన్‌తో రూ.4789 కోట్ల మేర విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై వేయకుండా తగ్గించిందన్నారు. 2019 ముందు తమ ప్రభుత్వ సమయంలో వేలాది కోట్ల రూపాయలతో సోలార్, విండ్ పవర్ ప్లాంట్లు నెలకొల్పి రూ.2.49లకే విద్యుత్ అందిస్తామని కంపెనీలు ముందుకు వచ్చినా, కక్షపూరిత ధోరణితో గత ప్రభుత్వం వ్యవహరించిందన్నారు. రూ.5.19, రూ.5.50ల అధిక రేట్లకు ఓపెన్ మార్కెట్‌లో విద్యుత్ కొనుగోలుకు అగ్రిమెంట్ కుదుర్చుకుని, విద్యుత్ భారాన్ని ప్రజల నెత్తిన వేశారన్నారు. గత ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయం కారణంగా ట్రూ అప్ పేరుతో రూ.4,789 కోట్లు ప్రజలపై విద్యుత్ చార్జీల భారం పడిందన్నారు. ఆ భారం ప్రజలపై వేయకుండా తమ ప్రభుత్వమే భరిస్తుందని, తమ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సుపరిపాలనకు ఇది నిదర్శనమన్నారు. ఒక విజనరీ కలిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ప్రజలకు సుపరిపాలన ఫలాలు అందుతున్నాయన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నిలిపేందుకు ముఖ్యమంత్రి అహర్నిశలు కృషి చేస్తున్నారని, రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి బాటలో నిలిపేందుకు విదేశాల నుండి లక్షల కోట్ల రూపాయలతో పెట్టుబడి పెట్టేలా పారిశ్రామికవేత్తలను ఒప్పించి పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారని, వీటి ద్వారా లక్షలాదిమంది యువతకు ఉద్యోగ అవకాశాలు కలుగుతాయన్నారు. సూర్య ఘర్ యోజన పథకం కింద పేదలకు సోలార్ విద్యుత్ యూనిట్లు అందిస్తున్నామన్నారు. రైతులు పొలాల్లో సోలార్ విద్యుత్ యూనిట్లు ఏర్పాటు చేసుకుంటే ప్రోత్సాహం అందిస్తామన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, గంజాయి నిర్మూలనకు చర్యలు తీసుకుంటు న్నామని, గత ప్రభుత్వం పంచాయతీల నిధులు పంచాయతీ సిబ్బందికి తెలియకుండానే మాయం చేసిందన్నారు. ఉపముఖ్యమంత్రి పంచాయతీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేస్తున్నారని, రాష్టంలోని గ్రామాలలో 5 వేల కిలోమీటర్ల మేర రోడ్లు, ప్రతీ ఇంటికీ త్రాగునీటి పైప్ కనెక్షన్ అందిస్తున్నారని మంత్రి పార్థసారథి వివరించారు.

## తిరుమల సమాచారం



## వేడుకగా కలహా శృంగార భరిత ఉత్సవం

తిరుమల, జనవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి: ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశి పర్వదినం తరువాత ఐదవరోజు ఆదివారం తిరుమలలో కలహా శృంగార భరితమైన ప్రణయ కలహోత్సవం జరిగింది. సాయంత్రం నిత్యకైంకర్యాలు ముగిసిన తరువాత శ్రీదేవి భూదేవి సమేత మలయప్పస్వామి ఊరేగింపుగా ఆలయం మాఢవీధుల్లో ఉత్తరమాఢ వీధికి చేరుకున్నారు. అక్కడ వరాహస్వామి ఆలయం సమీపంలో అమ్మవార్లు, స్వామివారు ఎదురేగారు. ఆలయ అర్చకులు, పరిచారకులు స్వామి అమ్మవార్ల తరపున పూలబంతులను విసిరేసుకుంటూ స్వామివారిని నిందాస్తుతి చేసి పాశురాలను పారాయణం చేశారు. అమ్మవార్ల నుండి తప్పించుకుని ఆలయంలోనికి ఒకే పల్లకిలో వేంచేపు చేశారు. ఈ కార్యక్రమంలో జీయంగార్లు, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, అర్చకులు పాల్గొని ఆసక్తికర సన్నివేశాలను తిలకించారు.



వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లలో బారులు తీరిన శ్రీవారి భక్తులు

### వారాంతం.. వైకుంఠద్వారం
## కొండంతా భక్తజనం
### బారులు తీరిన భక్తులు... వెంకన్న దర్శనానికి 15గంటలు

తిరుమల, జనవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి: కొనసాగుతున్న వైకుంఠద్వార దర్శనాలు... ఆపై వారాంతం కావడంతో ఆదివారం కూడా తిరుమల కొండ భక్తులతో కిటకిటలాడుతోంది. ఉదయానికి భక్తుల క్యూలైన్లు శిలాతోరణం వద్దకు చేరాయి. సాధారణ సర్వదర్శనంలోనే భక్తులను అనుమతిస్తుండటంతో వైకుంఠ దర్శనానికి భారీగా భక్తులు తరలివస్తుండటంతో వెలుపల క్యూలైన్లలో నుండి భక్తులు వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్‌కు చేరుకోవాల్సి వస్తోంది. ఆదివారం ఉదయానికి కూడా భక్తులతో ఎటుచూసినా జనసంద్రంగా మారింది. ఉదయం 5గంటలకు వైకుంఠం-1, 2లో కంపార్టుమెంట్లు నిండిపోయాయి. నారాయణగిరి ఉద్యానవనాల్లోని షెడ్లు నిండాయి. సర్వదర్శనానికి భక్తులు 20గంటలు నిరీక్షిస్తున్నారు. సాయంత్రానికి మరింతగా భక్తుల రద్దీ పెరిగినా దర్శనానికి 15గంటలు పట్టేసమయం మారింది. తిరుమల క్యూలైన్లలో ఉన్న భక్తులకు వైకుంఠం కంపార్టుమెంట్లలోని భక్తులకు శ్రీవారి సేవకులు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, టి, మజ్జిగ, పాలు, తాగునీరు పంపిణీ చేస్తున్నారు. ఆలయంలో త్వరగా క్యూలైన్లు కదిలేలా టిటిడి అడిషనల్ ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాధం, సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. సాయంత్రం వరకు 43వేల మంది భక్తులు మహాలఘులో దర్శనం చేసుకున్నారు.



## రూ.కోటి విరాళమిచ్చే దాతలకు... ఏడాదిలో 3 రోజులు సుప్రభాతసేవ, విఐపి బ్రేక్ దర్శనాలు

తిరుమల, జనవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి: అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి కోటి రూపాయలు విరాళాలిచ్చే దాతలకు తిరుమల తిరుపతి దేవస్థానం పలు ప్రయోజనాలు చేకూరుస్తోంది. భారీ మొత్తంలో భూరీగా విరాళాలిచ్చిన దాతలకు జీవితకాలంలో దాతతోబాటు మరో నలుగురికి ప్రతి ఏడాదిలో మూడురోజులు సుప్రభాతసేవ దర్శనాలు, మూడురోజులు విఐపి బ్రేక్ దర్శనాలు, నాలుగురోజులపాటు సుపథం ప్రవేశ దర్శనం ద్వారా ఆ దేవదేవుని దర్శనం చేసుకునే వెసలుబాటు కల్పించారు. ఈ ప్రయోజనాలతో బాటు ఒకసారి 10 పెద్ద లడ్డూలు, 20 చిన్నలడ్డూలు, ఒక దుప్పట, రవికె, 10 మహాప్రసాదం ప్యాకెట్లు బహుకరిస్తారు. ఏడాదిలో ఒకసారి దాతలైన భక్తులకు వేద ఆశీర్వచనం వంటి సౌకర్యం పొందవచ్చు. తిరుమలలో 3వేల రూపాయలు అద్దెతో కూడిన వసతి గదుల సదుపాయం మూడురోజులు కల్పిస్తారు. జీవిత కాలంలో దాతకు ఒకసారి ఐదు గ్రాముల బంగారు డాలర్, 50గ్రాముల వెండిడాలర్‌ను తగిన ఆధారాల్నికార్యాలయంలో చూపి పొందవచ్చు.

### మదినిండా దేవదేవుని దర్శనం

ఒక్కసారి గోవింద.. గోవిందా... నామంతో మనస్ఫూర్తిగా ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని మదిలో తలచుకుని మొక్కుకుంటే తమ కష్టాలు తీరిపోతాయని హిందూ భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఆనందనిలయంలో కొలువైనా వేంకటేశ్వరస్వామిని ఎన్నిసార్లు దర్శనం చేసుకున్నా మళ్ళీ మళ్ళీ ఆ దివ్యమంగళరూపాన్ని చూడాలనే తాపత్రయం భక్తులకు కలుగుతుంది. సామాన్యభక్తులు ఆ దేవుని క్షణకాల దర్శనం కోసం పరితపిస్తుంటే ధనవంతులైన ,కోటీశ్వరులైన భక్తులకు, దాతలకు తిరుమల తిరుపతి దేవస్థానం బహుళ ప్రయోజనాలు చేకూరుస్తోంది. గతంలో కోటి రూపాయలు, దాతలు 1.50 కోట్ల రూపాయలు విరాళమిస్తే వారికి ఏడాదిలో ఆరు మందికి ఉదయాస్తమాన సేవదర్శనం టిక్కెట్ (తెల్లవారుజామున సుప్రభాతం నుండి సాయంత్రం సహస్రదీపాలంకారసేవ వరకు) ఆలయం లోపల కులశేఖరపడివద్ద నుండి వేంకటేశ్వరస్వామి కొలువైన ముందుకు వెళ్ళి తనివితీరా దర్శనం చేసుకునే వెసలుబాటు కల్పించింది. అంతేగాక ఆ భక్తులకు సుప్రబాతం, తోమాల, అర్చన సేవలు కొందరు గృహస్థభక్తులు, విఐపి బ్రేక్‌కు మరికొందరు గృహస్థభక్తులను దాత తీసుకెళ్ళే ప్రయోజనం ఉండేది. ఆ విరాళాల్లో కొంత మార్పుచేసి కోటి రూపాయలు విరాళమిస్తే ఆ దాతలకు ఏడాదిలో మరిన్ని ప్రయోజనాలు, దేవుని దర్శనం, వసతి, ప్రసాదాలు అందించే దిశగా కార్యాచరణ రూపొందించి అమలుచేస్తారు. తిరుమలలో ప్రత్యేక ఉత్సవాలు జరిగే రోజుల్లో మినహాయించి మిగిలిన రోజుల్లో కోటి విరాళమిచ్చిన భక్తులు తమకు కల్పించిన ప్రత్యేక సౌకర్యాలను సద్వినియోగం చేసుకునే వెసలుబాటు కల్పించారు.


### రూ.కోటి విరాళాలివ్వాల్సిన పథకాలు

దాతలు కోటిరూపాయలు విరాళాలివ్వాల్సిన టిటిడి ట్రస్టులలో కాటేజీ డొనేషన్ స్కీం, ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్, ఎస్వీ విద్యాదాన ట్రస్ట్, బర్డ్ ట్రస్ట్, ఎస్వీ అన్నదాన ట్రస్ట్, ఎస్వీ గోసంరక్షణ ట్రస్ట్, ఎస్వీ సర్వశ్రేయాస్ ట్రస్ట్, ఎస్వీ వేదపరిరక్షణ ట్రస్ట్, శ్రీవాణి ట్రస్ట్, ఎస్‌విబిసి ట్రస్ట్, బాలాజీ ఆరోగ్యవరప్రసాదిని స్కీమ్‌లకు దాతలు విరాళాలు చెల్లించి సౌకర్యాలను పొందవచ్చని టిటిడి తెలిపింది. దాతలు టిటిడి వెబ్‌సైట్ "డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. టిటిదేవస్థానమ్స్.ఎపి.జిఓవి.ఇన్"లో ఆన్‌లైన్ ద్వారా విరాళాలు చెల్లించవచ్చు. ఆఫ్‌లైన్‌లో దాతలు విరాళాలను ఇఒ టిటిడి పేరున డిడి, చెక్‌లను తిరుమలలోని దాతల విభాగంలో (డోనార్‌సెల్) అందజేయవచ్చు.

### మార్చి 3న సంపూర్ణ చంద్రగ్రహణం
## శ్రీవారి ఆలయం మూత

తిరుమల, జనవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి: సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా మార్చి 3వ తేదీ మంగళవారం 10.30 గంటలు పాటు తిరుమలేశుని ఆలయాన్ని మూసివేస్తున్నారు. ఆరోజు సాయంత్రం 3.20గంటల గంటలకు గ్రహణం ప్రారంభమై సాయంత్రం 6.47గంటలకు పూర్తవుతుంది. సాధాణంగా గ్రహణ సమయానికి ఆరుగంటలు ముందుగా ఆలయం తలుపులు మూసివేయడం ఆనవాయితీ. మార్చి 3వ తేదీ ఉదయం చంద్రగ్రహణం ప్రభావంతో ఉదయం 9గంటల నుండి సాయంత్రం 7.30గంటల వరకు శ్రీవారి ఆలయ తలుపులు మూసివేసి అన్ని దర్శనాలను రద్దుచేశారు. సాయంత్రం 7.30గంటలకు ఆలయం తలుపులు తెరచి శుద్ధి, పుణ్యాహవచనం నిర్వహిస్తారు. అనంతరం రాత్రి 8.30 గంటలకు శ్రీవారి భక్తులకు స్వామివారి దర్శనం పునఃప్రారంభమవుతుంది. ఆరోజు ఆలయంలో జరగాల్సిన అష్టదళ పాద పద్మారాధన సేవ, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలను టిటిడి రద్దుచేసింది. దేశవిదేశాల్లో ఉన్న శ్రీవారి భక్తులు గమనించి తిరుమల యాత్ర ప్రణాళికలు రూపొందించుకోవాలని టిటిడి కోరింది.

## రేపు తిరుమలకు మారిషస్ అధ్యక్షుడు రాక



తిరుమల, జనవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి: మారిషస్ దేశ అధ్యక్షుడు ధరంబీర్‌గోకుల్ రెండురోజుల తిరుపతి జిల్లా పర్యటనకు మంగళవారం సాయంత్రం తిరుపతికి విచ్చేస్తున్నారు. ఆయన 6, 7తేదీల్లో శ్రీకాళహస్తి ఆలయం, తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్నారు. అంతర్జాతీయ స్థాయి ప్రముఖుని పర్యటనతో తిరుపతి జిల్లా యంత్రాంగం ముందస్తు భద్రతా ఏర్పాట్లు చేపడుతోంది. జిల్లా ఇన్‌ఛార్జి సంయుక్త కలెక్టర్ ఎన్.మౌర్య, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఇతర ఉన్నతాధికారులు కలసి ఆదివారం భద్రత, ప్రోటోకాల్ ఏర్పాట్లపై సమీక్షించారు. అందరూ కలసికట్టుగా పర్యటనను విజయవంతం చేయాలని, విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని మౌర్య సూచించారు.

## ఖాళీ మద్యం సీసాలెలా వచ్చాయి!?



# ఎవరిదీ పాపం?
### పుణ్యక్షేత్ర పవిత్రతను దెబ్బతీస్తున్న మందుబాబులు
### ఆరా తీస్తున్న పోలీసులు, విజిలెన్స్ అధికారులు

తిరుమల, జనవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి: పవిత్ర పుణ్యక్షేత్రం తిరుమల పవిత్రతను మంటగలుపుతున్న పాపం ఎవరిదనే వెదికి పట్టుకోవాల్సిన అవసరం పోలీసులు, టిటిడి విజిలెన్స్‌పై ఉంది. తరచూ తిరుమలకు మద్యం బాటిళ్ళతో రావడం, మాంసాహార భోజనాలు తీసుకురావడం పట్టుబడటం వంటి ఘటనలు జరిగిపోతున్నాయి. ఇప్పుడు తిరుమల బాలాజీనగర్ ప్రాంతంలోని ఖాళీస్థలంలో కొన్ని మద్యం ఖాళీ సీసాలు, శీతల పానీయాల సీసాలు పడిఉండటంతో పెద్ద కలకలం రేపింది. ఆదివారం ఉదయం కొందరు యాత్రికులు గమనించి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేశారు. ఖాళీస్థలంలో ముళ్ళచెట్ల మధ్య ఖాళీ సీసాలు పడేసింది ఎవరు, అక్కడకు ఎలా తీసుకువచ్చారనేది ఇప్పుడు తేల్చాల్సిన అసలు విషయం. తిరుమలను పూర్తిగా మద్యం, మాంసం, ధూమపానం రహిత క్షేత్రంగా తీర్చిదిద్దాలనే ఆశయంతో దేవాదాయశాఖ చట్టం తీసుకువచ్చింది. ఈ చట్టం అమలు పటిష్టంగా జరుగుతున్నా కొందరు నిబంధనలకు తిలోదాకాలిచ్చేస్తున్నారు. ఆర్టీసి బస్సుల్లో, ప్రైవేట్ ట్యాక్సీల్లో మద్యం సీసాలు తిరుమలకు తీసుకువస్తున్న వారెవరనేది ఇప్పటికే పోలీసులు సమాచారం సేకరించారు. టిటిడి విజిలెన్స్ కూడా ఈ విషయంపై తీవ్రంగానే సెర్చ్‌ఆపరేన్ మొదలుపెట్టింది. తాజాగా ఆదివారం ఉదయం బాలాజీనగర్ ప్రాంతంలో ఖాళీ మద్యం సీసాలు ఉండటంతో పెద్ద దుమారం రేగింది. తిరుమల పవిత్రతను కాపాడటంలో టిటిడి ఉద్యోగులు కీలకం. మరీ ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులు, కొందరు మఠాల సిబ్బంది కూడా అలిపిరి తనిఖీ కేంద్రంలో తనిఖీలకు అతీతులుగా మారారు. ట్యాక్సీల్లో ప్రయాణించినా, సొంత వాహనాల్లో వచ్చినా, ఆర్టీసి బస్సుల్లో కార్మికులు తిరుమలకు వస్తున్నా వారంతా ఐడి కార్డులు ధరించి బస్సుల నుండి తనిఖీలకు వెళ్ళడంలేదనేది భక్తుల్లోనూ వ్యక్తమవుతున్న విమర్శలు. తిరుమలకు మద్యం సీసాలతో వస్తున్న వారిని పట్టుకోవడం ఇప్పుడు అటు పోలీసులకు ఇటు విజిలెన్స్‌కు సవాల్‌గా మారింది. మరీ ఈ ఖాళీ మద్యం సీసాలు అక్కడ ఎలా వచ్చాయనేది సిసికెమెరాల పుటేజీలు పరిశీలిస్తున్నారు. తిరుపతి, తిరుమల పోలీసులు పవిత్రతకు ప్రాధాన్యతనిచ్చి కాపాడటంలో చిత్తశుద్దితో ఉన్నామనే ప్రకటన చేశారు.

## దేవుని చెంత ఒక్కటయ్యే జంటలు...



# ఆన్‌లైన్‌లోనే బుకింగ్!
### కల్యాణ వేదికలో సకల సౌకర్యాలతో ఉచిత వివాహాలు

తిరుమల, జనవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి: నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న తిరుమలకొండపై ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ఆయన చెంత పేద, మధ్యతరగతి వర్గాల యువతీయువకులు ఉచితంగా కల్యాణాలు చేసుకునేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో కల్యాణవేదిక ఉంది. పాపవినాశనమ్ మార్గంలో అత్యాధునిక సౌకర్యాలతో కల్యాణవేదికను నిర్మించి అందులో అన్ని సౌకర్యాలు కల్పిస్తోంది. ఇందుకు తెలుగురాష్ట్రాల నుండేగాక దేశం నలుమూలల నుండి కూడా యువతీయువకుల కుటుంబాలు ఆన్‌లైన్‌లోనే వారివారికి ఇష్టమైన తేదీల్లో బుక్ చేసుకునేలా అవకాశం ఉంది. తిరుమలలో టిటిడి నిర్వహిస్తున్న ఉచిత వివాహాలకు నూతన వధూవరుల నుండి విశేష స్పందన లభిస్తోంది. 2016 ఏప్రిల్ 25నుండి 2025 తాజా సమాచారం మేరకు 36 వేలకు పైగా జంటలకు వివాహాలు అయ్యాయి. ఇందులో పురోహితుడు, మంగళవాయిద్యంతోబాటు పెళ్ళిసమయంలో పసుపు, కుంకుమ, కంకణంను టిటిడి ఉచితంగా అందిస్తుంది. వివాహానికి అవసరమైన సామాగ్రిని వధూవరులే తీసుకురావాల్సి ఉంటుంది. వివాహానికి వధూవరుల తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరుకావాల్సి ఉంటుంది. పెళ్ళికి రాలేని సందర్భంలో అందుకు సంబంధించి ఆధార పత్రాలను సమర్పించాలి. వివాహానంతరం పెళ్ళి కుమారుడు, పెళ్లి కుమార్తెబాటు ఇరువురు తల్లిదండ్రులను 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శనాల ద్వారా ఆరుమందికి సుపథం క్యూలైన్ ద్వారా ఉచితంగా శ్రీవారి దర్శనం కల్పిస్తారు. దర్శనానంతరం ఆరుమందికి 6 ఉచిత లడ్డూలు కౌంటర్లలో అందుకోవచ్చు.

తిరుమలలోని కల్యాణవేదికలో పెళ్లిచేసుకోవాలనే యువతీ యువకులు ఉచిత వివాహాలు చేసుకునేందుకు ఆన్‌లైన్‌లోనే కల్యాణవేదిక స్లాట్స్ బుక్‌చేసుకునే సదుపాయం ఉంది. 2016 మేనెల నుండి నూతన వధూవరులకు టిటిడి కల్పించింది. ఆయా ప్రాంతాల్లోని నెట్‌సెంటర్‌లలో టిటిడి హెచ్‌టిటిపిఎస్://టిటిదేవస్థానమ్స్.ఎపి.జిఒవి.ఇన్ ద్వారా బుక్‌చేసుకోవాలి. కరెంట్ బుకింగ్, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే జంటలు తప్పనిసరిగా హిందూ మతస్థులై ఉండాలి. వధువుకు 18 సంవత్సరాలు, వరునికి 21 సంవత్సరాలు నిండి ఉండాలి. ద్వితీయ వివాహాలు, ప్రేమ వివాహాలు జరుపబడవు. ఇతర వివరాలకు 0877-2263433 నంబర్‌కు సంప్రదించాలి.

## శ్రీవారి దర్శనంతో సకల శుభాలు: ప్రముఖులు



తిరుమల, జనవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని ధనుర్మాసంలో వైకుంతద్వారంలో దర్శించుకుని ఆశీస్సులు అందుకోవడంతో సకల శుభాలు కలుగుతాయని ప్రముఖులు విశ్వాసం వెలిబుచ్చారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆదివారం ఉదయం నైవేద్య విరామసమయంలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు, రాజస్థాన్ మంత్రి కృష్ణకుమార్, కేంద్ర సహాయమంత్రి ప్రతాపవరావు జిజాదవ్, విశ్రాంత డిజిపి ఆర్‌పి ఠాకూర్ వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. అనంతరం వేదాశీర్వచనం, శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

వార్త

జాతీయ ప్రగతి అంటే శక్తుల శ్రమ, శక్తి, నిజాయితీ. జాతీయ పతనం అంటే వ్యక్తుల సోమరితనం, స్వార్థం, దుర్గుణం.

న-ఖలీల్ జిబ్రాన్

# మదురో బందీ.. దురాక్రమణే!

'కుక్కను చంపాలంటే దానికి పిచ్చిదని పేరు పెట్టాలని' సామెత ఉండనే ఉంది. ఇప్పుడు వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో విషయంలో శ్వేత సౌధాధిపతి ట్రంప్ అదే చేశాడు. తొలుత మదురోను 'నార్కోటిక్ టెర్రరిస్ట్'గా అభి వర్ణించారు. వెనిజులా అనగానే ప్రపంచంలోనే అతిపెద్ద చమురు బావులున్న దేశం. ఇప్పటికే 200ఏళ్లకు పైగా సరిపడ చమురు నిల్వలున్న అమెరికా వెనిజులా చమురు సంపద కోసం తహతహ లాడుతోంది. ఆ నేపథ్యంలోనే తొలుత మదురోను డ్రగ్స్ రాకెట్‌కు పరోక్షంగా మద్దతు ఇస్తున్నారని ఆరోపించారు. గత నెల రోజులుగా కన్నేసి ఉంచిన అమె రికన్ గూఢచారులు మదురో కిడ్నాప్‌కు మార్గం సుగమం చేశారు. ఉన్నట్టుండి శుక్రవారంరాత్రి ఒక్కసారిగా అమెరికన్ సైన్యం వెనిజులా రాజధాని కరాకస్‌పై బాంబులు దాడి చేసింది. గుళ్ల వర్షం కురిపించింది. మొత్తం కరెంటు ఆపేసి ఆపరేషన్ నిర్వహించిన అమెరికన్ బలగాలు ఏకంగా మదురో నిద్రిస్తున్న గదిలోకి ప్రవేశించి ఆయనను ఆయన పట్ట మహిషి సిరియా ఫ్లోర్స్‌ను కూడా అమెరికన్ కమాండోలు బందీగా తీసుకెళ్లారు. అర్ధరాత్రి ఒంటిగంట నాలుగు గంటల మధ్య ఈ ఆపరేషన్ జరిగింది. కరాకస్‌పై అమెరికన్ సైన్యం భీకరదాడులు చేసింది. వెనిజులాను ఆక్రమించి, తన ఆధిపత్యంలోకి తీసుకోవడంగానీ, తన అనుయాయుల్ని అక్కడ ప్రతిష్టించడం కానీ ప్రణాళికలు సిద్ధం చేస్తూనే రెండునెలలు దాడి తప్పదని సంకేతాలు పంపారు. ఒకపక్క వెనిజులాను హెచ్చరిస్తూనే ట్రంప్ తన వ్యూహం తాను పన్నారు. వెనెజులా సార్వభౌమత్వంపై అమెరికా దాడి చేసిందని లోకమంతా విమర్శిస్తోంది. ఈ సంఘటనను ఖండి స్తున్నాయి. కొన్నిదేశాలు ఈ చర్యను సైనిక దుశ్చర్యగా వర్ణిస్తున్నాయి. అంతర్జాతీయ చట్టాలను అమెరికా ఉల్లంఘించిందని రష్యా భావన. అవసరమనుకుంటే అమెరికా వెనిజులా మధ్య తాము సయోధ్య చేకూరుస్తామని స్పెయిన్ దేశం ముందుకు వచ్చింది. వెనిజులాతో చైనా వ్యూహాత్మక భాగస్వామి. కాగా చైనా ప్రస్తుత పరిస్థితుల్లో ఖండించి ఊరుకుంది. వెనిజులాలో తమ దేశ అధ్యక్షుడిపై ఎన్ని వ్యతిరేకతలున్నా మదురోను కిడ్నాప్ చేయడాన్ని ఆ దేశ ప్రజలు జీర్ణించుకో లేకపోతు న్నారు. సాధారణంగా అమెరికా ఇతర దేశాలపై ఆధిపత్యం సంపాదించాలన్న సామ్రాజ్యకాంక్ష కలిగి తమకు కలిసి రాని దేశాలపై తరచు దాడులు చేయడం దాని నైజం. తాజా పరిస్థితుల్లో నోబెల్ బహుమతి గ్రహీత మరియా మచాడోను వెనిజులా పీఠం మీద కూర్చోబెట్టాలని ట్రంప్ ప్రణాళిక.

నిజానికి ఆమె మదురోకు వ్యతిరేకంగా పోరాడిన ఉక్కు మహిళగా పేరుంది. ప్రజల్లో పలుకుబడి ఉన్న నాయకురాలు కనుక ప్రజల్లో వ్యతిరేకత ఉండకపోవచ్చు అన్నది ట్రంప్ అభిప్రాయం. ఆమె ఇంతవరకు మదురో కిడ్నాప్ సంఘటనపై నోరు మెదపలేదు. మదురో తన కిడ్నాప్‌కు ముందే దేశంలో అత్యయిక పరిస్థితిని విధించారు. ఉరుములులేని పిడుగులా అమెరికా సైన్యం వెనిజులాపై దాడికి దాడులకు దిగింది. సైనిక స్థావరంలో పొగ, అంధకారం అలుముకున్నాయి. కారకాసులోని లోకార్లోటా, ఫ్యూర్టే లియునా మిలటరీ చేసే లాగ్ వైరా నౌకాశ్రయం, అనేక ఇతర సైనిక స్థావరాలు పై అమెరికా దళాలు దాడులు చేశాయి. మదురో దంపతులను యుద్ధ నౌకపై అమెరికాకు తరలించారు.

వెనిజులాలో సురక్షితంగా అధికార బదిలీ జరిగే వరకు అక్కడ తమ పర్యవేక్షణ కొనసాగుతుందని మాత్రం ట్రంప్ స్పష్టం చేసారు. వెనిజులాలో అమెరికా చమురు కంపెనీలే వాణిజ్య వ్యవహారాలను నిర్వహిస్తాయని ఆయన చెప్పకనే చెప్పారు. వెనిజులా ఆపరేషన్‌ను ట్రంప్ స్వయంగా వీక్షిస్తూ సంతృప్తి పొందారు. 'సెకండ్ల వ్యవధిలోనే ఉక్కు తలుపులను పగలకొట్టడం తాను ఎప్పుడూ చూడలేదని' అంటూనే అంతే అమితవేగంగా అమెరికన్ సైన్యం తమ అభీష్టాన్ని నెరవేర్చిందని కితాబిచ్చారు. ఈ దాడిని ప్రపంచ దేశాల్లోని కమ్యూనిస్టు పాలకులు, పార్టీలు తీవ్రంగా ఖండించాయి. మాదకద్రవ్యాల సాకుతో అమెరికా వెనిజులాను అనేకసార్లు మందలించింది. మాదకద్రవ్యాల సరఫరాను అడ్డుకోవాలని అమెరికా వెనిజులాను కోరుతూనే ఉంది. ఈలోగానే తూర్పు పసిఫిక్, కరీబియన్ సముద్ర జలాల్లో సైన్యాన్ని మోహరించింది. 35 వెనిజులా నౌకలపై అమెరికా దాడులు చేసి 115 మందిని చంపేసింది. డ్రగ్స్ నిరోధానికి ఏం చేయాలో పరస్పర చర్చల ద్వారా నిర్ణయించుకుందామని గత జులైలో మదురో ఓ ఇంటర్వ్యూలో అమెరికాకు పిలుపునిచ్చారు. అయినా ఆగస్టులోనే కరీబియన్ సముద్రంలో భారీగా సైన్యాన్నీ మోహరించింది. తదనంతర పరిణామాల్లో మదురో తమ మాట ఖాతరు చేయడంలేదని భావించి, వెనిజులాను స్వాధీనం చేసుకో వాలని నిర్ణయానికి ట్రంప్ నిర్ణయించారు. మదురో దంపతుల అరెస్ట్ వెంటనే ట్రంపు మహదానంద భరితుడై వెనిజులా ఉపాధ్యక్షుడు సమన్వయంతో రక్షణ కార్యదర్శి పీతే హెగ్ పెట్, విదేశాంగ కార్యదర్శి మార్కో రోహి యోలను నేతృత్వంలో ఒక బృందం వెనిజులా ప్రభుత్వాన్ని తాత్కాలికంగా నడుపుతుందని ట్రంపు నిర్దేశించారు. 2000 సంవత్సరంలోనే మదురో,ఆయన శ్రీమతిపై న్యూయార్క్ ప్రభుత్వం నార్కో టెర్రరిజం కుట్ర అభియో గాలను మోపింది. ఈ కారణంగా అమెరికా చట్టాల ప్రకారం న్యూయార్క్ కోర్టులోనే విచారించనున్నట్లు అమెరికా అటార్నీ జనరల్ పామ్ బోండే వివరించారు. ఏది ఏమైనా అగ్రరాజ్యం అత్యంత చమురు సంపన్న దేశం పైన కన్నేసి, తన కనుసన్నలలో మెలిగే ప్రయత్నం సఫలీకృతమైంది. సామ్రాజ్యవాదం అంటే ఇదే మరి!

మీరు తప్ప మీకు శాంతిని ఎవరూ ప్రసాదించలేరు. సిద్ధాంతాలు పాలనలో విజయాన్ని సాధించినప్పుడే మీకు మానసిక శాంతి లభిస్తుంది.



ఎమర్సన్

నిన్ను నీవు కనుగొనడానికి- మార్గం ఇతరుల సేవలో నిన్ను నీవు మరిచిపోవడమే.



మహాత్మా గాంధీ

# సుస్థిరాభివృద్ధితో లక్ష్య సాధన!

**పర్యావరణ వ్యవస్థల క్షీణతతో సహజ నీటినిల్వ, శుద్ధీకరణ సామర్థ్యం తగ్గిపోతుంది. నీరు, పారిశుద్ధ్య ఫలితాలను సంస్థాగత, పాలన సవాళ్లు ప్రభావితం చేస్తూనే ఉన్నాయి. నీటి నిర్వహణలో బహుళ మంత్రిత్వ శాఖలు, విభాగాలు ఉన్నప్పటికీ ప్రభుత్వ రంగాలు, స్థాయిలలో సమన్వయం పరిమితంగానే ఉంది. నీటి సరఫరా, పారిశుద్ధ్యం, మురుగునీటి శుద్ధి కోసం మౌలిక సదుపాయాల విస్తరణ, నిర్వహణకు నిరంతర పెట్టుబడి అవసరం. నిధులు కొరత మరొక అడ్డంకి. స్థానిక స్థాయిలో సాంకేతిక పరిజ్ఞానం అసమానంగానే ఉంది. ఈ సవాళ్లను పరిష్కరిం చడానికి మౌలిక సదుపాయాల విస్తరణ మాత్రమే కాకుండా బలమైన నియంత్రణ, సమర్థవంతమైన నీటి వినియోగం, పర్యావరణ వ్యవస్థ రక్షణ, సమాజ ప్రమేయం, అందరికీ సుస్థిర సమానమైన నీటి నిర్వహణను నిర్ధారించడానికి దీర్ఘకాలిక ప్రణాళిక అవసరం.**

డా. సునీల్ కుమార్ పోతన

శుభ్రమైన తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ అనేవిమానవ ప్రాథమిక అవసరాలు. ఐక్యరాజ్యసమితి 2030సుస్థిర అభివృద్ధి లక్ష్యం ప్రకారం ప్రజలందరికీ పరిశుభ్రమైన నీరు అందించాలి. మెరుగైన స్థిరమైన పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలి. పరిశుభ్రతను మెరుగుపర్చాలి. బహిరంగ మలవిసర్జనను అంతం చేయాలి. నీటి కాలుష్యాన్ని తగ్గించాలి. నీటి వనరులను సమర్థవంతంగా ఉపయోగించాలి. నదులు, సరస్సులు, చిత్తడి నేలలు వంటి నీటి సంబంధిత పర్యావరణ వ్యవస్థలను రక్షించాలి. మంచి ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధికి పరిశుభ్రమైన నీరు, సరైన పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలి. 2025 పూర్తి అయ్యేనాటికి, ప్రపంచవ్యాప్తంగా పరిశుభ్రమైన నీరు, పారిశుద్ధ్య అంశాలలో పురోగతి కొనసాగింది, కానీ, కొన్ని అంతరాలు అలాగే ఉన్నాయి.2015 నుండి తాగునీరు, పారిశుద్ధం, పరిశుభ్రత సేవలకు ప్రాప్యత మెరుగుపడినప్పటికీ, కోట్లమంది ప్రజలు ఇప్పటికీ తగినంతగా సేవలు పొందడంలేదు. ఐక్యరాజ్య సమితి గణాంకాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా దాదాపు 220 కోట్ల మందికి సురక్షితంగా నిర్వహించే తాగునీటి లభ్యత లేదు. దాదాపు 340కోట్ల మందికి సురక్షితంగా నిర్వహించే పారిశుద్ధ్య సేవలు లేవు. దాదాపు 170 కోట్ల మందికి ఇంట్లో ప్రాథమిక పరిశుభ్రత సౌకర్యాలు లేవు. ముఖ్యంగా పాఠశాలల్లో పరిస్థితి తీవ్రంగా ఉంది. ఇక్కడ దాదాపు 64.6 కోట్ల మంది పిల్లలకు ఇప్పటికీ ప్రాథమిక పరిశుభ్రత సేవలు లేవు, ఇలాంటి పరిస్థితుల్లో ఐక్యరాజ్య సమితి సుస్థిర అభివృద్ధి 2030 లక్ష్యాలను చేరుకోవడానికి పురోగతి అనేక రెట్లు పెరగాలి. గృహ వ్యర్థజలాల్లో కేవలం 56 శాతం మాత్రమే సురక్షితంగా శుద్ధి చేస్తున్నారు. అనేక ప్రాంతాలు తీవ్రమైన నీటి కొరతను ఎదుర్కొంటున్నాయి. నదులు, సరస్సులు, చిత్తడి నేలలు వంటి మంచినీటి పర్యావరణ వ్యవస్థలు క్షీణిస్తున్నాయి. దేశాల మధ్య భాగస్వామ్య నీటి వనరులపై సహకారం పరిమితంగానే ఉంది. ప్రస్తుత ధోరణులు కొనసాగితే 2049కి ముందు ప్రపంచ స్థాయిలో స్థిరమైన నీటి నిర్వహణ సాధించడం సాధ్యం కాదు.భారత ప్రభుత్వ జలశక్తి మంత్రిత్వ శాఖ నివేదిక2025 అధికారిక గణాంకాలు, సుస్థిర అభివృద్ధి లక్ష్యం పర్యవేక్షణ ప్రకారం భారతదేశం గణనీయమైన పురోగతిని సాధించింది. 15.7కోట్లు, జల్‌జీవన్ మిషన్ కింద ఇంట్లో పైపుల ద్వారా పంపు నీటిని పొందుతున్నాయి. మొత్తం జనాభాలోదాదాపు 76 శాతం మంది సురక్షితంగా నిర్వహించే తాగునీటి సేవలను ఉపయోగిస్తున్నారు. దాదాపు అన్ని కుటుంబాలకు మరుగుదొడ్లు అందుబాటులో ఉన్నాయి. దేశవ్యాప్తంగాఅన్ని జిల్లాలు స్వచ్ఛ భారత్ మిషన్ కింద బహిరంగ మలవిసర్జన రహితంగా మారినట్లు జలశక్తి మంత్రిత్వశాఖ ధ్రువీకరించింది. అదనంగా,2025 పూర్తయ్యే నాటికి, దాదాపు 5.6



లక్షల గ్రామాలు బహిరంగ మలవిసర్జన రహితం ప్లస్ హోదాను సాధించాయి. ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలతో పాటు స్థిరమైన పారిశుద్ధ్య నిర్వహణను ఇది సూచిస్తోంది. నీటి నాణ్యతకు సంబంధించి భారతదేశం సవాళ్లను ఎదుర్కొంటూనే ఉంది. గృహ వ్యర్థ జలాలలో దాదాపు 29 శాతం మాత్రమే విడుదలకు ముందు శుద్ధి చేస్తున్నారు. ఈ సంకేతం బలమైన మురుగునీటి మౌలిక సదుపాయాల అవసరాన్ని సూచిస్తోంది. తాగునీటి భద్రతను పరిష్కరించడానికి ప్రభుత్వం దేశవ్యాప్తంగా 2,100కి పైగా నీటి నాణ్యత పరీక్షా ప్రయోగశాలలను ఏర్పాటు చేసింది. నీటి వినియోగ సామర్థ్యం, నీటి నిర్వహణ, భూగర్భజలాల లభ్యత, వర్షపు నీటి సేకరణ మెరుగైనట్లు 2025 నివేదికలు సూచిస్తున్నాయి. జాతీయ పరిరక్షణ కార్యక్రమాలు, ఐక్యరాజ్య సమితి సుస్థిర అభివృద్ధి 2030లక్ష్యాల అనుసంధాన పర్యావరణ ఫ్రేంవర్క్‌తో నదులు, సరస్సులు,చిత్తడి నేలలు, భూగర్భ జలాలను రక్షించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. మొత్తంమీద, 2025 పూర్తయ్యే నాటికి, నీరు, పారిశుద్ధ్య నిర్వహణలో భారతదేశం బలమైన పురోగతిని సాధించింది. నీటి నాణ్యత నిర్వహణ, నీటి వనరుల స్థిరమైన వినియోగాన్ని కీలకమైన అంశాలుగా చెప్పవచ్చు. పరిశుభ్రమైన తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణలో పురోగతిని సాధించినప్పటికీ, సమర్థవంత నిర్వహణలో సవాళ్లు మిగిలే ఉన్నాయి. అనేక గ్రామీణ, పట్టణప్రాంతాలలో ప్రజారోగ్యానికి, పర్యావరణానికి మురుగునీటి నిర్వహణ వ్యవస్థలు సమస్యగానే ఉన్నాయి. వేగవంతమైన జనాభా పెరుగుదల, అనధికారిక స్థావరాలు, పాతకాలపు మురుగునీటి మౌలిక సదుపాయాల కారణంగా పట్టణ పారిశుద్ధ్య నిర్వహణ సవాలుగానే ఉంది. నీటి ఒత్తిడి, భూగర్భ జలాల అతి దోపిడీ మరొక ప్రధాన సవాళ్లు. కేంద్ర భూగర్భజలబోర్డు అంచనాల ప్రకారం, భారతదేశంలోని భూగర్భ జలాల అంచనా యూనిట్లలో దాదాపు 18శాతం అతిగా దోపిడీకి గురవుతున్నాయి. పంజాబ్, హర్యానా, రాజస్థాన్, దక్షిణ భారతదేశంలోని కొన్ని రాష్ట్రాల్లో వాతావరణ వైవిధ్యం, మారుతున్న వర్షపాత నమూనాలు, కరువులతో నీటి కొరత తీవ్రంగా ఉంది. మంచినీటి పర్యావరణవ్యవస్థలు కూడా ముప్పులోఉన్నాయి. కాలుష్యం, ఆక్రమణ, ఇసుక తవ్వకం, క్రమబద్ధీకరించని నీటి వెలికితీతతో చిత్తడి నేలలు, నదులు, సరస్సులు క్షీణిస్తున్నాయి. పర్యావరణ వ్యవస్థల క్షీణతతో సహజ నీటి నిల్వ, శుద్ధీకరణ సామర్థ్యం తగ్గిపోతుంది. నీరు, పారిశుద్ధ్య ఫలితాలను సంస్థాగత, పాలన సవాళ్లు ప్రభావితం చేస్తూనే ఉన్నాయి. నీటి నిర్వహణలో బహుళ మంత్రిత్వ శాఖలు, విభాగాలు ఉన్నప్పటికీ ప్రభుత్వ రంగాలు, స్థాయిలలో సమన్వయం పరిమితంగానే ఉంది. నీటి సరఫరా, పారిశుద్ధ్యం, మురుగునీటి శుద్ధి కోసం మౌలిక సదుపాయాల విస్తరణ, నిర్వహణకు నిరంతర పెట్టుబడి అవసరం. నిధులు కొరత మరొక అడ్డంకి. స్థానిక స్థాయిలో సామర్థ్యం, సాంకేతిక పరిజ్ఞానం అసమానంగానే ఉంది. ఈ సవాళ్లను పరిష్కరించడానికి మౌలిక సదుపాయాల విస్తరణ మాత్రమే కాకుండా బలమైన నియంత్రణ, సమర్థవంతమైన నీటి వినియోగం, పర్యావరణ వ్యవస్థ రక్షణ, సమాజ ప్రమేయం, అందరికీ సుస్థిర సమానమైన నీటి నిర్వహణను నిర్ధారించడానికి దీర్ఘకాలిక ప్రణాళిక అవసరం. •

# ఆహార వృథా అరికడితే పేదరిక విముక్తి

వి. వరదరాజు

ప్రపంచవ్యాప్తంగా 2022లో కోటి టన్నులకుపైగా ఆహారం వృథా జరుగుతోందని యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్మెంట్ ప్రోగ్రామ్స్ ఫుడ్ వేస్ట్ రిపోర్ట్ వెల్లడించింది. ఈవృథా 164 కోట్ల(ప్రపంచ జనాభాలో 20శాతం )మంది ఆకలి తీర్చగలదని ఆ నివేదిక లెక్కగట్టింది. అత్యధికంగా ఆహారాన్ని నేలపాలు చేస్తున్న దేశాల్లో ఇండియా ఒకటి. ఇక్కడి సంవత్సర కుటుంబ సగటు వృథా 55కేజీలు. అమెరికాలో 73కిలోలు. ఇండియా అత్యధిక జనాభా గల దేశం, కనుక ఇక్కడ జరుగుతున్న ఆహార వృథా చాలాఎక్కువ. ఏముంది మనం పారేసేవి పిడికెడు మెతుకులే కదా అని అనుకుంటే పొరపాటు. తిలా పాపం తలా పిడికెడుగా పరిణమిస్తుంది. వాతావరణం మార్పుకు దారితీస్తుంది. ఆర్థిక నష్టం వాటిల్లుతుంది. సామజిక అన్యాయం కూడాను. ఒక సంవత్సరానికి లక్ష కోట్లవిలువైన ఆహారం ప్రపంచవ్యాప్తంగా నేలలో కలిసిపోతున్నది. దేశంలో 20 కోట్ల మంది పేదలు రాత్రి పూట తిండి లేకుండా కడుపులో కళ్ళు పెట్టుకొని పడుకోవలసి వస్తుంది. ఇదొక అమిత విచారకర వాస్తవం. కానీ మనం ఏడాదికి 73మిలియన్ టన్నుల వండిన ఆహారంపెంటపాలు చేస్తున్నాం. ఎంత అమానుషమైన పనో మనందరం ఆలోచించాలి. వృథా అరికట్టాలి. పోనీ ఇక్కడ తగినన్ని పంటలు పండడం లేదా? పండుతున్నాయి. అత్యధికంగా పంటలు పండిస్తున్న దేశాలలో ఇండియా ఒకటి.ఆహార వృథా రెండు రకాలు. ఇంట్లో వండినది కుప్ప తొట్టెలో పారబోయడం. పొలం నుండి వినియోగదారునికి చేరే సరఫరా చేసే దారిలో జారవిడిచేది మరొకటి. వెరసి 73 మిలియన్ టన్నులు బుగ్గిపాలు అవుతున్నాయి. కొందరు ఇంటి అవసరాలకు మించి పప్పులు, బియ్యం, నూనె వగైరాలు కొని పాడు చేస్తున్నారు. అస్తవ్యస్త వంట ప్రణాళిక వలన, ఇంట్లో నిలువ చేసే వసతుల లేక వృథా అవుతుంది. కొన్ని ఆచార వ్యాహారాలతో విలువైన ఆహారం వృథా అవుతున్నది. ప్రపంచంలో అత్యధికంగా 61 శాతం గృహ స్థాయిలోనే ఆహార వృథా జరుగుతున్నదన్నది గమనార్హం. ఆహార వృథా వలన పర్యావరణానికి తీవ్రహాని కలుగుతున్నది. వ్యవసాయానికి నేల, నీరు,విద్యుత్ అధికంగా కావాలి. ఆహార వృథా అంటే వెలకట్టలేని సహజ వనరులను నాశనం కావించడం. ఒక ఎకరా వరి పండించడానికి 20 నుంచి 40వేల లీటర్ల నీరు అవసరం. ఇండియాలో నగరాలు, పట్టణాల్లోని చెత్తలో పన్నెండు శాతం ఆహార పదార్థాలే ఆక్రమిస్తాయి. నగర పాలక సిబ్బంది సేకరించిన చెత్తను నేల మాళిగల్లో పూడ్చుతారు. తడి ఆహారపు చెత్త నేలలో చివికేటప్పుడు మిథేన్ వాయువు ఉత్పత్తి జరుగుతుంది. మిథేన్ శక్తివంతమైన హరిత గృహ వాయువు. ఇది వాతావరణంలోని వేడిని పట్టి నిలుపుతుంది. తద్వారా భూమివేడెక్కడానికి దోహదకారి అవుతుంది. మిథేన్ బొగ్గుపులుసు వాయువు కంటే అధిక వేడి కలుగజేస్తుంది. ఆహార వృథా వలన జరిగే సామాజిక నష్టాన్ని త్రోసిపుచ్చలేం.భారీ స్థాయిలో ఆహారోత్పత్తి దేశంలో జరుగుతున్నది. ఇక్కడ ఇరవై శాతం మంది పేదలు తిండిగింజలు కొనలేక పస్తులు పడుకొంటున్న దుస్థితి ఉందనేది త్రోసిపుచ్చలేని వాస్తవం. భూతాపం పెరుగుదల, అస్థిర వర్షఋతువు, వరదలు, కరవులు, తదితర ప్రకృతి వైపరీత్యాలు పంటలపై తీవ్ర ప్రభావం చూపిస్తాయి. అన్నాన్ని బుగ్గిపాలు చేయడం వలన పరిమితమైన సహజ వనరులపై ఎనలేని ఒత్తిడి పడుతుంది. ఈ సంక్షోభాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవాలి. ఇందుకు ద్విముఖ వ్యూహం అవసరం. వ్యక్తిగత స్థాయి పరిష్కారాలు, విధాన సంస్కరణలు కావించి సుస్థిరాభివృద్ధికి బాటలు వేసుకోవాలి. ఇంటి అవసరాలకు తగినన్ని వెచ్చలే కొనాలి. కచ్చితమైన భోజన ప్రణాళిక వేసుకోవాలి. సరైన మూతలున్న డబ్బాలలో వెచ్చలు భద్రపరుచుకోవాలి. సరైన ఉష్ణోగ్రతలో వాటిని దాచుకోవాలి. ఎక్కువగా కూరగాయలు దొరికే కాలంలో ఒరుగులు తయారు చేసుకోవాలి. వంట గదిలో వచ్చిన చెత్తను సద్వినియోగపరచుకోవాలి. అంటే కంపోస్ట్‌చేసి, పూల మొక్కలకు, కూరగాయల మొక్కలకు వేయాలి. ఊరు శుభ్రమోతుంది. పెరటి తోటలు, మిద్దె తోటలు వేయాలి. వీటి పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహం ఇవ్వాలి. ప్రభుత్వం శీతలు గిడ్డంగుల నిర్మాణం చేపట్టి, ఆహార పదార్థాల నిలువ సామర్థ్యం పెంచాలి. •

# ప్రజావాక్కు



## అనాగరిక పద్ధతులను మానాలి

అన్యాయంజరిగితేన్యాయంజరిగేలా చర్యలు తీసుకోవాలి. అవినీతి జరిగితే సంబంధించిన వ్యవస్థలచే నిజం ఏమిటోతెలుసుకుని చట్టప్రకారం శిక్షలువేయాలి. రాష్ట్రాలను, దేశాన్నిఅనేక పార్టీలుఎన్నికలలో గెలిచి పదవులు చేపడతాయి. పార్టీలు, పదవులు శాశ్వతంకావు. ప్రజాక్షేమం దానికితగ్గ సంక్షేమం సమకూర్చడమే పాలకులవిధి. నాయకులు గతప్రభుత్వ విధానాలను ఏలాగైనా విమర్శించవచ్చును.అవినీతి పరులను శిక్షించేదిఒక్కన్యాయ వ్యవస్థ మాత్రమే.ఈక్రమంలో నాయకులు ఒకరినొకరు అసభ్యపదజాలంతో,అనాగరిక పద్ధతులలోవేదికల మీద మాట్లాడడం మంచిదికాదు.ఉరితీస్తాం.రాళ్లతోకొట్టి చంపొచ్చు అంటూ మాట్లాడటంమానుకోవాలి.అప్పుడే సభ్య సమాజంలో పాలకులకుఅత్యంత గౌరవం దక్కుతుంది.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## కొత్త ఏడాదిలో డీ.ఎస్సీపై నిరుద్యోగుల ఆశలు

తెలంగాణలో 2024 డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా 11వేల టీచర్ పోస్టులు త్వరితగతిన భర్తీ చేసిన ప్రభుత్వం మరో 6వేల టీచర్ పోస్టులు భర్తీ చేయుటకు మరో నోటిఫికేషన్ జారీ చేస్తామని గత డీఎస్సీ పూర్తిచేసే సమయంలో ప్రకటించారు. కానీ ఇప్పటివరకు మరొక నోటిఫికేషన్ జారీ కాలేదు. గత డీఎస్సీ నోటిఫికేషన్ జారీ అయి దాదాపు రెండు సంవత్సరాలు అవుతోంది. పదవి విరమణ ద్వారా ఏర్పడినఖాళీలు ప్రమోషన్స్ ద్వారా ఏర్పడినఖాళీలు కలిపి దాదాపు 12 వేల టీచర్ పోస్టులు ఖాళీలు ఉన్నాయి. 8 వేల ఎస్జీటీ పోస్టులు 4 వేల స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ప్రస్తుతం ఖాళీలు ఉన్నాయి.

- రావుల రామ్మోహన్ రెడ్డి, హైదరాబాద్

## తెలుగుభాషకు కృషి చేయాలి

భారతీయ రైల్వేశాఖ కొత్తగా రెండుస్లీపర్‌క్లాస్‌తో వందే భారత్‌రైళ్లను ప్రవేశపెట్టనున్నట్లు ఆ శాఖ మంత్రివర్యులు ప్రకటించారు. వందే భారత్‌లో ఉన్న రెండు తరగతుల ధరను సామాన్యులే కాకుండా, అత్యవసరం కానిచో జీతగాళ్లుకూడా భరించే అవకాశంలేదు. ఈనేపథ్యంలో స్లీపర్ తరగతితోఉన్న వందేభారత్ రైలు టికెట్‌ఛార్జీ, ప్రయాణం చాలా ఉపయోగపడుతుంది. అత్యంత సాంకేతికతతో, సత్వరంగమ్యం చేరే సదుపాయం కలుగుతుంది.

-బి.మేఘనాథం, విశాఖపట్నం

## మన భాషను మనమే అభివృద్ధి చేయాలి

మన మాతృభాష తెలుగు ప్రాముఖ్యాన్ని పెంచే పుస్తక మహోత్సవాలు, భాషాభివృద్ధి సభలు జరుగుతున్న సందర్భాల్లో మనంహాజరుకాకపోవడం కన్నా దాన్నిమనం,మనపిల్లలు ఆంగ్లంతో పాటు మాతృభాష మరింత పట్టు వచ్చేట్లు ఇంటి వద్ద నేర్పించాలి. ఉపాధి దృష్టిలో పరీక్షలకోసం ఆంగ్లం అవసరమైన ,తెలుగులో కూడా పరిజ్ఞానం విషయాలను మనస్సులో అర్థం చేసుకునేందుకు సులువుగా ఉంటుంది.ఆచరణమనం చేసి వారసులుకూడా దీన్నితప్పక మక్కువ పెంచాలి. దీనివల్ల అనువాద ప్రక్రియ సులువుగా ఉంటుంది.సాహిత్యంలో అనువాదం గొప్పది. గావున భాషల్లో తేడాను , మన భాషను మనమే అభివృద్ధి చేయడం విద్యావంతులు, తల్లి తండ్రులు బాధ్యత వహించాలి. మన మొక్కలకు మనం నీరుపోసి పెంచినట్లు .

- బొల్లోజు మేఘనాదం, విశాఖపట్నం

## విలువలను రక్షించే విధానాలు కావాలి

రాజ్యాంగ విలువలు రక్షించబడిన రాజ్యం విధానాలు కావాలి. తెలంగాణ రైజింగ్ మీద గాని బంగారు తెలంగాణ మీద గాని నమ్మకం లేదు గాని సమగ్ర అభివృద్ధి చెందిన జీవన ప్రమాణాలు మెరుగుపడిన రాజ్యం మాత్రంకావాలి. పాలమూరు ప్రజల గోస తీరాలిఉత్తరాంధ్ర ప్రజల గోసకూడా తీరాలి. రాయలసీమ కూడా సమగ్ర అభివృద్ధి సాధించాలి అప్పుడు మాత్రమే విలువైన ప్రజాస్వామిక రాష్ట్రాలు పాలన చేయడం సుసాధ్యం అవుతుంది. అభివృద్ధి పేరిట ఆరావలి ప్రాంతంలో జరుగుతుంది ఏమిటి? ప్రపంచానికి అమెజాన్ అడవులు ఎలాగో అలాగ్,ఆరావలి. సుందర్ బన్ అడవులు అయితే వాటిని రక్షించుకోవాలి. అభివృద్ధి పేరిట సహజ సిద్ధమైన ప్రకృతి వనరులను నాశనం చేయని ప్రభుత్వ విధానం కావాలి.

- భారత అవినాష్, జనగామ

## సామాజిక బాధ్యత

ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యం కోసం ఎంతోమంది వస్తుంటారు. వారితోపాటు వారి కుటుంబసభ్యులు, బంధువులు వస్తుంటారు. కొందరు ఆరుబయట నిద్రిస్తూ, తిని తినక ఎన్నో ఇబ్బందులు పడుతుంటారు. వారిలో చాలామంది పేదరికం వల్ల భోజనం కొనలేని పరిస్థితిలో ఉంటున్నారు. వారికి పట్టెడన్నం పెట్టాలి. కొన్ని స్వచ్ఛంద సంస్థలు, దాతలు ఇప్పటికే అన్నదానం చేస్తున్నారు కానీ సరిపోవడంలేదు.ఇలాంటి వారికి సహాయం చేయడం మనందరి సామాజిక బాధ్యత.

-నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# విద్యా విప్లవంలో డిజిటల్ టీ-శాట్ పాత్ర



ఐ.వి.మురళీ కృష్ణ శర్మ

ఇంటింటికీ టెక్నాలజీ చేరువ కావాలనే లక్ష్యంతో ప్రారంభించిన టీ-శాట్ తెలంగాణ రాష్ట్రానికి వరంగా మారింది. అన్ని రంగాలు, వర్గాల వారికి ఆధునిక సాంకేతికత చేరువ కావాలని స్థాపించిన టీ-శాట్ విజయవంతంగా లక్ష్యాలకు చేరుకుంటోంది. ప్రతి ఇల్లు గ్రంథాలయం కావాలి. ప్రతి మెదడుకు జ్ఞానం చేరాలంటే పుస్తకాలతోనే సాధ్యమవుతుంది అని పెద్దలు అంటుంటారు. ఇప్పుడు మారుతున్న కాలానికి అనుగుణంగా పుస్తకం కూడా రూపంమార్చుకుంది. డిజిటల్ రూపంలో పుస్తకాన్ని తెలంగాణలో ఇంటింటికి చేర్చేందుకు టీ-శాట్ కృషిచేస్తోంది.టీ-శాట్ తీసుకొచ్చిన ఈ డిజిటల్ విప్లవం తెలంగాణ యువత, విద్యార్థుల భవితకు బాటలు వేయడమే కాకుండా అన్ని వర్గాల వారికి చేరువవుతోంది. తెలంగాణ స్టేట్ గవర్నమెంట్ ఇనిషియేటివ్‌గా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ డిపార్ట్‌మెంట్ నేతృత్వంలో నడుస్తున్న ఈ నెట్‌వర్క్ సాఫ్ట్ నెట్ (సొసైటీ ఫర్ తెలంగాణ స్టేట్ నెట్‌వర్క్) ఆధ్వర్యంలో టీ-శాట్ పేరుతో పనిచేస్తోంది. శాటిలైట్ ద్వారా ప్రసారాలు అందిస్తూ గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లోని విద్యార్థులకు, యువతకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తెస్తోంది. టీ-శాట్ నిపుణ (స్కిల్స్, పోటీ పరీక్షలు), టీ-శాట్ విద్య (స్కూల్ ఎడ్యుకేషన్) అనే రెండు ప్రధాన చానెళ్లతో పనిచేస్తుంది. ఇవి డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా సెల్ఫ్ ప్రిపరేషన్‌కి అండగా నిలుస్తున్నాయి. టీ-శాట్ యాప్, యూట్యూబ్, ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా కూడా విలువైన కంటెంట్ అందుబాటులో ఉంది. తెలంగాణలోని ఉన్నత విద్యా మండలితో పలు ఎమ్ఓయూలు కుదుర్చుకుని,అన్నిరకాల ప్రసారాలు అందిస్తుండటం విద్యార్థులకు, నిరుద్యోగులకు టీ-శాట్ గొప్పవరంగా మారింది. టీ-శాట్ విజయాలు అసాధారణమైనవి. దేశంలోనే నెంబర్ వన్ ఎడ్యుకేషనల్ నెట్‌వర్క్‌గా నిలవడం తెలంగాణకు గర్వకారణం. విద్యా ప్రసార చానెళ్లలో 48 లక్షల యూజర్స్‌తో డిజిటల్ ప్రసారాల్లో ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. యూట్యూబ్‌లో 8.4 లక్షలకు పైగా సబ్ స్క్రైబర్స్, సుమారు 14 కోట్లకు పైగా వ్యూస్ టీ-శాట్‌కు ఉన్నాయి. డిజిటల్ శాటిలైట్ ద్వారా 48 లక్షల మందికి పైగా యూజర్స్‌తో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. టీ-శాట్16 శాటిలైట్ ద్వారా తెలంగాణలోని సుమారు 80 లక్షలకు పైగా కుటుంబాలకు వైవిధ్యమైన ప్రసారాలు అందిస్తూ అన్ని వర్గాలకు తోడ్పడుతోంది. రాష్ట్రంలోని ప్రధాన కేబుల్ నెట్‌వర్క్‌లో టీ-శాట్ సేవలుఅందుబాటులో ఉండడంతో వీరి ప్రజా ప్రయోజనాల కార్యక్రమాలు ఇంటింటికీ చేరవవుతున్నాయి. తెలంగాణ విద్యా రంగంలో ఇప్పుడు టీ-శాట్ ప్రధాన పాత్ర పోషిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో, ఐటీ కమ్యూనికేషన్ల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో సీఈఓ బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి ప్రత్యేక కృషి చేస్తూ టీ-శాట్ కార్యక్రమాలను విజయవంతంగా ప్రజలకు చేరువ చేస్తున్నారు. డిజిటల్ నెట్‌వర్క్ ద్వారా గ్రామీణ విద్యార్థులు పట్టణ విద్యార్థులతో పోటీపడాలనే మంత్రి శ్రీధర్ బాబు ఇచ్చిన పిలుపును సాకారం చేసేందుకు టీ-శాట్ సిబ్బంది అహర్నిశలు కృషి చేస్తున్నారు. పేద పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు టీ-శాట్ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల వార్షిక పోటీలు 2025 కార్యక్రమం



ద్వారా క్విజ్, వ్యాస రచన పోటీలు ఏర్పాటు చేయడంతో పెద్ద ఎత్తున విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందుకున్నారు. నవంబర్‌లో నిర్వహించిన ఈపోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా 22 వేలకు పైగా విద్యార్థులు పాల్గొన్నారంటేనే టీ-శాట్‌కు తెలంగాణ విద్యారంగంలో లభిస్తున్న ప్రాధాన్యత తెలుస్తోంది.మహాత్మా గాంధీ యూనివర్సిటీ ద్వారా ట్రావెల్ అండ్ టూరిజం మేనేజ్‌మెంట్ కోర్సులో ప్రత్యేక పాఠ్యాంశాలను టీ-శాట్ బోధిస్తోంది. టీ-శాట్,ఫోటానిక్స్ వ్యాలీకార్పొరేషన్ సంయుక్తంగా వీఎల్ఎస్ఐపై వృత్తి నైపుణ్య శిక్షణ కూడా అందిస్తోంది. ప్రజలకు అవసరమైన విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, వృత్తి నైపుణ్యం, భాషా నైపుణ్యాలపై ప్రత్యేక కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తోంది.ప్రత్యేకంగా ఐదు యూట్యూబ్ చానెళ్లతో, మారుతున్న కాలానికి అనుగుణంగా డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా రీల్స్ రూపంలోనూ కంటెంట్ అందిస్తోంది. పోటీపరీక్షలలో టీ-శాట్ యువతకు చేదోడుగా నిలిబడింది. టెట్, డీఎస్సీ పోటీ పరీక్షల్లో అభ్యర్థుల విజయానికి టీ-శాట్ కంటెంట్ కీలకంగా మారుతోంది. టీ-శాట్ సేవలతో వారు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి రాష్ట్రఅభివృద్ధిలో భాగస్వాములుగా మారడం టీ-శాట్‌కు గర్వకారణం. పోటీ పరీక్షలకు సంసిద్ధమయ్యే వారి కోసం ప్రధాన సబ్జెక్ట్ జనరల్ స్టడీస్ పై జీఎస్ ఫర్ ఆల్ పేరిట ప్రత్యేక పాఠాలు ప్రసారం చేస్తోంది. టీజీపీఎస్సీ గ్రూప్ 1, 2, 3 ఉద్యోగాలతో పాటు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ, బ్యాంకింగ్ పరీక్షలకు నాణ్యమైన కంటెంట్ అందిస్తోంది. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు ఉద్యోగాల సాధనలో తోడ్పాటు అందించడానికి టీ-శాట్ నెట్‌వర్క్ డొమైన్‌లో 40 వేలకు పైగా వీడియోలు అందుబాటులో ఉన్నాయి. తెలంగాణలో విద్యార్థులు తమ ప్రతిభకు పదును పెట్టుకోవడానికి, ఉద్యోగాలు సాధించడానికి టీ-శాట్ సేవలను ఆయుధంగా ఉపయోగించుకుంటున్నారు. అంతేకాక తెలంగాణ స్కిల్ హబ్, టాస్క్ వంటి స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిషియేటివ్‌లతో కూడా టీ-శాట్‌సమన్వయం చేసుకుంటూ ఉపాధి అవకాశాలను కల్పిస్తోంది. విద్యార్థులకు, యువతకు మార్గదర్శకంగా స్వాతంత్ర్య సమర యోధులు,వివిధ రంగాల్లో అవార్డులు పొందిన వారి గొప్ప వ్యక్తుల అనుభవాలను, స్ఫూర్తిఅనే కార్యక్రమం పేరుతో ప్రసారం చేస్తూ మానవ విలువల పెంపుకు టీ-శాట్ కృషి చేస్తుంది. ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం, తెలంగాణ పశుసంవర్ధక శాఖల సమన్వయంతో నిపుణ పేరిట రైతుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు రూపొందిస్తోంది. వైద్య నిపుణులతో వైద్య సలహాలు కూడా అందిస్తున్న టీ-శాట్ మహిళా శిశు సంక్షేమానికి సంబంధించి ప్రతి రోజు కార్యక్రమం ప్రసారం చేస్తుండడంతో అంగన్ వాడీ టీచర్లకు, కార్యకర్తలకు ఉపయోగకరంగా ఉంది. తెలంగాణ సంస్కృతికి అద్దంపట్టేలా బోనాలు,బతుకమ్మ పండుగలపై ప్రత్యేక వీడియోలు రూపొందించి మన సంప్రదాయాలకు పెద్ద పేట వేస్తోంది. టీ-శాట్ ప్రభావం ఇప్పటికే అనేక కోణాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. గ్రామీణ విద్యార్థులు పట్టణ విద్యార్థులతో సమానంగా పోటీపడేలాసంస్థ ప్రోత్సాహిస్తోంది. ఆరోగ్యం, వ్యవసాయం, మహిళలు పిల్లల సంక్షేమం, సాంస్కృతిక కార్యక్రమాలతో రాష్ట్ర ప్రజల సమగ్ర అభివృద్ధికి దోహదం చేస్తోంది.తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీలో టీ-శాట్‌ను చేర్చాలని ఇటీవలే అధికారులు సూచించడం ఈ సంస్థ విద్యారంగానికి చేస్తున్న సేవలకు నిదర్శనంగా నిలవడమే కాకుండా రాష్ట్రవిద్యార్థులు, నిరుద్యోగుల జీవితాల్లో పోషిస్తున్నప్రధాన ప్రాముఖ్యతను తెలియజేస్తోంది. ప్రభుత్వ ప్రోత్సాహంతో టీ-శాట్ తెలంగాణ ప్రజలను జ్ఞానవంతులను చేసే మిషన్‌లో విజయవంతంగా దూసుకుపోతోంది. టీ-శాట్ కేవలం ఒక డిజటల్ విద్యా సాధనం మాత్రమే కాదు, తెలంగాణ విద్యా విభాగంతో పాటు అన్నిరంగాల్లో మార్పుకు మార్గదర్శకంగా నిలుస్తూ అందరి మన్ననలు పొందుతోంది. •

# వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలిగా డెల్సీ రోడ్రిగ్స్

## న్యూయార్కు డ్రగ్స్ ఏజెన్సీ కార్యాలయంలో బేడీలతో నికోలస్ మదురో

## వెనిజులాను పాలించేది మేమే: ట్రంప్

## దేశ ప్రజలకు స్వేచ్ఛ లభించింది: విపక్ష నేత కొరియా మచాడో






**కారకాస్, జనవరి 4:** వెనిజులాపై అమెరికా దాడుల నేపథ్యంలో ఆ దేశంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలిగా ప్రస్తుత ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్‌ను నియమిస్తూ ఆ దేశ సుప్రీం కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది . ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మదురో సహా ఆయన సతీమణి సిలియా ఫ్లోరస్ లను అమెరికా సైన్యం బంధించి తీసుకెళ్లిన సంగతి తెలిసిందే. ఈ సంక్షోభ పరిస్థితుల్లో ప్రభుత్వ పాలన కొనసాగింపు, దేశ సార్వభౌమాధికారాన్ని రక్షించడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్టు న్యాయస్థానం పేర్కొంది.వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన 56 ఏళ్ల డెల్సీ రోడ్రిగ్జ్ నికోలస్ మదురోకు అత్యంత సన్నిహితురాలు. విప్లవ నేత, లిగా సోషలిస్ట్ పార్టీ వ్యవస్థాపకులు జార్జ్ ఆంటోనియో కుమార్తె అయిన ఈమె 1969లో రాజధాని కాకరాస్ లో జన్మించారు. వృత్తిరీత్యా న్యాయవాది అయిన డెల్సీ మదురో ప్రభుత్వంలో కమ్యూనికేషన్, విదేశాంగ మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత 2018 నుంచి ఉపాధ్యక్షురాలిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. రోడ్రిగ్జ్ తన సోదరుడు నేషనల్ అసెంబ్లీ చీఫ్ జార్జ్ రోడ్రిగ్జ్‌తో కలిసి మదురో ప్రభుత్వ విధానాలను రూపొందించడంలో కీలక పాత్ర పోషించారు. ఆ దేశ రాజకీయాల్లోనే కాకుండా ఆర్థిక వ్యవస్థపై కూడా పట్టు సాధించారు. దీంతో ఆమె ఆర్థిక, చమురు శాఖల మంత్రిగానూ సేవలందిస్తున్నారు. అమెరికా ఆంక్షల నడుమ వెనిజులా దేశ ప్రయోజనాలను కాపాడేందుకు ఎంతగానో కృషి చేశారు రోడ్రిగ్జ్. ఆ దేశంలోని చమురు కోసం ట్రంప్ సుంకాలు విధించిన వేళ ద్రవ్యోల్బణం నుంచి బయటపడేయడంలో కీలకపాత్ర పోషించారామె. రోడ్రిగ్జ్ నియామకం పట్ల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మద్దతు ప్రకటించినట్టు సమాచారం.

**న్యూయార్క్ డ్రగ్స్ఏజెన్సీ కార్యాలయంలో వెనిజులా మదురో:** యూఎస్ డ్రగ్ ఏజెన్సీ ఆఫీసులో వెనిజువెలా అధ్యక్షుడు వెనిజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భారయ సిలియా ఫ్లోర్స్ అమెరికా భద్రతా దళాల అదుపులో ఉన్నారు. మదురోకి సంబంధించి వీడియోను యూఎస్ సెక్యూరిటీ ఫోర్సెస్ ఓ వీడియోను విడుదల చేశాయి. మదురోని వెనిజులా నుంచి తీసుకువచ్చి అమెరికా డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్(ఎడిఇ) న్యూయార్క్ డివిజన్ కార్యాయలంలో నిర్బంధించినట్లు స్పష్టమవుతోంది. వెనిజులా రాజధాని కారకాస్‌పై ప్రత్యేక అమెరికా దళాలు ఆకస్మిక దాడి జరిపాయి. ఈ దాడి సమయంలోనే ఆ దేశ అధ్యక్షుడు మదురో ఆయన భార్య సిలియా ఫ్లోర్స్ తప్పించుకోవడానికి ప్రయత్నిస్తుండగా యూఎస్ సెక్యూరిటీ ఫోర్సెస్ వారిని అదుపులోకి తీసుకున్నారు. యూఎస్ దాడి సమయంలో మదురో, ఆయన భార్య కారకాస్‌లోని హై సెక్యూరిటీ ఫోర్ట్ టియునా మిలిటరీ కాంపౌండ్‌లోని తమ నివాసంలో ఉన్నట్లు తెలుస్తోంది. దాడి విషయం తెలియగానే హైసెక్యూరిటీతో పారిపోయే ప్రయత్నం చేశారు. కానీ, వారి ప్రయత్నం ఫలించలేదు. రాపిడ్ రెస్పాన్స్ 47 టీమ్ అధికారిక ఎక్స్ అకౌంట్‌లో మదురోకి సంబంధించిన వీడియో షేర్ చేసింది. ఈ వీడియోలో లోయర్ మన్‌హట్టన్‌లోని డ్రగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్ న్యూయార్క్ డివిజన్ కార్యాలయం లోకి మదురోని అధికారులు తీసుకెళ్తున్నారు. చేతులకు సంకెళ్లతో సెక్యూరిటీ సిబ్బంది మధ్య బందీగా ఉన్నారు. కాగా, మదురోని ఓ గదిలోకి తీసుకెళ్తుండగా సెక్యూరిటీ సిబ్బందికి ఆయన గుడ్ నైట్, హ్యాపీ న్యూ ఇయర్ అని విష్ చేయడం వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. వెనిజువెలాపై దాడి తరువాత మదురో, ఆయన భార్యను ముందుగా అమెరికాలోని సైనిక స్థావరానికి తీసుకెళ్లారు. ఆ తరువాత అక్కడి నుంచి న్యూయార్క్‌కు తరలించారు. మదురోను డీఈఏ కార్యాలయం నుంచి బ్రూక్లిన్‌లోని మెట్రోపాలిటన్ డిటెన్షన్ సెంటర్‌కు తీసుకెళ్తారని తెలుస్తోంది. మదురో, ఆయన భార్యపై నార్కో టెర్రరిజం, యునైటెడ్ స్టేట్స్ లోకి టన్నుల కొద్దీ కొకైన్ దిగుమతి చేయడం, అక్రమ ఆయుధాలను కలిగి ఉండటం వంటి అభియోగాలు మోపారు.

**వెనిజులాను పాలించేది మేమే...యుఎస్ అధ్యక్షుడు ట్రంప్:** ఇదిలా ఉండగా ఇకపై వెనిజులా పాలనపై ట్రంప్ కీలక ప్రకటనచేస్తూ సురక్షితంగా అధికారాల బదిలీ జరిగేదాకా వెనిజులాను మేమే పాలిస్తామంటూ ప్రకటించారు అమెరికా అధ్యక్షుడు. గత కొంతకాలం వెనిజులా తమ ఆధీనంలోనే నడుస్తుందన్నారు. ప్రజల జీవనానికి సురక్షితమని భావించే వరకూ దేశంలో సరైన, న్యాయమైన అధికారాల బదిలీ అయ్యే వరకూ వెనిజులా పాలన తమ ఆదీనంలోనే ఉంటుందని మీడియా సమావేశంలో ఆయన ప్రకటించారు. గతంలో పాలన ఉండకూడదని, సురక్షితంగా సుస్థిరంగా వెనిజులా అభివృద్ధికి మేమే సహకరిస్తామని, అప్పటివరకూ అమెరికా పాలనలోనే ఉంటుందని ట్రంప్ వెల్లడించారు. అయితే ఈపాలన ఎంతకాలం ఉంటుందోప్రకటించలేదు. వెనిజులాలో ప్రభుత్వ మార్పు, ఆదేశ చమురు వనరులపై నియంత్రణ కీలకమని ట్రంప్ బాహాటంగానే చెప్పారు. ఇపుడు అతిపెద్ద చమురు కంపెనీలు వెనిజులాలో పెట్టుబడులకు ముందుకువస్తున్నట్లు ట్రంప్ప్రకటించారు. డ్రగ్స్‌ను అక్రమంగా అమెరికాలోకి తరలిస్తున్నారని, డ్రగ్స్ మాఫియాను వెనిజులా అధ్యక్షుడు పెంచి పోషిస్తున్నారంటూ నార్కో ఉగ్రవాదం కొనసాగిస్తున్నారంటూ మదురోపై అభియోగాలు నమోదు చేసిన ట్రంప్ వెనిజులాపై సైనిక చర్య తప్పదని కూడా హెచ్చరించారు. చెప్పినట్లుగానే సైనిక చర్యతో మదురో దంపతులను నిర్బంధంలోకి తీసుకుని అమెరికాకు తరలించడం, ఆపై ఉపాధ్యక్షురాలు అధ్యక్షురాలిగా నామినేట్‌కావడం జరిగిపోయాయి.

**వెనిజులా ప్రజలకు స్వేచ్ఛ లభించింది...ప్రతిపక్ష నేత మచాడో:** అమెరికా దాడులుచేసి మదురో దంపతులను నిర్బంధించి తీసుకెళ్లడంపై శాంతిపురస్కార గ్రహీతదేశ విపక్షనేత మారియా కొరినా మచాడో స్పందించారు. వెనిజులాకు స్వేచ్ఛ లభించిందని అమెరికా తన వాగ్దానాన్ని తిరిగి నిలబెట్టుకుందని అన్నారు. ప్రజలారా స్వేఛ్ఛా సమయం వచ్చింది. వెనిజులా ప్రజలు, ఇతరదేశాలపౌరులపై జరిగిన దారుణ నేరాలకు మదురో ఇపుడు శిక్ష అనుభవిస్తున్నారన్నారు. చర్చలతో పరిష్కారానికి నిరాకరించాడని, అందుకే అమెరికా తన వాగ్దానం నిలుపుకున్నదని వ్యాఖ్యానించారు. ప్రజాసార్వభౌమాధికారంతో వెనిజులాను పాలించే సమయం వచ్చిందన్నారు. రాజకీయ ఖైదీలను విడుదల చేస్తామని, శాంతియుత భవిష్యత్తు నిర్మిస్తామన్నారు. ప్రజాస్వామ్యంకోసం అనేక ఏళ్లుగా తానుచేసిన పోరాటం ఫలించిందన్నారు. వెనిజులా తదుపరి అధ్యక్ష పదవికోసం ఎడ్మండో గొంజాలెజ్ ఉరిటియాకు తన మద్దతుప్రకటించారు. అయితే వెనిజులా అధ్యక్షురాలిగా మచాడోకు అప్పగించడంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా విముఖంగా ఉన్నారు. మచాడో చాలా మంచి మహిళ అని కాని ఆమె నాయకురాలిగా ఉండటం చాలా కష్టమని భావిస్తున్నట్లు తెలిపారు. కాగా అమెరికా చేసిన దాడుల్లో సుమారు 40 మంది ప్రాణాలు కోల్పోయారు. వారిలోసాధారణప్రజలతోపాటు సైనికులు కూడా ఉన్నారు. వెనిజులాకు చెందిన సీనియర్ అధికారి ఒకరు చెప్పినట్లు అక్కడి మీడియాలో వార్తలు వెలువడ్డాయి.

# చమురు నిల్వలకోసమే ట్రంప్ దాడులు

## మాజీ ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్ ధ్వజం



**న్యూయార్కు, జనవరి 4:** వెనిజులాపై ట్రంప్ ఆదేశాలమేరకు జరిగిన దాడులు ప్రజాస్వామ్యం పునరుద్ధరణ, డ్రగ్స్ నియంత్రణ కోసం కానే కాదని, కేవలం ఆదేశంలో ఉనన అపారమైన చమురు నిల్వలు కోసమేనని మాజీ ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్ విమర్శించారు. చమురుకోసమే ట్రంప్ రాజకీయ ఆశయాలకోసమే ఈ దాడి జరిగిందన్నారు. ఈ చర్యలతో అమెరికా సురక్షితం కాబోదని ఆమె తన సోషల్ మీడియాలో విమర్శనాత్మక వ్యాఖ్యలుచేసారు. బలవంతంగా ప్రభుత్వాన్ని మార్చడం, ప్రాంతీయ అస్థిరతకు కారణమై చివరకు అమెరికన్ల ప్రాణాలకే ముప్పుతెస్తుందని ఆమె హెచ్చరించారు. మదురో ఇక క్రూరమైన నియంత అయినాసరే ఈ చర్య చట్టవిరుద్ధమని కమలా పేర్కొన్నారు. ప్రభుత్వ మార్పు లేదా చమురుపేరుతో ప్రారంభించిన యుద్ధాలు గందరగోళంగా మారి చివరకు అమెరికన్ కుటుంబాలే బలవుతున్నాయని ఆమె గుర్తుచేసారు. అమెరికా ప్రజలు ఇలాంటి చర్యలు కోరుకోవడంలేదని, ట్రంప్ తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ఆపరేషన్‌కు చట్టబద్ధత, స్పష్టమైన ఎగ్జిట్‌ప్లాన్ లేదని, దీనివల్ల అమెరికన్ సైనికుల ప్రాణాలుప్రమాదంలో పడతాయని అన్నారు. బిలియన్ డాలర్లు ఖర్చుచేసి ఒక ప్రాంతాన్ని అస్తిరపరుస్తున్నారన్నారు. ఈచర్యలకు అమెరికాకు వచ్చే లాభం ఏమిటో ట్రంప్ చెప్పలేకపోతున్నారని అన్నారు. న్యూయార్కు కొత్తమేయర్ జోహ్రాన్ మమ్దానీ కూడా ట్రంప్‌పై విమర్శలుచేసారు. ఒక స్వతంత్ర దేశంపై దాడి చేయడమే కాకుండా అంతర్జాతీయ చట్టాలను ట్రంప్ ఉల్లంఘించారని ఆరోపించారు.

# వెనిజులాకు మస్క్ స్టార్‌లింక్ నెలరోజులు ఉచిత ఇంటర్నెట్



**న్యూయార్కు, జనవరి 4:** టెస్లా, స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ వెనిజులా ప్రజలకోసం అక్కడ నెలకొన్న సంక్షోభ పరిస్థితుల నేపథ్యంలో, ప్రజలకు నిరంతరాయంగా ఇంటర్నెట్ కనెక్టివిటీ అందించేందుకు నెల రోజుల పాటు స్టార్‌లింక్ బ్రాడ్‌బ్యాండ్ సేవలను ఉచితంగా అందిస్తున్నట్టు ప్రకటించారు. వెనిజులా ప్రజలకు మద్దతుగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ లో వెల్లడించారు. అమెరికా సైనిక చర్యలో వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో పట్టుబడిన కొద్ది సేపటికే మస్క్ ఈ ప్రకటన చేయడం గమనార్హం. మదురో అరెస్ట్‌ను స్వాగతించిన మస్క్, ఆయన పాలన ముగియడంతో ఇకనైనా వెనిజులా అభివృద్ధి పథంలో పయనించగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. వెనిజులా ఇప్పుడు శ్రేయస్సును పొందగలదని స్పానిష్ భాషలో వ్యాఖ్యానించారు. లోఎర్త్ ఆర్బిట్ శాటిలైట్ల ద్వారా పనిచేసే స్టార్‌లింక్ నెట్‌వర్క్, దేశంలో రాజకీయ అనిశ్చితి నెలకొన్న ఈ సమయంలో కనెక్టివిటీ సమస్యలు లేకుండా చూస్తుంది. ఫిబ్రవరి 3 వరకు ఈ ఉచిత సేవలు అందుబాటులో ఉంటాయి. మదురో ప్రభుత్వంపై మస్క్ మొదటి నుంచి తీవ్ర విమర్శలు చేస్తున్న నేపథ్యంలో ఆయన స్పందన ఎవరినీ ఆశ్చర్యపరచలేదు. మదురో ప్రభుత్వ విధానాల వల్లే దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిందని ఆయన చాలాకాలంగా ఆరోపిస్తున్నారు. 2024 ఎన్నికల సమయంలో ప్రతిపక్షానికి బహిరంగంగా మద్దతు పలికిన మస్క్, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, ప్రతిపక్ష నేత మారియా కొరినా మచాడోకు అండగా నిలిచారు. సహజ వనరులు పుష్కలంగా ఉన్న వెనిజులా, సరైన నాయకత్వం లేకపోవడం వల్లే అభివృద్ధికి దూరమైందని మస్క్ గతంలో పలుమార్లు పేర్కొన్నారు.




# వెనిజులా పరిణామాలపై భారత్ ఆందోళన

**న్యూఢిల్లీ, జనవరి 4:** వెనిజులా పరిణామాలపై భారత్ విదేశాంగ శాఖ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. వెనిజులాలో పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నామని తెలిపింది. సంబంధిత పక్షాలన్నీ చర్చల ద్వారా శాంతియుతంగా సమస్యలను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చింది. కరాకస్‌లోని భారత రాయబార కార్యాలయం అక్కడి భారతీయులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని, వారికి అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందిస్తుందని విదేశాంగ ప్రతినిధి రణదీప్ జైస్వాల్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా వెనిజులా రాజధాని కారకాస్‌పై దాడిచేసిన దేశ అధ్యక్షుడు మదురో దంపతులను అదుపులోకి తీసుకున్న అమెరికా మదురోపై తీవ్రమైన నార్కో టెర్రరిజం ఆరోపణలు మోపింది.

గత రెండు దశాబ్దాలుగా ప్రభుత్వ అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ, భారీ పరిమాణంలో కొకైన్‌ను అమెరికాకు తరలించారని ఫెడరల్ కోర్టులో అభియోగాలు దాఖలు చేశారు. 1999 నుంచి 2025 వరకు సాగిన ఈ అక్రమ రవాణాకు మదురో నాయకత్వం వహించారని యూఎస్ అటార్నీ జనరల్ పామ్ బాండీ వెల్లడించారు. ఈకేసులో మదురో భార్య, కుమారుడితోపాటు పలువురు ఉన్నతాధికారుల పేర్లను కూడా చేర్చారు. ప్రస్తుతం మదురో న్యూయార్క్‌లోని ఫెడరల్ జైలులో ఉన్నారు.

# ఉత్తర నైజీరియా గ్రామంపై సాయుధ మిలిటెంట్ల దాడి

## 30 మంది మృతి, భారీ సంఖ్యలో కిడ్నాప్



**అబూజా, జనవరి 4:** ఆఫ్రికాదేశం ఉత్తర నైజీరియాలోని మారుమూల గ్రామంపై సాయుధులైన దుండగులు భీకర దాడి చేశారు. విచక్షణారహితంగా కాల్పుల్లో సుమారు 30 మంది గ్రామస్థులు మరణించారు. మరికొందరిని కిడ్నాప్ చేసి అడవిలోకి ఎత్తుకెళ్లారు. నైజర్ రాష్ట్రంలోని కసువాన్‌దాజీ గ్రామంలో ఈ ఘోర ఘటన జరిగింది. ఊహించని ఈ దాడితో జనం ప్రాణభయంతో పరుగులు తీశారు. ప్రస్తుతం అక్కడ పరిస్థితి యుద్ధ వాతావరణాన్ని తలపిస్తోంది. బోర్గు స్థానిక ప్రభుత్వ పరిధిలోని కసువాన్‌దాజీ గ్రామంపై దుండగుల ముఠా విరుచుకుపడింది. గ్రామంలోకి ప్రవేశించగానే జనంపై కాల్పులు మొదలుపెట్టారు. కనిపించిన వారిని కనిపించినట్లు కాల్చి చంపారు. అంతటితో ఆగకుండా గ్రామంలోని ఆస్తులను ధ్వంసం చేశారు. స్థానిక మార్కెట్‌కు నిప్పు పెట్టారు. అనేక ఇళ్లను దహనం చేశారు. దీంతో గ్రామం మంటల్లో చిక్కుకుంది. మరణాల సంఖ్యపై పోలీసులు, స్థానికుల మధ్య భిన్న వాదనలు ఉన్నాయి. ఈ దాడిలో కనీసం 30 మంది గ్రామస్థులు మరణించారని పోలీసులుప్రకటిస్తే స్థానికులు మాత్రం మృతుల సంఖ్య 37కు పైగా ఉందని చెబుతున్నారు. చాలా మంది ఇంకా కనిపించడం లేదని, వారిని దుండగులు కిడ్నాప్ చేసి తీసుకెళ్లారని, దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటన తర్వాత భద్రతా బలగాల స్పందనపై విమర్శలు వస్తున్నాయి. కిడ్నాప్ అయిన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టామని, అధికారులను మోహరించామని నైజర్ రాష్ట్ర పోలీస్ అధికార ప్రతినిధి వాసియు అబియోడున్ తెలిపారు. దుండగులు ఎక్కడి నుంచి వచ్చారనే దానిపై పోలీసులకు క్లారిటీ వచ్చింది. కబే జిల్లా వెంబడి ఉన్న నేషనల్ పార్క్ ఫారెస్ట్ నుంచి దుండగులు గ్రామంలోకి చొరబడ్డారు. దాడి చేసిన తర్వాత మళ్లీ అడవిలోకే పారిపోయారు. నైజీరియాలో విశాలమైన అటవీ ప్రాంతాలు ఉండటంతో, వాటిని ఈ సాయుధ ముఠాలు తమ స్థావరాలుగా మార్చుకుంటున్నాయి. ప్రభుత్వ పర్యవేక్షణ, భద్రత తక్కువగా ఉండే మారుమూల గ్రామాలనే వీరు లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఈ ప్రాంతంలో ఇలాంటి దాడులు జరగడం ఇదే తొలిసారి కాదు. తాజా దాడి జరిగిన కసువాన్‌దాజీ గ్రామం, పపిరి కమ్యూనిటీకి సమీపంలోనే ఉంది. గత ఏడాది నవంబర్‌లో పపిరిలోని ఒక క్యాథలిక్ పాఠశాల నుంచి 300 మందికి పైగా విద్యార్థులను, టీచర్లను దుండగులు కిడ్నాప్ చేశారు. ఇప్పుడు మళ్లీ అదే ప్రాంతంలో నరమేధం జరగడం ఆందోళన కలిగిస్తోంది. ఆఫ్రికాలో అత్యధిక జనాభా కలిగిన నైజీరియాలో ఆధిపత్యం కోసం అనేక ముఠాలు అమాయక ప్రజలను బలి తీసుకుంటున్నాయి.

# ఎప్పటికీ మాదే అధికారం అనుకోవద్దు..

## బిఎంసి మేనిఫెస్టో విడుదలలో థాక్రే బ్రదర్స్ హితవు



**ముంబయి,జనవరి 4:** అసెంబ్లీ చైర్మన్‌గా ఉన్న రాహుల్ నార్వేకర్ బహిరంగంగానే అభ్యర్థులను, ఓటర్లను బెదిరించడం దిగ్భ్రాంతికి కలిగించినట్టు ఉద్ధవ్ థాకరే తెలిపారు. స్పీకర్‌పై వెంటనే చర్చలు తీసుకోవాలని, ఆయనను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎప్పటికీ మాదే అధికారం అనుకోవద్దని, అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, ఎప్పటికీ తామే అధికారంలో ఉంటామని బీజేపీ అనుకుంటే పొరపాటని మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) చీఫ్ రాజ్ థాక్రే అన్నారు. మహారాష్ట్రను యూపీ, బిహార్‌లా మార్చాలనుకుంటున్నారని విమర్శించారు. మహారాష్ట్ర ఈ దేశానికి దిశానిర్దేశం చేస్తుం దని చెప్పారు. పశ్చిమబెంగాల్‌లో ఏకగ్రీవంగా ఎన్నికైన అభ్యర్థులకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టుకు వెళ్లిన బీజేపీ ఇప్పుడు మహారాష్ట్రలో పోటీ లేకుండా అభ్యర్థులను గెలిపించుకోవడంపై ఏం చెబుతుందని ప్రశ్నించారు. బ్రిహాన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బిఎంసి) ఎన్నికల మేనిఫెస్టోను తన సోదరుడు, శివసేన చీఫ్ ఉద్ధవ్ థాక్రేతో కలిసి ఆదివారం నాడిక్కడ ఆయన విడుదల చేశారు. బీజేపీ, మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నార్వేకర్‌పై ఈ సందర్భంగా థాక్రే సోదరులు విమర్శలు గుప్పించారు. అసెంబ్లీ చైర్మన్‌గా ఉన్న రాహుల్ నార్వేకర్ బహిరంగంగానే అభ్యర్థులను, ఓటర్లను బెదిరించడం దిగ్భ్రాంతికి కలిగించినట్టు ఉద్ధమ్ థాకరే తెలిపారు. స్పీకర్‌పై వెంటనే చర్చలు తీసుకోవాలని, ఆయనను సస్పెండ్ చేయా లని డిమాండ్ చేశారు. నేతల సెక్యూరిటీ తీసేయాలని అధికారులకు ఆయన తెలిపారని, ఆయనకు అసెంబ్లీలో అధికారం ఉందే కానీ, బయట లేదని చెప్పారు. అభ్యర్థులను పోటీలేకుండా ఎన్నుకోవడం ద్వారా ఓటర్ల హక్కులను నార్వేకర్ కొల్లగొట్టారని, ఆయనపై కేసు నమోదు చేయాలని అన్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన ప్రాంతాల్లో ఉపఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. పధాని నరేంద్ర మోదీపై ఉద్ధవ్ థాక్రే విమర్శలు గుప్పించారు. ఇది ముఠా పాలనే కానీ, ప్రజాస్వామ్యం కాదు. ఓట్ చోరీకి పాల్పడుతుంటే రెడ్‌హ్యాండ్‌గా పట్టుకున్నాం. ఇప్పుడు అభ్యర్థులను తస్కరిస్తున్నారు. మేము మాత్రం మోడీతో రాజీపడే ప్రసక్తే లేదు. రిటర్నింగ్ అధికారుల కాల్ రికార్డులన్నీ మాకు చూపించాలని ఎన్నికల కమిషన్‌ను మేము సవాలు చేస్తున్నాం అని థాక్రే అన్నారు.



# తీరు మారకపోతే మీపైనా చర్యలు

## క్యూబా, మెక్సికో, కొలంబియాలకు ట్రంప్ హెచ్చరిక

**వాషింగ్టన్, జనవరి 4:** వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా సైన్యం బంధించిన అనంతరం ప్రెసిడెంట్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. వెనిజులా తాత్కాలికంగా తమ ఆధీనంలోనే ఉంటుందని చెపుతూ లాటిన్ అమెరికాలోని ప్రత్యర్థి దేశాలైన క్యూబా, మెక్సికో, కొలంబియాలకు సైతం వార్నింగ్ ఇచ్చారు. డ్రగ్స్ తయారీ, మాదక ద్రవ్యాల ముఠాలకు క్యూబా, మెక్సికో, కొలంబియా దేశాలు ఆశ్రయమిస్తున్నాయని, అక్కడి నుంచి అమెరికాలోకి అక్రమంగా డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్నారని ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే కారణంతో వెనిజులా పై సైనిక చర్యలు చేపట్టినట్లు స్పష్టం చేశారు. ఇప్పటికైనా ఆ దేశాలు తమ పద్ధతి మార్చుకోకపోతే వెనిజులా పరిస్థితినే ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఆయా దేశాల్లోని డ్రగ్స్ ఉత్పత్తి ల్యాబ్‌లపై దాడులు చేయడానికి కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు. ముఖ్యంగా కొలంబియాపై ట్రంప్ తీవ్ర విమర్శలు చేశారు. కొలంబియాలో మూడు ప్రధాన కొకైన్ తయారీ కేంద్రాలు ఉన్నాయని అన్నారు. వాళ్లే కొకైన్‌ను తయారు చేసి, అమెరికాకు పంపిస్తున్నారని అందుకే అతను జాగ్రత్తగా ఉండాలంటూ కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రోను ఉద్దేశించి హెచ్చరించారు. కాగా, వెనిజులా అధ్యక్షుడిని అమెరికా సైన్యం బంధించడాన్ని క్యూబా, కొలంబియా, మెక్సికో దేశాలు ఖండించాయి. ఇది దురాక్రమణ కిందకే వస్తుందని స్పష్టం చేశాయి. ఈ పరిణామాలు దక్షిణ అమెరికా మొత్తం భద్రతకు ముప్పుగా మారిందని పేర్కొన్నాయి. ట్రంప్ చర్యలతో తాము కూడా అప్రమత్తమయ్యామని వెనిజులా సరిహద్దుల్లో సైన్యాన్ని మోహరిస్తున్నామని కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో తెలిపారు.




# క్షిపణి పరీక్షలతో తూర్పుఆసియాలో కిమ్ ప్రకంపనలు

**ప్యాంగ్యాంగ్, జనవరి 4:** ఉత్తర కొరియా కొన్ని రోజులవిరామం తర్వాత తన క్షిపణి ప్రయోగాలతో తూర్పు ఆసియాలో మళ్లీ ప్రకంపనలు సృష్టిస్తోంది. ఆదివారం ఉదయం ఉత్తర కొరియా బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించినట్లు గుర్తించిన జపాన్ ప్రభుత్వం తన దేశ ప్రజలకు అత్యవసర హెచ్చరికలు జారీ చేసింది. సుమారు రెండు నెలల తర్వాత ఉత్తర కొరియా జరిపిన మొదటి బాలిస్టిక్ క్షిపణి పరీక్ష ఇదే కావడం గమనార్హం. ఉత్తర కొరియాక్షిపణి ప్రయోగం చేసినట్లు జపాన్ ప్రధాని కార్యాలయం ధ్రువీకరించింది. జపాన్ రక్షణ మంత్రిత్వ శాఖ సమాచారం ప్రకారం ఈ క్షిపణి అప్పటికే సముద్రంలో పడిపోయి ఉంటుందని భావిస్తున్నారు. మరోవైపు, ఆదివారం ఉదయం 7:50 గంటల ప్రాంతంలో రాజధాని ప్యాంగ్యాంగ్ సమీపంలోని తీరం నుంచి ఉత్తర కొరియా వరుసగా పలు క్షిపణులను సముద్రంలోకి ప్రయోగించిందని దక్షిణ కొరియా సైన్యం ప్రకటించింది. అమెరికా, జపాన్ దేశాలతో కలిసి పరిస్థితిని తాము నిశితంగా గమనిస్తున్నామని సియోల్ వెల్లడించింది. దక్షిణ కొరియా అధ్యక్షుడు లీజే మ్యుంగ్ చైనా పర్యటనకు బయలుదేరుతున్న తరుణంలో ఈ ప్రయోగాలు జరగడం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది.కొరియా ద్వీపకల్పంలో శాంతి నెలకొనేలా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సానుకూలంగా స్పందిస్తారని దక్షిణ కొరియా ఆశిస్తున్న వేళ కిమ్ జోంగ్ ఉన్ క్షిపణులతో కవ్వింపులకు దిగారు. ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ శనివారమే ఒక భారీ ఆయుధ కర్మాగారాన్ని సందర్శించారు.క్షిపణుల ఉత్పత్తి సామర్థ్యాన్ని రెట్టింపు చేయాలని అధికారులను ఆదేశించారు. రానున్న నైన్త్ పార్టీ కాం గ్రెస్ సమావేశాలలోపు తన సైనిక బలాన్ని ప్రపంచానికి చాటిచెప్పాలనే ఉద్దేశంతోనే కిమ్ ఇలాంటి ప్రయోగాలకు పాల్పడుతున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

# సంక్షిప్తంగా..

## పుతిన్‌ను కూడా ఇలాగే తీసుకురాగలరా: రోఖన్నా ఆగ్రహం



**వాషింగ్టన్, జనవరి 4:** వెనిజులాపై యుద్ధం ప్రారంభించి మాగాను ట్రంప్ మోసం చేసారని భారత సంతతికి చెందిన అమెరికా చట్టసభల సభ్యుడు రోఖన్నా తప్పుపట్టారు. తాజా దాడులు ఆయన యుద్ధ చర్యగా పేర్కొన్నారు. ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్, లిబియాలో ఘర్షణలకు వ్యతిరేకంగా తాము ఓటు వేస్తున్నామన్నారు. కానీ అధ్యక్షులు మాత్రం సైనికీకరణకు అనుకూలంగా ఉండే విదేశాంగశాఖలోని కొందరి మాటలకు తలొగ్గుతు న్నారని అన్నారు. తైవాన్ అధ్యక్షుడు లచింగ్ తెనుచైనా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని రష్యా నిర్బంధిస్తే ఏంచేస్తారని ప్రశ్నించారు. ఉక్రెయిన్‌పై దాడులపరంపరను కొన సాగిస్తున్న పుతిన్ కూడా ట్రంప్ ఇలాగే హ్యాండిల్‌చేయాలని సూచించారు.

## అశ్లీలకంటెంట్ తొలగించడం, ఖాతాలను కూడా మూసేస్తాం



**న్యూఢిల్లీ, జనవరి 4:** ప్రపంచ కుబేరుడు ఎలన్ మస్క్‌కు చెందిన ప్రముఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' కంటెంట్ గురించి స్పష్టత ఇచ్చింది ఎక్స్‌లో పోస్ట్ చేసే చట్ట విరుద్ధమైన కంటెంట్‌ను పూర్తిగా తొలగిస్తామని,అలాంటి కంటెంట్‌ను పోస్ట్ చేసిన అకౌంట్లను శాశ్వతంగా సస్పెండ్ చేస్తామని వెల్లడించింది. అందుకోసం అవసరమైతే స్థానిక ప్రభుత్వాలతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించింది. ఎక్స్ గ్లోబల్ గవర్నమెంట్ అఫైర్స్ ఖాతా ద్వారా ఈ ప్రకటన వెలువడింది. స్థానిక చట్టాలకు, నియమాలకు విరుద్ధంగా అశ్లీల, అసభ్య కంటెంట్ పెరుగుతున్నట్టు భారత ప్రభుత్వం గుర్తించి ఎక్స్‌కు జనవరి రెండో తేదీన నోటీసులు జారీ చేసింది.

## నిధులకోసం పసికందును బలిచ్చేందుకు సిద్ధమైన తల్లితండ్రులు కటకటాల్లోకి..




**బెంగళూరు, జనవరి 4:** బెంగళూరు రూరల్ జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. డబ్బు మీద పిచ్చితో చంటిబిడ్డను చంపడానికి సిద్ధమయ్యారు తల్లిదండ్రులు. నిధికోసం 8 నెలల పసి కందును బలి ఇవ్వ డానికి చూసినా పోలీసుల ఎంట్రీతో కథ అడ్డం తిరిగింది. చిన్నారి క్షేమంగా బయటపడింది. కీచక తల్లి దండ్రులు జైలు పాలయ్యారు. సంఘటనకు సంబంధించి పోలీసుల వివరాలప్రకారం హుసకోటే తాలూకా, సులిబెలెలోని జనతా కాలనీకి చెందిన సయ్యద్ ఇమ్రాన్ పురాతన నిధుల కోసం గత కొంత కాలం నుంచి గాలిస్తూ ఉన్నాడు. ఈ నేపథ్యంలోనే ఇంట్లోని ఓ గదిలో నిధి ఉన్నట్లు అతడికి తెలిసింది. నిధి తమకు దక్కాలంటే ఓ చిన్నారిని బలివ్వటం తప్పదని భావించారు. ఇందుకోసం 8 నెలల తమ బిడ్డను బలివ్వడానికి సిద్ధమయ్యారు. ఈ సమాచారం పోలీసులకు అంది సయ్యద్ ఇంటి దగ్గరకు వెళ్లి పాపను కాపాడారు. భార్యాభర్తలను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.

## ఒడిశా క్వారీలో భారీ పేలుడు: ఇద్దరు మృతి

**ఢంకెనాల్, జనవరి 4:** ఒడిశాలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ఢెంకనాల్ జిల్లాలోని ఓ క్వారీలో భారీ పేలుడు సంభవించడంతో ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో పలువురు కార్మికులు గాయపడి శిథిలాల కింద చిక్కుకున్నారు. వీరిని రక్షించేందుకు సహాయక బృందాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. మోతంగా పీఎస్ పరిధిలోని గోపాల్‌పూర్ గ్రామ సమీపంలో ఓ రాతి క్వారీలో కార్మికులు డ్రిల్లింగ్, మైనింగ్ పనులు చేస్తున్న సమయంలో భారీ పేలుడు సంభవించింది. దీంతో అక్కడి కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనపై సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సహా ఒడిశా డిజాస్టర్ ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బృందాలు, డాగ్ స్క్వాడ్స్ అక్కడకు చేరుకున్నాయి. భారీ శిథిలాల మధ్య చిక్కుకున్న పలువురిని రక్షించేందుకు సహాయక చర్యలు ముమ్మరం చేశారు.

## వెనిజులాపై అమెరికా దాడులపట్ల వామపక్షాల నిరసన




**న్యూఢిల్లీ, జనవరి 4:** వెనిజులాపై అమెరికా సైనిక చర్యకు దిగడం, ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మదురోను, ఆయన భార్యను బంధించడాన్ని నిరసిస్తూ వామపక్ష పార్టీలు ఆదివారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేపట్టాయి. వెనిజులాపై అమెరికా చర్యను సామ్రాజ్యవాద సైనిక దురాక్రమణగా అభివర్ణించిన సీపీఎం, దీన్ని ప్రపంచ దేశాలు ఖండించాలని పిలుపునిచ్చింది. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన, దృఢమైన వైఖరి తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ దాడిని సీపీఎం, సీపీఐ, సీపీఐ(ఎంఎల్), ఆర్ఎస్‌పీ, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలు తీవ్రంగా ఖండించాయి. అమెరికా చర్య ఐక్యరాజ్యసమితి చార్టర్‌ను ఉల్లంఘించడమేనని ఆ పార్టీల ప్రధాన కార్యదర్శులు ఎం.ఏ. బేబీ, డి. రాజా, దీపాంకర్ భట్టాచార్య, జి. దేవరాజన్, మనోజ్ భట్టాచార్య సంయుక్త ప్రకటనలో తెలిపారు.



గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద థాయిలాండ్ భక్తులు

## శివయ్య సేవలో విదేశీ భక్తులు

శ్రీకాళహస్తి, జనవరి 4 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వ రాలయంలో ఆదివారం భక్తుల తాకిడి అధికంగా ఉంది. ఈ నేపధ్యంలో థాయిలాండ్‌కు చెందిన 15 మంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వారికి ఆలయం తరపున ఇఒ డి.బాపిరెడ్డి సూచనలతో ఎఇఒ మోహన్, ఎపిఆర్‌ఓలు రవి, శ్రీనాథ్‌లు పర్యవేక్షించారు. వారికి ఆలయంలో ప్రతి విగ్రహానికి సంబంధించి వివరించారు. ఇక్కడ క్షేత్ర మహిమను చరిత్రను వివరించారు. థాయిలాండ్ భక్తులకు స్వామి గర్భగుడిలోని స్వయంభువు వృత్తాంతాన్ని అర్చకులు వివరించారు. ఇక్కడ వెలసిన అమ్మవారిని జ్ఞాన ప్రసూనాంబ అని ఎందుకు పిలుస్తారు? అలాగే గురుదక్షిణామూర్తి దక్షిణాభిముఖంగా ఎందుకు వెలిసినారు అనే అంశాలను విదేశీ భక్తులకు వివరించారు. ప్రతి నెల హుండీల్లో అమెరికా, ఇతర దేశాల కరెన్సి రావటం ఇక్కడకు విదేశీ భక్తుల రాకను సూచిస్తుంది.



కేంద్ర మంత్రికి స్వాగతం చెబుతున్న ఇఒ డి.బాపిరెడ్డి

## కేంద్ర మంత్రి రాహుకేతుదోష పూజలు

శ్రీకాళహస్తి, జనవరి 4 ప్రభాతవార్త: దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి కుటుంబసభ్యులతో కలసి రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకున్నారు. కేంద్ర మంత్రి రాక సందర్భంగా దక్షిణ గోపురం వద్ద ఆలయ ప్రోటోకాల్ మేరకు ఇఒ డి.బాపిరెడ్డి వేద పండితులతో ఆలయ మర్యాదలతో మేళ తాళాలు మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికారు. మంత్రి ఆలయంలో నిర్వహించే రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించు కోవాలని కోరగా ఇఒ బాపిరెడ్డి వెంటనే వారికి ప్రత్యేక రాహుకేతు దోష నివారణ టిక్కెట్టు రూ.5 వేల కినుగోలు చేసి సహస్రలింగేశ్వరుని ఆలయం వద్ద ఏర్పాటు చేసారు. వేదపండితులు వేదమంత్రాలతో పూజలు నిర్వహించారు. వారికి స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వారికి వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఎఇఒలు మోహన్, విద్యాసాగర్‌రెడ్డిలు వారికి స్వామి అమ్మవార్ల చిత్రపటాలను తీర్ధ ప్రసాదాలను అందించారు. ఏర్పాట్లను ఆలయ ఎపిఆర్‌ఓలు రవి, శ్రీనివాసులు, టెంపుల్ ఇన్స్పెక్టర్లు వెంకటస్వామి, హరికృష్ణ, సుదర్శనం నాయుడు పర్యవేక్షించారు.



## ఎస్వీ విద్యాదాన ట్రస్ట్‌కు అంకాలమ్మ ఆలయ ట్రస్ట్ విరాళం

తిరుమల, జనవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి: టిటిడి విద్యాదానట్రస్ట్‌కు తిరుపతి జిల్లా వడమాలపేట మండలం అంకాళమ్మ ఆలయ ట్రస్ట్ ఛైర్మన్ టి.పీతాంబరం ఆచారి విరాళం అందించాడు. ఆదివారం సాయంత్రం తిరుమలలో దాత టిటిడి అదనపు ఇఒ చిరూమామిళ్ళ వెంకయ్య చౌదరిని కలసి 10,01,111రూపాయలు చెక్కును విరాళంగా అందజేశారు. శ్రీవారిపై భక్తి విశ్వాసాలతో విరాళం అందించినట్లు చెప్పారు.

## విద్యుత్ భారం నుండి ఊరట

### - ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావ్

గన్నవరం(కృష్ణా), జనవరి 4, ప్రభాతవార్త: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రప్రజలకు రూ.4,498కోట్ల విద్యుత్ భారం నుండి ఊరట కల్పిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకోవటం అభినంద నీయమని రాష్ట్రప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ కొనియాడారు.

ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 2019-24 మధ్యకాలంలో వినియోగించిన విద్యుత్‌కు రూ.4,498 కొట్లు ప్రజల నుండి వసూలు చేసేందుకు అనుమతి కోరుతూ ఏపి ఈఆర్సీ ప్రభుత్వానికి లేఖ రాయగా ఈమొత్తం ప్రభు త్వమే భరిస్తుందని చంద్రబాబు ప్రకటించినట్లు తెలిపారు. చంద్రబాబు చేపడుతున్న విద్యుత్ సంస్కరణల ఫలితంగా ఏపిఈఆర్సీ ఏర్పాటు అయిన తరువాత తొలిసారిగా ట్రూడౌన్ చార్జీలు నమోదు కావటం గొప్పవిషయంగా పేర్కొన్నారు. ట్రూడౌన్ అమలు ద్వారా తమ ప్రభుత్వం యూనిట్‌కు 13పైసలు చొప్పున తగ్గించినట్లు తెలిపారు. విద్యుత్ చార్జీలు తగ్గిస్తానని సియంగా ప్రమాణస్వీకారం రోజున ప్రగల్బాలు పలికిన జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉండగా 9సార్లు విద్యుత్‌చార్జీలు పెంచి రూ.32వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపి వారి నడ్డివిరిచారని మండి పడ్డారు. 2019లో మిగులు విద్యుత్ ఉన్న రాష్ట్రాన్ని జగన్ తన అస్యవ్యస్త పాలనా విధానాలతో విద్యుత్‌కోతలు విధించి ప్రజల్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేసారని ఆరోపించారు. కమీషన్‌ల కోసం ఎక్కువ ధరకు విద్యుత్‌ను కొనుగోలు చేసి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసారని విమర్శించారు.

# మత్తు రహిత రాష్ట్రం లక్ష్యం

- కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు
- ఇచ్ఛాపురంలో విజయవంతంగా అభ్యుదయం సైకిల్‌యాత్ర



శ్రీకాకుళం, జనవరి 4 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్‌ను మత్తురహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధృఢసంకల్పంతో ఉన్నారని గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం డ్రగ్స్ కేంద్రంగా మారి యువత భవిష్యత్తు చిన్నాభిన్నమైందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. విశాఖ రేంజి పోలీసు యంత్రాంగం ఆధ్వర్యంలో 'డ్రగ్స్ వద్దు బ్రో' అంటూ 25 మంది పోలీసులు నాలుగు జిల్లాలు, 75 మండలాలు, 508 గ్రామాల్లో 51 రోజులపాటు 1,300 కి.మీ దూరం సాగిన 'అభ్యుదయం సైకిల్ యాత్ర' శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో పూర్త య్యింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక పైలాన్‌ను హోంమంత్రి వంగలపూడి అనితతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడతూ కూటమి ప్రభత్వం కలిగిన శక్తిగా మార్చేందకు కృషి చేస్తోందని ఉద్ఘాటించారు. శ్రీకాకుళం యువత కేవలం శ్రమశక్తిపైనే కాకుండా ఆధునిక సాంకేతికత, నైపుణ్యాల కలయికతో ప్రపంచస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఇచ్ఛాపురం ఆడబిడ్డగా ఇక్కడ ముగింపు వేడకలు జరగడం సంతోషంగా ఉందని హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. మంత్రి లోకేష్ తన పాదయాత్రలో గంజాయి బాధితల కష్టాలు చూసి ఆనాడే ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. ఐజీ గోపీనాథ్ జెట్టి మానసపుత్రికగా వచ్చిన ఈ యాత్ర ద్వారా గంజాయిని రాష్ట్రంలో జీరో స్థాయికి తీసుకు వచ్చాం. కేవలం శిక్షల ద్వారానే కాకండా, అవగాహన ద్వారా యువతలో మార్పు తెస్తున్నామని ఆమె వివరించారు. ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ మాట్లాడుతూ గత ప్రభుత్వ అరాచక పాలనలో యువత మత్తులో మునిగిపోయిందని, నేడు ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థ ద్వారా ప్రజలు భయం వీడి 1972 టోల్‌ఫ్రీ నెంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. విశాఖ రేంజ్ ఐజీ గోపీనాథ్ జెట్టి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నిరోధం ఒక్క పోలీస్‌శాఖతోనే సాధ్యం కాదని ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమానికి సహకరించిన డీజీపీ, ఎస్పీలకు కృతజ్ఞతలు తెలిపార. ఈగల్ ఐజి ఎ.రవికృష్ణ మాట్లాడుతూ స్వయంగా తల్లిదండ్రులే తమ పిల్లలపై ఫిర్యాదు చేస్తున్నారని, దీని బట్టి మత్తు పదార్థాలు ఎంతగా వారిని బానిస చేస్తున్నాయో అర్థమవుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పండ్కర్ మాట్లాడుతూ స్కూళ్లు, కాలేజీలో విద్యార్థులు తమ సహచరుల ప్రవర్తనలో తీవ్ర మార్పు వస్తే మత్తు పదార్థాలకు బానిసయ్యారని అనుమానం ఉంటే ఈగల్‌కు తెలపాలని, టోల్ ఫ్రీ నెంబర్‌ను వినియోగించాలని, మీక పోలీసుల నుంచి ఎటువంటి సమస్యలు రావని హామీ ఇచ్చారు. జిల్లా ఎస్పీ కెవి మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ మత్తు పదార్థాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు చేపట్టి ఈ యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని తెలిపారు. ఈ ముగింపు కార్యక్రమంలో మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్, విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి, ఈగల్ టీం ఐజీ రవికృష్ణ, శ్రీకాకుళం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఉత్తరాంధ్ర జిల్లాల ఎస్పీలు, వేల మంది విద్యార్థులు, పోలీసులు, వివిధ వర్గాల ప్రతినిధులు పాల్గొని 'డ్రగ్స్ వద్దు బ్రో' అని నినదించారు. మొదట ఇచ్ఛాపురంలో పోలీస్‌స్టేషన్ వద్ద కేంద్ర, రాష్ట్ర మంత్రులు 'డ్రగ్స్ వద్దు బ్రో' పైలాన్ ఆవిష్కరించారు. అనంతరం అక్కడి నుంచి సాంస్కృతిక ప్రదర్శనలతో రాజావారి మైదానం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కేంద్ర మంత్రితో పాటు ప్రముఖులు సైకిల్ తొక్కగా, హోంమంత్రి ద్విచక్ర వాహనం నడుపుతూ వచ్చారు. ఈ కార్యక్రమంలో ఎచ్చెర్ల, నరసన్నపేట, పలాస ఎమ్మెల్యేలు ఎన్.ఈశ్వరరావు, బగ్గు రమణమూర్తి, గౌతు శిరీష ఉన్నారు.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి
- పెరుమాళ్లపాడులో అన్నదాతలకు కొత్త పాసు పుస్తకాల పంపిణి



చేజర్ల (నెల్లూరు), జనవరి 4, ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సరికొత్త రాజముద్రతో పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీకి శ్రీకారం చుట్టిందని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం చేజర్ల మండలం పెరుమాళ్లపాడు గ్రామంలో మీ భూమి-మీ హక్కు నినాదంతో నిర్వహించిన పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు ప్రభుత్వ రాజముద్రతో ముద్రించిన నూతన పట్టాదారు పాసు పుస్తకాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పంపిణీ చేసిన పట్టాదారు పాస్ పుస్తకాలు చట్టబద్ధత లేనివని, అవి ఇంట్లో ఉంటే అరిష్టమని వ్యాఖ్యానించిన మంత్రి, వాటిని తిరిగి ఇచ్చేయాలని రైతులను కోరారు. ప్రభుత్వ రాజముద్ర, క్యూఆర్ కోడ్, భద్రతా ప్రమాణాలతో ప్రస్తుతం అందిస్తున్న పాస్ పుస్తకాలు పూర్తిగా చట్టబద్ధమైనవని తెలిపారు. కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలలోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే భూ యజమానికి సంబంధించిన పూర్తి వివరాలు తక్షణమే కనిపిస్తాయని, వీటిలో ఎలాంటి మార్పులైనా, డేటా సెంటర్ ద్వారా మాత్రమే చేయగలమని స్పష్టం చేశారు. ఏ చిన్న తప్పు జరిగినా వెంటనే సరిదిద్దుతామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం ఎన్నికలకు మూడు నెలల ముందు 35 లక్షల మంది రైతుల పాస్ పుస్తకాలను మార్చిందని, కోటి మంది రైతుల భూ హక్కులను గందరగోళానికి గురిచేసిందని విమర్శించారు. రీసర్వే పేరుతో హద్దురాళ్లపై కూడా గత సీఎం బొమ్మలు ముద్రించి రూ.650 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. నెల్లూరు జిల్లాలో 235 గ్రామాల్లో 1.05 లక్షల మందికి పైగా రైతులకు గత సీఎం బొమ్మతో కూడిన పాస్ పుస్తకాలు పంపిణీ చేయగా, ఆత్మకూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 13 గ్రామాల్లో 5,486 పాస్ పుస్తకాలు పంపిణీ చేశారని తెలిపారు. వీటి స్థానంలో ప్రభుత్వ రాజముద్రతో కూడిన నూతన పాస్ పుస్తకాలను అందిస్తున్నామని చెప్పారు.

### విద్యుత్ ట్రూ అప్ చార్జీలు రద్దు

విద్యుత్ ట్రూఅప్ చార్జీలను పూర్తిగా రద్దు చేశామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రకటించారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో రూ.32,166 కోట్ల ట్రూఅప్ చార్జీలను వసూలు చేసిందని, ఇక నుంచి ప్రజలపై భారం వేయకుండా ప్రభుత్వం ఏడాదికి రూ.4,497 కోట్లను భరిస్తుందని తెలిపారు. తిరుపతి రీజియన్ పరిధిలో రూ.1,551.69 కోట్ల మేర ప్రజలకు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని సంగం మండలం అన్నారెడ్డి పాలెం, చేజర్ల మండలం పెరుమాళ్లపాడుకు నూతన విద్యుత్ సబ్ స్టేషన్లు మంజూరు చేశామని తెలిపారు. పెరుమాళ్లపాడులోని పురాతన శివాలయం పునర్నిర్మాణానికి రూ.1.50 కోట్లు మంజూరు చేసి, శుభ ముహూర్తంలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. 2026 డిసెంబర్ నాటికి రాష్ట్ర రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేసి రైతులకు చట్టబద్ధ భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజలకు సుపరిపాలన అందిస్తూ రామరాజ్య స్థాపన దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డీవో బి. పావని గ్రామ సర్పంచ్ తెలపన్నేని నర్సమ్మ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు తాళ్లూరి గిరి నాయుడు, తెలపన్నేని జయంతులు నాయుడు, మాజీ ఎంపీపీలు అన్నలూరు శ్రీనివాసులు, రావి పెంచల రెడ్డి, ఎంపీపీ తూమాటి విజయభాస్కర్ రెడ్డి, అచ్చాల నారాయణ రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు బూదల్ల వీర రాఘవరెడ్డి, రావి లక్ష్మీ నర్సా రెడ్డి, చీర్ల వెంకటేశ్వర్లు, గోనుగుంట రాంబాబు, ఉడతా పెద్ద హజరత్, అచ్చాల సుబ్బారెడ్డి, గుత్త హజరత్ నాయుడు, శ్రీధర్ నాయుడు, ఆత్మకూరు డిఎల్‌పిఓ రమణయ్య ఎంపీడీవో అమర్, తహసీల్దార్ మస్తానయ్య, రెవెన్యూ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.



## బలిజపల్లి గ్రామస్థుల ఆప్యాయత మరువలేనిది

### మెగాస్టార్ చిరంజీవి కుమార్తె సుష్మిత

రామచంద్రాపురం, జనవరి 4 ప్రభాతవార్త: బలిజపల్లి గ్రామస్థుల ఆప్యాయత, అనురాగాలు మరువలేనివని మెగాస్టార్ చిరంజీవి కుమార్తె, ప్రొడ్యూసర్ సుష్మిత అన్నారు. తిరుపతి జిల్లా, రామచంద్రాపురం మండలం, బలిజపల్లి గ్రామంలో ఆదివారం "మన శంకర్ వరప్రసాద్ గారు" మెగా చిత్రం ఈ నెల 12న విడుదల నేపథ్యంలో డైరెక్టర్ అనిల్ రావిపూడి, ప్రొడ్యూసర్ గారపాటి సాహుతో కలసి బలిజపల్లిలోని చిరంజీవి వీరాభిమానులు పొర్లుదండాల ఈశ్వర్ రాయల్, చంద్రశేఖర్ రాయల్ నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా తమ అభిమాన హీరో మెగాస్టార్ కుమార్తె సుష్మిత, స్టార్ డైరెక్టర్ అనిల్ రావిపూడి తమ గ్రామానికి వస్తున్నారనే ఆనందోత్సాహాలతో గ్రామస్థులు వారికి మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, భాణాసంఛా పేళుళ్ళ నడుమ పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. గ్రామమంతా హరిదాసు భజనలు, గంగిరెద్దుల ఆటలు, చెక్కల భజనలు, రంగు రంగుల రంగవళ్ళులతో ముందుగానే గ్రామంలోకి సంక్రాంతి శోభను తీసుకువచ్చారు. గ్రామ దేవతలు నడివీధి గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి, రామాలయానికి చేరుకున్న వీరికి అర్చకులు వేదమంత్రోచ్చారణలతో ఆశీస్సులందించారు. జల్లికట్టు సంబరాల కొరకు సిద్దం చేసిన బసవన్నలను తిలకించి హర్షం వ్యక్తం చేస్తూ గ్రామస్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో తపసి మురళి రెడ్డి, దండు లక్ష్మీపతి పాల్గొన్నారు.

## నేడు డయల్ యువర్ ఎస్పీడిసిఎల్ సిఎండి



తిరుపతి, జనవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నేటి ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12:30 వరకు "డయల్ యువర్ ఎస్పిడిసిఎల్ సిఎండి కార్యక్రమాన్ని" నిర్వహించనున్నట్లు ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ సిఎండి కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు 89777 16661కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకు రావచ్చని తెలిపారు. వినియోగదారులు తమ వద్ద విద్యుత్ సర్వీసు నంబరు అందుబాటులో ఉండేలా చూసు కోవాలని కోరారు. సర్కిల్ స్థాయిలోనూ డయల్ యువర్ ఎస్ఈ సర్కిల్ స్థాయిలో కూడా ప్రతి సోమవారం ఉదయం 8.30 నుండి 9.30 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని సిఎండి తెలిపారు.

# మంత్రి నారాయణ చొరవతో పేద విద్యార్థుల కోసం ఇంటర్నేషనల్ స్కూల్

- వక్ఫ్‌బోర్డు స్థలంలో 5ఎకరాల్లో భూమిపూజ చేసిన మంత్రి నారాయణ
- వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఉచిత విద్య అందించేలా ఏర్పాట్లు



నెల్లూరు, జనవరి 4 ప్రభాతవార్త- వైద్యం: నెల్లూరులో పేద విద్యార్థులకు కార్పొరేట్, అంతర్జాతీయ విద్య అందించడంపై మంత్రి నారాయణ ప్రత్యేకదృష్టి పేట్టారు. సొంత నియోజక వర్గమైన నెల్లూరు సిటీతోపాటు నెల్లూరు గ్రామీణ నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేస్తున్నారు. లక్షల్లో కాదు.. కోట్లు ఖర్చు పెట్టి స్కూల్స్ అభివృద్ధి చేయడంతోపాటు ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నారు. తాజాగా నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రూరల్ నియోజక వర్గంలో ఉన్న పరమేశ్వర నగర్‌లో 20కోట్లతో అంతర్జాతీయ స్థాయి స్కూల్ ఏర్పాటుకు ఎంపి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యే శ్రీదర్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అజీజ్‌తో కలసి భూమి పూజ చేశారు మంత్రి నారాయణ....

వక్ఫ్‌బోర్డు స్థలంలో 5ఎకరాల్లో పేద విద్యార్థులకు ఉచితంగా విద్యనందించేందుక ఈ స్కూల్ ఏర్పాటు చేస్తున్నారు. దీనికోసం అనకాపల్లి ఎంపి సీఎం రమేష్ రూ.20 కోట్లు సీఎస్ఆర్ నిధులు అందించారు. భూమి పూజా కార్యక్రమం మైనార్టీ పెద్దలు, పార్టీ నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రుల సమక్షంలో అట్టహాసంగా జరిగింది. వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి 1000మంది విద్యార్థులకు 1నుంచి 12వ తరగతి వరకు అడ్మిషన్లు ప్రారంభించేలా నిర్మాణం పూర్తిచేయాలని నిర్ణయించారు. ఇప్పటికే నెల్లూరు సిటిలో తాను చదువుకున్న విఆర్సీ పాఠశాలను అత్యాధునిక హంగులతో తీర్చిదిద్ది మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా గత విద్యాసంవత్సరం ప్రారంభించారు. భూమి పూజ తర్వాత జరిగిన బహిరంగ సభలో మంత్రి నారాయణ మాట్లాడారు. ఈ స్కూల్‌కు అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ స్కూల్‌గా నామకరణం చేశారు. నెల్లూరు సిటీలో సుమారుగా 94వేల ఇళ్లు ఉండగా గత ఎన్నికల సమయంలో 84వేల ఇళ్ళకు డోర్ టు డోర్ కాంపెయిన్‌కు వెళ్ళానన్నారు. అప్పుడే పేదలకు నాణ్యమైన విద్యను అందించాలని నిర్ణయించు కోవడం జరిగిందన్నారు. తాను కటిక పేదరికం నుండి వచ్చానని పేదరికం విలువ తెలుసని అన్నారు. తన గురువు నారాయణమూర్తి ద్వారా ఫౌండేషన్ ఏర్పడిందన్నారు. నగరంలోని 15 పాఠశాలను అభివృద్ధి చేసే విధంగా పలువురు దాతలు సహకారం తీసుకోవడం జరిగిందన్నారు. అందులో ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీదా మస్తాన్‌రావు, డిఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ నుంచి సుధాకర్‌రెడ్డి, డాక్టర్ భాస్కర్, సీఎం రమేష్, రెడ్డి ల్యాబ్స్, టివిఎస్ కంపెనీ నుండి సహకారం తీసుకోవడం జరిగిందన్నారు.

నెల్లూరు నగరంలో సుమారు 200కోట్ల రూపాయలతో పాఠశాలలను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. తాను చదివిన విఆర్ పాఠశాల అభివృద్ధికి తన కూతురు షరిణీ, ఎన్‌సిసి గ్రూపులు సహాయ సహకారాలు అందించారన్నారు.

కార్యక్రమంలో ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, హాజ్ కమిటీ ఛైర్మన్ హాసన్ బాష, నగర మేయర్ రూప్‌కుమార్ యాదవ్, నగరపాలక సంస్థ కమీషనర్ నందన్, డిప్యూటీ మేయర్ హసీనా, మాజీ శాసనమండలి ఛైర్మన్ షరీఫ్, పలువురు నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడలో సైబర్ క్రైమ్ ముఠా అరెస్ట్

విజయవాడ, జనవరి 4 ప్రభాతవార్త ప్రతినిధి: నిరుద్యోగులు, అమాయకులతో బ్యాంకు ఖాతాలు తెరిపించి ఆ వివరాలను చట్ట విరుద్ధ లావాదేవీల కోసం వాటిని ఫిలిప్పీన్స్‌కు పంపిస్తున్న విజయవాడకు చెందిన ముఠాను సైబర్ పోలీసులు అరెస్టు చేశారు. కరెంటు ఖాతా తెరిస్తే డబ్బులు ఇస్తామని ఆశ చూపిస్తున్నారు. ఆ తర్వాత బ్యాంకు ఎకౌంట్లు సేకరిస్తున్నారు. ఈ ముఠాలోని ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన అనుమానితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. విజయవాడకు చెందిన పేరపోగు దేవదాసు ఉద్యోగం చేసి, ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. గతేడాది అతని ఇంటి పక్కన ఉండే కృష్ణారెడ్డి (ఏ3) దేవదాసును కలిసి బ్యాంకులో కరెంటు ఖాతాను తెరిచి, ఆన్‌లైన్‌లో షేర్ చేస్తే డబ్బులిస్తారని ఆశ చూపించాడు. రూ.10,000 వస్తాయన్న ఆశతో కృష్ణారెడ్డితో కలిసి భవానీపురంలోని సిటీ యూనియన్ బ్యాంకుకు వెళ్లాడు. అక్కడ కరెంటు ఖాతా తెరిచి, కిట్‌ను కృష్ణారెడ్డికి ఇచ్చాడు. తర్వాత బాధితుడి ఫోన్‌పే ఖాతాలకు రూ.7,000 జమ చేశారు. ఇటీవల దేవదాసు తన ఖాతాను పరిశీలించగా రూ.2 కోట్ల లావాదేవీలు జరిగినట్లు గుర్తించాడు. భయపడి వెంటనే విజయవాడలోని సైబర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసులో సూర్య, కృష్ణారెడ్డి, అతని భార్య సౌభాగ్యలక్ష్మిలను పోలీసులు అరెస్టు చేశారు. కీలక నిందితురాలు పార్వతి ఇంకా అరెస్టు కావాల్సి ఉంది. ఈ ముఠా మొత్తం 199 ఖాతాలు తెరిపించగా వాటిలో 36 ఖాతాల నుంచి 56 మోసాలకు సంబంధించి లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు.

**ఫిలిప్పీన్స్‌కు ఖాతాలు:** కృష్ణారెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా కీలక విషయాలు వెలుగు చూశాయి. అతని భార్య సౌభాగ్యలక్ష్మి (ఏ4) కూడా అమాయకులతో బ్యాంకు ఖాతాలు తెరిపించేదని తేలింది. వీరిపై విజయవాడ నగరానికి చెందిన సూర్య శ్రీనివాస మణికంఠ అలియాస్ సూర్య (ఏ1) పర్యవేక్షించాడు. ఈ దంపతులు సేకరించిన ఖాతాలను మణికంఠకు అందించేవారు. అతను వాటిని చట్టవిరుద్ధ లావాదేవీల కోసం పార్వతి (ఏ2)కి ఇచ్చేవాడు. ఆమె తిరిగి వీటిని ఫిలిప్పీన్స్‌లో ఉన్న మరో మహిళకు అందించేది. అక్కడి నుంచి ఈ ఖాతాలను బెట్టింగ్‌లు, సైబర్ నేరాలల్లో నగదు బదిలీలకు ఉపయోగించేవారు. ప్రతి ఖాతాకు వీరికి రూ.30,000 కమీషన్ అందేది. ఈ డబ్బును అన్ని దశల్లో పంచుకునే వారని దర్యాప్తులో తేలింది. ఈ ముఠా మొత్తం 199 ఖాతాలు తెరిపించగా, వాటిలో 36 ఖాతాల ద్వారా 56 లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. ఇవి ఏపీతో పాటు తెలంగాణ, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్, జమ్మూ కశ్మీర్ తదితర రాష్ట్రాల్లో జరిగిన మోసాలకు ఈ ఖాతాలను ఉపయోగించారు.

**కారుపై ఎమ్మెల్యే స్టిక్కర్:** ప్రధాన నిందితుడు సూర్యను 2023లోనూ అద్దె ఖాతాల కేసులో ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆగ్రా పోలీసులు అరెస్టు చేశారు. 9 నెలలు జైలులో గడిపాడు. బయటకు వచ్చాక టెలిగ్రామ్ ద్వారా అద్దె ఖాతాలు సేకరిస్తూ దందా కొనసాగిస్తున్నట్లు తేలింది. పోలీసులు సూర్యతో పాటు కృష్ణారెడ్డి, అతని భార్య సౌభాగ్యలక్ష్మిని అరెస్టు చేశారు. వీరి నుంచి 2 కార్లు, 3 ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సూర్య తన కారుపై రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేరుతో ఎమ్మెల్యే స్టిక్కర్ వేసుకున్నారు. దీని పైనా పోలీసులు ఆరా తీస్తున్నారు. కీలక నిందితురాలు పార్వతి సహా పలువురి అరెస్టుకు ప్రయత్నిస్తున్నారు.



## గోవా, త్రిపుర గవర్నర్‌లకు స్వాగతం

గన్నవరం, జనవరి 4 ప్రభాతవార్త: గన్నవరం విమానాశ్రయంలో గోవా, త్రిపుర గవర్నర్‌లకు పలువురు అధికారులు స్వాగతం పలికారు. గుంటూరులో జరుగుతున్న ప్రపంచ తెలుగు మహాసభల్లో పాల్గొనేందుకు రాష్ట్రానికి చేరుకున్న త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి, గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజులకు ఆదివారం గన్నవరం విమానాశ్రయంలో గుడివాడ ఆర్డీఓ జి.బాలసుబ్రమణ్యం పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం ఇద్దరు గవర్నర్‌లు రోడ్డుమార్గాన గుంటూరు బయలుదేరి వెళ్ళారు.



శ్రీనటరాజస్వామి వార్ల నగరోత్సవం

## దుర్గమ్మవారి ఆలయంలో వేడుకగా శ్రీనటరాజస్వామి నగరోత్సవం

- వేదోక్తంగా ఆరుద్ర ఉత్సవాలు పూర్ణాహుతి
- భక్తి శ్రద్ధలతో శివముక్కోటి

ఇంద్రకీలాద్రి, జనవరి 4 ప్రభాతవార్త: దుర్గమ్మవారి ఆలయంలో ఆదివారం వేడుకగా శ్రీ నటరాజస్వామి, శ్రీ శివకామ సుందరి అమ్మవార్ల నగరోత్సవం జరిగింది. ఆరుద్రోత్సవాల్లో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో చైర్మన్ రాధాకృష్ణ, ఇఒ వికె శీనా నాయక్, పాలక మండలి, అధికారులు పాల్గొన్నారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. ఆరుద్ర ఉత్సవాలకు ఆదివారం పూర్ణాహుతి నిర్వహించి స్వస్తి పలికారు. దుర్గమ్మవారి ఆలయంలో వేదోక్తంగా శివముక్కోటి ఉత్సవాలు జరిగాయి. ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఉత్తర ద్వారం గుండా శ్రీ స్వామివార్లను భక్తులు దర్శించుకున్నారు.

### నిత్యాన్నదానానికి విరాళం


దుర్గమ్మవారి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన కె వెంకట సుదర్శనరావు తమ కుటుంబసభ్యులతో కలిసి రు.1,11,116ల విరాళం ఆదివారం అందించారు. విజయవాడకు చెందిన మరో దాత ఎం.నాగలక్ష్మి సాయిసత్య రు.1,00,010లను తమ కుటుంబ సభ్యులతో కలిసి విరాళం నిత్యాన్నదాన పథకానికి అందించారు. వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలను అందించారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు.



గ్యాస్ సిలిండర్ పేలిన ఇళ్లు

## తాడిపత్రిలో గ్యాస్ గీజర్ పేలి 8 మందికి తీవ్రగాయాలు

తాడిపత్రిఅర్బన్, జనవరి 4 ప్రభాతవార్త: ఇళ్లల్లో వేడి నీటి కోసం గ్యాస్ గీజర్ ఎక్కువ గంటలు వేసి వుంచితే సిలిండర్లు బాంబుల్లా పేలుతున్నాయి. చలికాలంలో ఎక్కువ మంది వేడి నీటి కోసం గ్యాస్ గీజర్లను ఉపయోగిస్తుంటారు. ఎక్కువ సమయం గీజర్ ఆన్ చేసి వుంచితే సిలిండర్లు పేలే అవకాశాలు మెండుగా వున్నాయి. ఇంటిలో వేడి నీటి కోసం ఆన్‌చేసిన గ్యాస్ గీజర్‌కు అమర్చించిన సిలిండర్ పేలి 8 మందికి తీవ్రగాయాలై ఇంటిలో వున్న దాదాపు 10 లక్షల రూపాయల విలువైన సామాగ్రి కాలిపోయిన సంఘటన అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణంలోని చేనేతకాలనీలో చోటు చేసుకుంది. చేనేతకాలనీలో జనార్ధన్ అనే వ్యక్తి వేడినీటిని కాచుకునేందుకు గ్యాస్ గీజర్ అమర్చించిన సిలిండర్ ఆన్ చేయగా ఆకస్మాత్తుగా మంటలు ఎగిసిపడి సిలిండర్ బాంబులా పేలి మంటలు వేగంగా వ్యాపించాయి. దీంతో ఇంటిలో ఫర్నీచర్ మొత్తం అగ్నికి ఆహుతైంది. ఇంటిలో వున్న నలుగురితో పాటు కాపాడడానికి వచ్చిన మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు పోలీసులు, ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో హుటావుటిన వారు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చి మంటల్లో చిక్కుకున్న జనార్ధన్‌తో పాటు మరో ఏడుగురిని బయటకు తీసుకొచ్చి అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. మంటల్లో గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా వుండడంతో అనంతపురం తరలించి చికిత్స చేయిస్తున్నారు. చలికాలంలో గ్యాస్ గీజర్ ఉపయోగించేవారు నీరు పట్టుకునేటప్పుడు మాత్రమే సిలిండర్ ఆన్ చేసుకుని స్నానం ముగిసిన వెంటనే ఆఫ్ చేస్తే ఇలాంటి ప్రమాదాలు జరిగే అవకాశాలు వుండవని నిపుణులు చెబుతున్నారు.



## బ్రూక్లిన్ జైలులో మదురో!

**వాషింగ్టన్, జనవరి 4:** అపరేషన్ అబ్సల్యూట్ రిజాల్వ్‌చేపట్టిన అమెరికా వెనిజులా అధ్యక్షుడు మదురో ఆయన సతీమణిని బంధించి న్యూయార్క్‌కు తరలించిన తర్వాత వారిని బ్రూక్లిన్‌లోని మెట్రోపాలిటన్ డిటెన్షన్ సెంటర్‌లో ఉంచారు. ఆర్ కెల్లీ,సీన్ డిడ్డీ కాంబ్‌నస వంటి మ్యూజిక్‌స్టార్‌లు ఉన్న ఈ జైలు ఎంతో సమస్యాత్మకమైనదిగా భావిస్తారు. నిందితులను అక్కడికి పంపించేందుకు కొందరు న్యాయమూర్తులే నిరాకరిస్తారని వాడుకలో ఉంది. బ్రూక్లిన్‌లోని ఎండిసిని 1990లో ప్రారంబించారు. అక్కడ ప్రస్తుతం 1300 మంది ఖైదీలున్నారు. మన్‌హట్టన్; బ్రూక్లిన్‌ఫెడరల్ న్యాయస్థానాల్లో విచారణకోసం చూస్తున్నవారిని ఇక్కడికి తరలిస్తారు. వైట్‌కాలర్ నేరాల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారితోపాటు గ్యాంగ్‌స్టర్‌లు మాదకద్రవ్యాల కేసులో నిందితులను ఉంచుతారు. వెనిజులా అద్యక్షుడు నికొలస్ మదురో ఇపుడు ఈ జైలులోనే ఉన్నారు. హోండురాస్ మాజీ అద్యక్షుడు జువాన్ ఆర్లాండో ఫెర్నాండెజ్ గతంలో ఇక్కడే బందీటా ఉన్నారు. ఆయనకు ఈ కేసులో 45 ఏళ్ల శిక్ష పడింది. వనిజులా నిఘా విభాగం మాజీ చీఫ్ హ్యుగో కార్వాజల్‌తోపాటు ఆదేశ పలువురుప్రముఖులు బందీలుగా ఉన్నారు. కాగాబ్రూక్లిన్‌జైలును భూమిపై ఉన్న నరకం అని నిరంతర విషాదంగా వర్ణిసానతరు. ఇక్కడి హింసాత్మక ఘటనలపై ఖైదీలు వారి న్యాయవాదులనుంచి ఎన్నో ఫిర్యాదులు వస్తాయి. 2024లో తోటిఖైదీల చేతిలోనే ఇద్దరు ఖైదీలు హత్యకావింపబడ్డారు. 2019లో విద్యుత్ అంతరాయం కారణంగా వారంరోజులు ఖైదీలు చలి చీకట్లోనే ఉన్నారు.


# చిత్తూరు జిల్లాలో బాబు పెద్ద స్కెచ్!

- చిరకాల ప్రత్యర్థి పెద్దిరెడ్డిపై సిఎం వ్యూహాత్మక అడుగులు

చిత్తూరు, జనవరి 4 ప్రభాతవార్త: రాజకీయాల్లో సమకాలీనులైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తన ప్రత్యర్థి, సీనియర్ వైకాపా నాయకులు, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై పైచేయి సాధించారు. జిల్లాల పునర్విభజనలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డికి చిత్తూరు జిల్లాతో సంబంధం లేకుండా చేయడంలో సిఎం నారా చంద్రబాబు నాయుడు విజయం సాధించారు. పుంగనూరు నియోజకవర్గం లోని కీలకమైన పుంగనూరు మున్సిపాల్టీ, సోమల, చౌడేపల్లి, సదుం మండలాలను కొత్తగా ఏర్పాటు చేసిన మదనపల్లి జిల్లాలో విలీనం చేయడం, కేవలం పులిచెర్ల, రొంపిచెర్ల మండలాలను మాత్రమే చిత్తూరు జిల్లాలో వుంచడంతో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ప్రస్తుత చిత్తూరు జిల్లాతో వున్న సంబంధాలను విడగొట్టినట్లైంది. జాతీయ తెలుగుదేశం పార్టీ అధినేతగా వున్న ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలుగుదేశం పార్టీలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చక్రం తిప్పేవారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తెలుగుదేశం పార్టీ తరపున ఏ నిర్ణయం తీసుకోవాలన్నా తెలుగుదేశం అధినేతగా ప్రస్తుత సిఎం నారా చంద్రబాబునాయుడు తీసుకునేవారు. అలాగే ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గతంలో కాంగ్రెస్ తరపున, ప్రస్తుతం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున ఏ నిర్ణయం తీసుకోవాలన్నా అప్పుడు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం, ప్రస్తుతం వైకాపా అధిష్టానం మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ప్రాధాన్యత ఇచ్చి ఆ మేరకు నిర్ణయాలను అమలు చేసేవి. తెలుగుదేశం పార్టీ అధినేత, ప్రస్తుత సిఎం నారా చంద్రబాబునాయుడు సొంత నియోజకవర్గం చంద్రగిరి



అయితే, వైకాపా సీనియర్ నేత, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిది పీలేరు సొంత నియోజకవర్గం. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో వీరిద్దరు చదువుకునే రోజుల్లో జరిగిన విద్యార్థి సంఘ ఎన్నికల్లో ఒకరు ఒక గ్రూపుకు, మరొకరు మరో గ్రూపుకు నాయకులుగా వ్యవహరించేవారు. ఈ సమయంలో జరిగిన విద్యార్థి ఎన్నికల్లో ప్రస్తుత సిఎం నారాచంద్రబాబునాయుడు గ్రూపును మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గ్రూపు ఓడించింది. ఈ క్రమంలో అనూహ్య పరిస్థితుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యతిరేకంగానే వుండేవారు. కుప్పం నుండి సిఎం నారా చంద్రబాబునాయుడు తెలుగుదేశం పార్టీ తరపున ప్రాతినిధ్యం వహిస్తే కాంగ్రెస్ పార్టీ తరపున పీలేరు నుండి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహించేవారు. గతంలో సిఎంగా నారా చంద్రబాబు నాయుడు వున్న సమయంలో సైతం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులుగా వున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చుక్కలు చూపించారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున అనుచరగణం వుంది. 2019లో రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో వైకాపా అధికారంలోకి రావడంతో తెలుగుదేశం అధినేత, ప్రస్తుత సిఎం నారా చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంపై మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కన్నుపడింది. ఈ మేరకు మున్సిపల్, పంచాయతీ, ఎంపిటిసీ, జడ్పీటిసీ ఎన్నికల్లో అప్పుడు అటవీశాఖ మంత్రిగా వున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుప్పంలో మకాం వేసి వైకాపా గెలుపులో కీలకపాత్ర పోషించారు. చంద్రబాబు నాయుడుకు కంచుకోటగా ప్రసిద్ధిగాంచిన కుప్పం నియోజక వర్గంలో వైకాపా జెండా రెపరెపలాడేలా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేయడంతో అప్పటి నుండి తెలుగుదేశం అధినేత ఆయనపై గుర్రుగా వున్నారు. ఈ క్రమంలో జిల్లాల పునర్విభజన చేపట్టడం, వీటిల్లో కొన్ని మార్పులు, చేర్పులు జరుగుతుండటంతో సిఎం నారా చంద్రబాబునాయుడు తన సొంత జిల్లా అయిన



చిత్తూరు జిల్లా నుండి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అడ్రస్ గల్లంతు చేయాలని నిర్ణయించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వున్నట్లైతే కష్టమని భావించిన ప్రస్తుత సిఎం నారా చంద్రబాబునాయుడు పుంగనూరు నియోజకవర్గంలోని కీలక మండలాలు మదనపల్లి జిల్లాలో కలిపి కొత్త జిల్లాగా ఏర్పాటు చేసి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ప్రస్తుత చిత్తూరు జిల్లా నుండి ప్రక్కకు తప్పించినట్లు తెలుస్తోంది. అలాగే మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తనయుడు పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న అసెంబ్లీ నియోజకవర్గాలు సైతం ప్రస్తుత చిత్తూరు జిల్లాలో లేకుండా సిఎం నారా చంద్రబాబునాయుడు జాగ్రత్తలు తీసుకున్నారని భావిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో జిల్లాలో ప్రత్యర్థి వైకాపాకు సమర్థనేత ఎవరు ఆవిర్భవిస్తారనే విషయంపై పార్టీ నాయకులు, కార్యకర్తల్లో ఇప్పటి నుండి చర్చ ప్రారంభమైంది.

# ఆసక్తికరంగా బొమ్మనహాల్ ఎంపిపి ఉప ఎన్నిక

- క్యాంపు నుంచి నేడు రానున్న వైసిపి ఎంపిటిసిలు
- ఎంపిపి స్థానాన్ని కైవసం కోసం టిడిపి యత్నాలు
- అందరి కళ్లు ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు పైనే

అనంతపురం, జనవరి 4 ప్రభాతవార్త బ్యూరో: రాష్ట్ర ప్రభుత్వ విప్, రాయదుర్గం శాసనసభ్యుడు కాలువ శ్రీనివాసులు ప్రాతినిధ్యం వహిస్తున్న రాయదుర్గం నియోజకవర్గం బొమ్మనహాల్ మండలం ఎంపీపీ స్థానానికి సోమవారం జరిగే ఉప ఎన్నికలు ఆసక్తికరంగా మారాయి. మెజార్టీ ఎంపీటీసీ సభ్యులు వైసిపి వారు ఉన్నప్పటికీ నయన బయానా పద్ధతులతో టిడిపి అభ్యర్థి ముల్లంగి నాగమణి గెలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి అని పరిశీలకులు భావిస్తున్నారు. ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు ఏదో చేయబోతున్నారని టాక్ వినిపిస్తోంది. వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టి గోవింద్ రెడ్డి పైనే ఇటీవల బి ఫారాలు ఇచ్చేందుకు బొమ్మనహాల్ వెళ్ళినప్పుడు టిడిపి వర్గీయులు దాడి చేయడంతో అక్కడ భయానక పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ఎన్నికలు ఏకపక్షంగా జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎంపీపీ స్థానానికి జరిగే ఉప ఎన్నికల్లో వైసీపీ తరఫున బొమ్మనహాల్ ఎంపీటీసీ సభ్యురాలు కల్పన, టిడిపి తరఫున ఉప్పరపు ఎంపీటీసీ సభ్యురాలు ముల్లంగి నాగమణి బరిలో దిగుతున్నారు.. మొన్నటి వరకు వైసీపీ తరఫున ఎంపీపీగా ఉన్న పద్మ తన పదవికి రాజీనామా చేయడంతో ఉప ఎన్నికలు ఏర్పడ్డాయి. ఎంపీపీ పదవికి ఏడాది కూడా గడువు లేకపోయినప్పటికీ స్థానిక తెలుగుదేశం నేతలు ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఎన్నికల్లో గెలవాలని వ్యూహాలు రచిస్తున్నారు.

బొమ్మనహాల్ మండలంలో 16 ఎంపీటీసీ స్థానాలు ఉండగా 15 మంది వైసీపీ వారు, ఒక ఇండిపెండెంటు మొదట్లో గెలిచారు. శాసన సభ ఎన్నికలకు ముందు 5 మంది ఎంపీటీసీలు టీడీపీలో చేరిపోయారు. ఇప్పుడు వైసీపీలో 11 మంది, టిడిపిలో 5 మంది ఎంపీటీసీలు ఉన్నారు. ప్రస్తుతం ఎంపీపీ స్థానికి జరిగే ఎన్నికల్లో టీడీపీ బెదిరింపులకు పాల్పడే అవకాశం ఉందని గత కొద్ది వారాలుగా స్థానిక వైసీపీ నాయకులు తన అభ్యర్థులతో క్యాంపు రాజకీయాలకు దిగింది. వైసీపీ ఎంపీటీసీలు క్యాంపు నుంచి సోమవారం నేరుగా ఎన్నికలు జరిగే ప్రాంతానికి రానున్నారు. వైసిపి ఎంపీటీసీలు ఓట్లు వేసే సమయంలో ఎలా అనుసరిస్తారు? అన్నది ఆసక్తికరంగా మారింది. ఇదిలా ఉండగా మాజీ ఎమ్మెల్యే, వైసీపీ సమన్వయకర్త మెట్టు గోవింద్ రెడ్డి ఎన్నికల్లో భాగంగా బొమ్మనహాలకు వెళ్ళినప్పుడు టిడిపి వర్గీయులు దాడి చేసిన విషయంపై ఆదివారం వైసీపీ జిల్లా నేతలు అనంత వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్, వై.విశ్వేశ్వర్ రెడ్డి, మెట్టు గోవిందరెడ్డి తదితరులు ప్రత్యేకంగా పోలీస్ ఉన్నతాధికారులను కలిసి పరిస్థితి వివరించారు.

బొమ్మనహాల్ ఎంపీపీ స్థానానికి జరిగే ఉప ఎన్నికలను ప్రశాంతంగా జరిగేందుకు తగిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.. ఈ సందర్భంగా వైసీపీ జిల్లా నాయకులు మాట్లాడుతూ ఎంపీపీ ఎన్నిక నేపథ్యంలో ఎంపీటీసీలను కూడా బెదిరిస్తున్నారు అని, ఇప్పటికే ఉమ్మడి అనంతపురం జిల్లాలోని రామగిరి, కదిరి నియోజకవర్గంలో ఎంపీపీ ఎన్నికలలోనూ, కళ్యాణదుర్గం మునిసిపాలిటీల్లో కూడా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు అని విమర్శించారు. కేవలం నాలుగైదు నెలల కాలపరిమితి ఉన్న స్థానాలపై అధికార పార్టీ ఎందుకింత దిగజారుతోంది? అని వారు ప్రశ్నించారు.

## క్రిస్మస్‌కు ముందునుంచే దాడికి ప్రణాళిక

### రెక్కీలు, డ్రోన్లతో విన్యాసాలు స్పష్టత వచ్చాకే ఆపరేషన్

**వాషింగ్టన్, జనవరి 4:** దక్షిణ అమెరికా దేశమైన వెనిజులాపై అమెరికా మెరుపు దాడి ప్రపంచాన్ని నివ్వెరపరిచింది. హఠాత్తుగా సైన్యంతో చొర బడిన అమెరికా ఆ దేశ అధ్యక్షుడు మదురోను ఆయన భార్యతో సహా బంధీగా తీసుకొచ్చింది. డ్రగ్స్ ముఠాకు అడ్డుకట్ట వేయాలని డొనాల్డ్ ట్రంప్ పదేపదే హెచ్చరించినా బేఖాతరు చేయడంతోనే ఆపరేషన్ అబ్సల్యూట్ రిసాల్వ్‌ను అమెరికా సిద్ధపడింది. వెనుజువెలాపై నిరుడు క్రిస్మస్‌కు ముందే పక్కా ప్రణాళికతో దాడి చేయాలని యూఎస్‌ఏ భావించిందట. కానీ, అనుకోకుండా వాయిదా వేసుకోవాల్సి వచ్చిందని జాయింట్ చీఫ్స్ చైర్మన్ జెనరల్ డాన్ కైన్ తెలిపారు. యావత్ ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేస్తూ వెరిజులాపై అకస్మిక దాడి చేసింది అమెరికా. ఇదంతా రెండు మూడు రోజుల్లో ప్రణాళిక వేసుకొని చేసింది మాత్రం కాదనేది వాస్తవం. ఆ దేశంపై దాడికి కొన్ని నెలల ముందే అమెరికా సైన్యం రిహార్సల్స్ చేసింది. 150కి పైగా యుద్ధ విమానాలు, డ్రోన్స్ ఉపయోగించి ఆపరేషన్ అబ్జల్యూట్ రిసాల్వ్‌ను విజయ వంతంగా యూఎస్ సైన్యం పూర్తి చేసింది. గత ఏడాది క్రిస్మస్‌కు ముందే వెనిజులాపై విధ్వంసానికి అమెరికా యత్నించిందని జాయింట్ చీఫ్స్ చైర్మన్ జెనరల్ డాన్ కైన్ తెలిపారు. క్రిస్మస్ ముందే దాడి చేయాలనుకున్నాం. సైన్యం కూడా సన్నద్ధంగా ఉంది. కానీ, వాతావరణం అనుకూలించక పోవడం, మేఘాలు తక్కువ ఎత్తులో ఉండడమే కాకుండా పర్వతాలు, సముద్రాలు కూడా అవరోధంగా మాడంతో కారణంగా దాడిని వాయిదా వేసుకున్నాం. ప్రపంచంలోని సుశిక్షితు లైన వైమానిక దళం మాత్రమే ఈ సాహసం చేయలగలదు అని డాన్ కైన్ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి 10:46 గంటలకు ట్రంప్ గుడ్ లక్ వేగంగా ముగించేయండి అని తన సైన్యానికి



చెప్పారు. అధినేత ఆదేశాలు రావడమే ఆలస్యం పశ్చిమ ప్రాంతంలోని 20 స్థావరాల నుంచి వెనిజులారాజధాని కరాకస్‌పై దండెత్తింది సైన్యం. శనివారం ఉదయం 2:01 గంటలకు అధ్యక్షుడు ముదురో నివాసానికి అమెరికా ఆర్మీ చేరుకుంది. 30 నిమిషాల వ్యవధిలోనే ఆ దేశ ప్రధాన సైనిక కేంద్రాలు, వాయు, నౌకా కేంద్రాలను పేల్చేసిన యూఎస్ సైన్యం అనంతరం మదురో,ఆయన భార్య ఫ్లోరెన్‌ను బందీగా పట్టుకొని అమెరికాకు తరలించింది. వెనిజులాలో భారీగా ఉన్న చమురు నిల్వలపై ట్రంప్ కన్ను పడిందని అందుకే ఆ దేశాన్ని హస్తగతం చేసుకునేందుకు ఆయన ఈ దాడికి తెగించారని అమెరికా విపక్షనేతలు పెద్ద ఎత్తున విమర్శలుచేస్తున్నారు.

## నాడు ఒసామా బిన్‌లాడెన్ హత్య

### నేడు మదురో దంపతుల కిడ్నాప్ ఘటనలను లైవ్‌లో వీక్షించిన అమెరికా అధ్యక్షుడు!

**హైదరాబాద్, జనవరి 4, ప్రభాతవార్త:** వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మధురోతో పాటు ఆయన భార్యను అ మెరికా సైనిక కమెండోలు బందీగా చే సుకుని అమెరికాకు తరలించిన ఘటన ప్రపంచ వ్యాప్తంగా సంచలనం రేపడం తెలిసిందే. శనివారం తెల్లవారుజామున వెనిజులా రాజధాని కారకాస్ లో జరిగిన ఈ ఘటనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైట్‌హౌస్‌లో టీవీలో లైవ్‌లో చూడడం మరో విశేషం. ఒక దేశాధినేతను ఆయన సతీ మణిని మరో దేశాధ్యక్షుడు సైనిక బలగాలచేత దాడి చేయించి బందీగా పట్టుకోవడం ఇటీవల కాలంలో ఇదే తొలిసారి. ఈ ఘటనను దాడులకు కార ణమైన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రత్యక్ష ప్రసారంలో వీక్షించారు. ఈ విషయాన్ని ట్రంప్ స్వయంగా వెల్లడించారు. గతంలో అల్‌ఖైదా ఉగ్రవాద స ంస్థ అధినేత ఒ సామా బిన్ లాడెన్‌ను అమెరికా సైనిక కమెండోలు పాక్‌లోని అటోబాబాద్‌లో రహస్య స్థావరంలో వుండగా 2011 మే 2 తేదీన మె రుపు దాడులు చేసి హత మార్చడం తెలిసిందే. అమెరికాపై 2001లో ట్విన్ టవర్స్‌పై దాడులతో పాటు అనేక మంది అమాయకులను ఊచకోత కో సినందుకు లాడెన్‌పై పగబట్టిన అగ్రరాజ్యం ఈ క్రమంలో ఆఫ్ఘనిస్తాన్‌లోని అల్‌ఖైదా స్థావరాలను ధ్వంసం చేయడంతో పాటు తాలిబన్ సర్కారును కూల్చి వేయడం విదితమే. దీని తరువాత ఆఫ్ఘనిస్తాన్‌లో నాటో దళాలు చాలాకాలంపాటు రాజ్యమేలినా లాడెన్ పట్టుబడలేదు. లాడెన్ కోసం గా లించగా అతను పాక్‌లోని అటోబాబాద్‌లో సైనిన కంటోన్మెంట్‌కు సమీపంలో రహస్య స్థావరంలో భార్యలు, పిల్లలతో కలిసి వుంటున్నట్లు పసిగట్టిన అమె రికా 2011 మే రెండవ తేదీన అర్ధరాత్రి వేళ హెలికాప్టర్లలో వచ్చిన కమెం డోలు మెరుపు దాడులుచేసి లాడెన్ సహా ఆయన భార్యలు, ఇద్దరు పిల్లలు, మరికొందరు సహాయకులను హతమార్చారు. కాగా ఈ ఘటనను నాటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా ప్రత్యక్ష ప్రసారంలో వీక్షించారు.

## 82 యేళ్ల వృద్ధురాలిపై యువకుడు అత్యాచారం



**రేవా(ఎంపి), జనవరి 4:** మధ్యప్రదేశ్‌లోని రేవాజిల్లాలో అత్యంత దారుణ సంఘటన వెలుగులోకి వచ్చింది. 82 ఏళ్ల గిరిజన వృద్ధురాలిపై పక్కింట్లో నివసించే యువకుడు అత్యా చారం చేసినట్లు బాధితురాలు ఆరోపిం చింది. ఘటన జరిగిన రోజు ఆమె ఇంట్లో ఒంటరిగా ఉండగా పక్కింటో ఉండే సుగ్గా సాకేత్ అనే యువకుడు ఇంట్లోకి చొరబడి ఆమె గొంతు నులిమాడు. తర్వాత ఆమె స్పృహ కోల్పోయిన సమ యంలో అత్యాచారానికి పాల్పడి అక్కడి నుంచి పరారయినట్లు వృద్ధురాలు తెలిపింది. జరిగిన ఘోరాన్ని వృద్ధురాలు కుటుంబసభ్యులకు తెలియజేయడంతో ఆమెను వెంట బెట్టుకుని సిర్‌మౌర్ పోలీస్‌స్టేషన్‌కువెళ్లి ఫిర్యాదుచేసారు. అయితే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదుచేయలేదని, వైద్యపరీక్షలు కూడా చేయలేదని బాధితురాలు ఆరోపించింది. పోలీసుల నిర్లక్ష్యంతో న్యాయం జరగలేదని భావించిన కుటుంబం మహిలా పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి మళ్లీ ఫిర్యాదు చేసారు. ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడం తో బాధితురాలి ఫిర్యాదుతో ఎఫ్ఐఆర్ నమోదు చేసారు. మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జి మాట్లాడుతూ ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఫలితాలను బట్టి చర్యలు చేపడతామని తెలిపారు.

# డ్వాక్రా సంఘాల బకాయిలపై సర్కార్ ఉక్కుపాదం

- అప్ప కట్టకపోతే ఆస్తులు జప్తు, రెవెన్యూ రికవరీ చట్టం అమలు
- సభ్యురాలు కట్టకపోతే గ్రూప్‌లోని అందరిపైనా భారం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 4:** డ్వాక్రా సంఘాల బకాయిల విషయంలో మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం కీలక హెచ్చరిక జారీ చేసింది. ముఖ్యంగా స్త్రీనిధి ద్వారా రుణాలు పొంది, నెలవారీ వాయిదాలు చెల్లించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న వారిపై కఠిన చర్యలకు సిద్ధమైంది. పేరుకుపోయిన మొండి బకాయిల వసూలు కోసం ప్రభుత్వం తనకున్న ప్రత్యేక అధికారాలను ఉపయోగించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా రెవెన్యూ రికవరీ చట్టాన్ని అమలు చేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేయడంతో ఈ అంశం ప్రాధాన్యత సంతరించుకుంది.

ప్రభుత్వానికి రావాల్సిన బకాయిలను వసూలు చేసేందుకు రెవెన్యూ రికవరీ చట్టాన్ని ఒక శక్తివంతమైన సాధనంగా ఉపయోగిస్తారు. దీని ప్రకారం రుణం చెల్లించని వారి ఆస్తులను జప్తు చేసే అధికారం అధికారులకు లభిస్తుంది. ఇళ్లు, భూములు వంటి స్థిరాస్తులతో పాటు ఇతర విలువైన వస్తువులను స్వాధీనం చేసుకుని, వాటిని బహిరంగంగా వేలం వేస్తారు. ఆ వేలం ద్వారా వచ్చిన మొత్తాన్ని ప్రభుత్వం తన బకాయి కింద జమ చేసుకుంటుంది. ఈ చట్టం అమలుతో బకాయిదారులపై ఒత్తిడి పెంచి, వసూళ్లను వేగవంతం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం జగిత్యాల జిల్లాలో ఈ సమస్య తీవ్రంగా ఉన్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా సుమారు 60 వేల మందికి పైగా డ్వాక్రా సభ్యులు ఉండగా, వారికి ప్రభుత్వం ఇప్పటివరకు రూ.475 కోట్ల రుణాలు అందించింది.

చాలామంది మహిళలు తమ వ్యాపారాల కోసం రూ.30 వేల నుంచి రూ.3 లక్షల వరకు రుణాలు తీసుకున్నారు. అయితే, జిల్లాలో వసూలు కావాల్సిన రూ. 101 కోట్లకు గాను కేవలం రూ.78 కోట్లు మాత్రమే వసూలయ్యాయి. దాదాపు రూ.23 కోట్లు మొండి బకాయిలుగా పేరుకుపోవడంతో ప్రభుత్వం ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. ఈ చట్టంలో అత్యంత కీలకమైన అంశం ఒకటుంది. రుణం తీసుకున్న సభ్యురాలి పేరు మీద ఎలాంటి ఆస్తులు లేకపోతే, ఆ అప్పును తీర్చే బాధ్యత గ్రూప్‌లోని మిగిలిన సభ్యులపై పడుతుంది. అంటే, ఒకరు చేసిన పొరపాటుకు సంఘంలోని అందరూ బాధ్యత వహించాల్సి వస్తుంది. అవసరమైతే ఇతర సభ్యుల ఆస్తులను కూడా జప్తు చేసేందుకు ఈ చట్టం వీలు కల్పిస్తుంది. ఈ నేపథ్యంలో, సంఘంలోని మహిళలు పరస్పర సహకారంతో సకాలంలో రుణాలు చెల్లించేలా చూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ఇప్పటికే సెర్ప్, మెప్మా అధికారులు గ్రామాల్లో పర్యటించి బకాయిల చెల్లింపుపై అవగాహన కల్పిస్తున్నారు. అయినప్పటికీ స్పందన ఆశించిన స్థాయిలో లేకపోవడంతో, ప్రభుత్వ ఆదేశాల మేరకు కఠినంగా వ్యవహరించనున్నట్లు డీఆర్డీఏ అధికారులు స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ల నుంచి కూడా అనుమతులు రావడంతో, త్వరలోనే జప్తు ప్రక్రియ ప్రారంభం కానుందని తెలుస్తోంది.

# 8న గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ విస్తృత సమావేశం

## 4 రోజుల్లో డిసిసి కార్యవర్గం, మండల అధ్యక్షుల నియామకాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 4:** తెలంగాణ కాంగ్రెస్‌లో పార్టీ పదవుల విషయంలో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ తీపికబురు చెప్పారు. 4 రోజుల్లో డీసీసి కార్యవర్గ కూర్పుపై నివేదిక ఇవ్వాలని టీపీసీచీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆదేశించారు. ఈ నెల 15వ తేదీలోపు మండల కాంగ్రెస్ అధ్యక్షుల నియా మకాలు అవ్వాలన్నారు. ఆదివారం డీసిసి అధ్యక్షులు, టీపీసీసీ ఉపాధ్యక్షులతో జూమ్ మీటింగ్ జరిగింది. ఈ సమావేశంలో ఏఐసీసీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీసీ కార్యవర్గం కూర్పువిషయంలో మహేశ్ కుమార్ గౌడ్ కీలక ఆదేశాలు ఇచ్చారు. అలాగే ఈ నెల 8వ తేదీన గాంధీ భవన్ లో టీపీసీసీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించబోతున్నట్లు చెప్పారు. ఉపాధి హామీ పథకంలో గాంధీ. పేరు తొలగించడంపై దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) కార్యవర్గం కోసం అధికార పార్టీలో కసరత్తు మొదలైంది. ఇటీవల పార్టీ జిల్లా అధ్యక్షులను అధిష్టానం ప్రకటించినా కార్యవర్గం ఏర్పాటు చేయలేదు. ఈ నేపథ్యంలో డీసీసీ కార్యవర్గం కూర్పులో తమకు అవకాశాలు దక్కుతాయని ఆశిస్తున్న వారు పార్టీ నిర్ణయంపై ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. అయితే కాంగ్రెస్ జిల్లా కార్యవర్గం ఏర్పాటు విషయంలో గతంలోనే టీపీసీసీ మార్గదర్శకాలు సైతం జారీ చేసింది. వీటికి అనుగుణంగా మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు పార్టీ నేతలు జిల్లాల్లో పర్యటించి ఆశావహుల నుంచి దరఖాస్తులు సైతం స్వీకరించారు. దీంతో ఈనెలలో ఎప్పుడైనా జాబితా వెలువడవచ్చని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ క్రమంలో మరో నాలుగు రోజుల్లో డీసీసీ కార్యవర్గం కూర్చుపై నివేదిక ఇవ్వాలని మహేష్ కుమార్‌గౌడ్ ఆదేశించడంతో పార్టీ పదవులు ఎవరికి దక్కబోతున్నాయనేది ఆసక్తిగా మారింది.



బిసి సదస్సులో మాట్లాడుతున్న మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్, చిత్రంలో బిసి విద్యార్థి జెఏసి చైర్మన్ వేముల రామకృష్ణ తదితరులు

# బిసిలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి

## మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్, జనవరి 4, ప్రభాతవార్త:** కేంద్రంలో బిసిలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలో బిసి విద్యార్థి జెఏసి చైర్మన్ వేముల రామకృష్ణ అధ్యక్షతన వివక్షతకు గురవుతున్న బిసి వర్గాల సమస్యలపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 70 కోట్ల జనాభా కలిగిన బిసిలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వశాఖ లేకపోవడం అన్యాయమన్నారు. బిసిలకు తగిన బడ్జెట్ కేటాయించాలి. క్రిమినేయర్‌పై అనేకమైన ఆంక్షలు పెట్టారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం బిసి రిజర్వేషన్‌పై అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. కులగణన లెక్కలు బయటపెట్టాలని, 42శాతం రిజర్వేషన్లతో ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ, బిసి విద్యార్థి జెఏసి చైర్మన్ వేముల రామకృష్ణ, జెఏసి వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, బిసి నాయకులు నందగోపాల్, ఉదయ్, కృష్ణ, వేణు, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## నిజాంపేటలో విషాదం..

# స్విమ్మింగ్‌పూల్‌లో పడి మూడేళ్ల బాలుడి మృతి

**హైదరాబాద్ (కెపిహెచ్‌బి కాలనీ), జనవరి 4, ప్రభాతవార్త:** ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు స్విమ్మింగ్ పూల్‌లో పడి మూడేళ్ల బాలుడు మృతి చెందిన సంఘటన కెపిహెచ్‌బి కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని నిజాంపేట్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చంద్రనగర్‌లోని సంతోష్ నిలయంలో నివాసం ఉంటున్న ఎం శరత్ కుమార్ కుమారుడు మచ్చ భక్తుని అర్జున్ కుమార్ (3) కుటుంబ సభ్యులతో కలిసి నిజాంపేట్ లోని వర్టెక్స్ ప్రైమ్ అపార్ట్మెంట్స్‌లో ఉన్న బంధువుల ఇంటికి వచ్చారు. కాగా ఆదివారం ఉదయం బాలుడు మచ్చ భక్తుని అర్జున్ కుమార్ మెట్ల ద్వారా నడుచుకుంటూ వచ్చి గ్రౌండ్ ఫ్లోర్‌లో ఆడుకుంటున్నాడు. దీంతో కంగారు పడిన కుటుంబ సభ్యులు బాలుడు కోసం వెతకగా అప్పటికే ప్రమాదవశాత్తు స్విమ్మింగ్ పూల్‌లో పడిపోయిన బాలుడు నీళ్లలో విగత జీవిగా మిగిలాడు. స్విమ్మింగ్ పూల్ నుండి బయటికి తీసిన బాలుడికి సిఆర్పి చేసి ఆసుపత్రికి తరలించిన ఫలితం లేకుండా పోయింది. ఈ మెరకు కేపిహెచ్‌బి కాలనీ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



అర్జున్‌కుమార్ (ఫైల్)

# మళ్లీ తెలంగాణ సెంటిమెంట్ రెచ్చగొడుతున్న బిఆర్‌ఎస్ నేతలు

## పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఆంధ్రోళ్ల దోపిడీ గుర్తుకు రాలేదా?

## మాజీమంత్రి హరీశ్‌రావుపై జగ్గారెడ్డి ఫైర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 4:** ఆంధ్రప్రదేశ్ నీళ్ల దోపిడి చేస్తుందంటూ మళ్లీ తెలంగాణ సెంటిమెంట్‌ను రెచ్చగొడుతున్నారని బీఆర్ఎస్ పార్టీ అగ్రనేతలపై పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి మండిపడ్డారు. ఆదివారం గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో తూర్పు జగ్గారెడ్డి మాట్లాడుతూ నీళ్ల వ్యవహారంలో బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్న తీరును ఎండగట్టారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించిన తర్వాతే తెలంగాణకు నీళ్ల వచ్చినట్లు మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడారంటూ వ్యంగ్యంగా అన్నారు. కాళేశ్వరం వల్లే తెలంగాణ ప్రజలు నీళ్ల తాగుతున్నారని ప్రచారం చేశారని బీఆర్ఎస్ అగ్రనేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



మీ పాలనలో అసలు ఎన్ని ప్రాజెక్టులు నిర్మించారంటూ బీఆర్ఎస్ నేతలను ఈ సందర్భంగా ఆయన సూటిగా ప్రశ్నించారు. కృష్ణా జలాలపై సీఎం రేవంత్, భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వాస్తవాలు మాట్లాడారని పేర్కొన్నారు. మాజీ ప్రధాని నెహ్రూ హయాంలో నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులు నిర్మాణం జరిగిందని జగ్గారెడ్డి గుర్తు చేశారు. ఇక సింగూరు, మంజీరా డ్యాంలు సైతం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే నిర్మించారని వివరించారు. హైదరాబాద్ మహానగర ప్రజలకు సింగూరు, మంజీరా డ్యామ్‌ల ద్వారా తాగునీరు అందుతుందని జగ్గారెడ్డి తెలిపారు. సింగూరు, మంజీరా డ్యామ్ నీళ్ల తాగలేదని చెప్పగలరా? అంటూ బీఆర్ఎస్ నేతలను ఆయన నిలదీశారు. 2014లో కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా ప్రాజెక్టులు పూర్తి చేయాలని.. నాటి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సంపత్ కోరితే వారిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేశారని గుర్తు చేశారు. కృష్ణానదిపై పెండింగ్ ప్రాజెక్టులు నిర్మించాలని ఈ పదేళ్లలో మీకు గుర్తు రాలేదా? అంటూ హరీశ్ రావును జగ్గారెడ్డి ప్రశ్నించారు. జగన్.. కేసీఆర్ ఎందుకు కూర్చున్నారు? జగన్‌తో కెసిఆర్, కేటీఆర్ ప్రగతి భవన్ లో మీటింగ్ పెట్టలేదా..? మీరు మాట్లాడితే తప్పు లేదు. రేవంత్ మాట్లాడితే తప్పా అని ప్రశ్నించారు. కేసీఆర్.. టీడీపీలో డిప్యూటీ స్పీకర్ కూడా అయ్యాడు. ఆంధ్రోళ్ల దోపిడీ గురించి అప్పుడూ ఎందుకు మాట్లాడలేదు అని ప్రశ్నించారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ సందర్భంగా హరీష్ చెప్పినవి అన్ని దొంగ లెక్కలు..దొంగ మాటలు నీకు..నీ మామ కి చంద్రబాబు పదవి ఇవ్వక పోయే సరికి తెలంగాణ గుర్తుకు వచ్చింది అని పేర్కొన్నారు. చిన్న రాష్ట్రాలతో ఉపయోగం లేదని అసెంబ్లీ లో కేసీఆర్ చెప్పలేదా..?కేసీఆర్ సభలో మాట్లాడిన వీడియో ను బయట పెట్టాలి అని పేర్కొన్నారు. మీ మామ తోలు తీస్తా అనకపోతే రేవంత్ రెడ్డి తిట్టే వాడా..? మీరెందుకు తిడుతున్నారు చెప్పండి నువ్వు తోలు తీస్తా అంటే.. నేను నాలుక కోస్తా అన్నాడు అనుకపోతే ఎట్లా..? అని ప్రశ్నించారు. తిడితే తిట్టరా..? రేవంత్ కాబట్టి నాలుక కోస్తా అన్నాడునేను ఉంటే... ఇంకా ఏదో అనే వాణ్ణి అని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిల ఇరిగేషన్ ప్రజెంటేషన్ కరెక్ట్, హరీశ్‌రావు ప్రజెంటేషన్ బోగస్, మీరు అధికారంలో ఉంటే ఆంధ్రోళ్ల నీళ్ల దోపిడి గుర్తుకు రాదు, మీరు ప్రతిపక్షంలో ఉంటే ఆంధ్రోళ్ల దోపిడి గుర్తుకు వస్తదని వ్యాఖ్యానించారు.

# 'సర్' పేరిట ఓట్ల తొలగింపుతో ప్రజాస్వామ్యం అపహాస్యం

## ఎపి హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ టి.రజని

**హైదరాబాద్ (చిక్కడపల్లి) జనవరి 4, ప్రభాతవార్త:** 'రక్తపాతం లేని రాజకీయ నరమేధం'.. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 'సర్' అని పలువురు వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో 'సర్ సిటిజన్ ఓటింగ్ రైట్స్' అనే అంశంపై హైకోర్టు రాజ్యాంగ పరిరక్షణ వేదిక నాయ కులు కామేశ్‌బాబు అధ్యక్షతన సెమినార్ జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఎపి హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ టి.రజని మాట్లా డుతూ సర్ పేరుతో ఓట్లను తొలిగిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగంలోని పీపుల్స్ రిప్రజంటేషన్ యాక్ట్ 354, 357 ప్రకారం ఓటును తొలగించే క్రమంలో అతనికి నోటీస్ ఇచ్చి వివరణ తీసుకోవాలని అన్నారు. కాని నేడు ప్రజల ప్రాథమిక హక్కులను కాలరాస్తూ ఓట్లను విచ్చల విడిగా తొలగిస్తున్నారని వ్యాఖ్యానించారు. దేశ పౌరుడిగా గుర్తింపునిచ్చే ఓటు ప్రమా దంలో పడిందని హెచ్చరించారు. ప్రముఖ రాజకీయ విశ్లేషకులు పరకాల ప్రభాకర్ మాట్లాడుతూ గతంలో యూరప్ లాంటి కొన్ని దేశాల్లో కొన్ని వర్గాలను దేశం నుంచి తరిమేయడమో లేదా చంపేయడమో చేశారని అన్నారు. కాని నేడు భారతదేశంలో అలాంటి చర్యలు కుదరని నేపథ్యంలో పొలిటికల్ సొసైటీ సభ్యులుగా ఉండకూడదని వారి పౌరసత్వాన్ని చంపేందుకు సర్ పేరుతో ఓట్లను తొలగిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సంఘం గతంలో షిఫ్టెడ్, ఆబ్సెంట్, డెడ్, డూప్లికేట్ (ఎస్ఏడీడీ) పేరుతో ఓట్లను తొలిగించే ప్రక్రియ స్థానంలో తెచ్చిన సర్ ద్వారా ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకున్నారని వ్యాఖ్యానించారు. బీహార్లో జరిగిన సర్‌తో వారి కుట్ర తేటతెల్లమైందని పేర్కొ న్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో 2.93 కోట్లు, తమిళనాడులో 93 లక్షలు, గుజరాత్‌లో 72 లక్షలు, పశ్చిమ బెంగాల్‌లో 58 లక్షలు, రాజస్తాన్లో 43లక్షలు, మధ్య ప్రదేశ్‌లో 30లక్షలు చత్తీస్గఢ్ 28 లక్షలు, కేరళలో 21 లక్షల ఓట్లను తొలగించేందుకు యత్నిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఓట్ల తొలగింపు ఎన్నికల ప్రక్రియ, రాజకీయ పార్టీలను గెలిపించే అంశం మాత్రమే కాదనీ, భారతీయ రాజకీయ స్వరూపమే మారిపోనుందని హెచ్చరించారు. మనదాకా వస్తే గాని దాని ప్రభావం అర్థం కాదని అభిప్రాయపడ్డారు. ప్రముఖ రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు డీజీ. నర్సింహారావు, ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పార్థసారధి వివిధ ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఎపి హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ టి.రజని

# సూర్యాపేట జిల్లా అభివృద్ధికి మంత్రి ఉత్తమ్ చేసింది శూన్యం

## పేదలకు ఇళ్లు ఇచ్చేదెప్పుడు?

## తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**హుజూర్‌నగర్‌టౌన్, జనవరి 4, ప్రభాతవార్త :** తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జనం బాట కార్యక్రమం ప్రజా సమస్యల పరిష్కార



ఆదివారం హుజూర్‌నగర్‌లో మీడియాతో మాట్లాడుతున్న తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

పోరుబాటని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్‌లో పాదయాత్ర నిర్వహించి రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహంతో పాటు, అమరుల స్తూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏరియా ఆసుపత్రిని సందర్శించి రోగులను, బాలింతలను పరా మర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గొప్పలు చెప్పుకునే మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సూర్యాపేట జిల్లాతోపాటు కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాల అభివృద్ధికి చేసింది శూన్యమన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో నియోజకర్గంలో పులిచింతల ప్రాజెక్టు నిర్మాణం వల్ల అనేక గ్రామాలు, భూములు సున్నపు రాయి నిల్వలు మునిగిపోయాయని నీళ్ల ఆంధ్ర ప్రాంతానికి తరలి వెళ్తే తెలంగాణ ప్రాంతం మునకకు గురైందని విమర్శించారు. నాడు గృహ నిర్మాణ శాఖ మంత్రిగా, నేడు నీటిపారుదల పౌరసరఫరాల మంత్రిగా ఈ ప్రాంతంలో ఉత్తంకుమార్‌రెడ్డి నిలువ నీడలేని పేదలకు పక్కా ఇళ్లు ఇవ్వలేకపోయారని విమ ర్శించారు. నియోజకవర్గ కేంద్రంలో ఏరియా ఆసుపత్రిలో సరైన డాక్టర్లు సిబ్బంది లేరని, ఇందులో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు ఇవ్వడం లేదని ఆమె అన్నారు. జిల్లాలో 54 లిఫ్టులలో 24 పనిచేయడం లేదని, పాత లిఫ్టులు మరమ్మతు చేయకుండా కొత్త లిఫ్టుల నిర్మాణం వెనుక కమిషన్ల కక్కుర్తి లేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో నిరుద్యోగ భృతి, పింఛన్ల పెంపు, నిరుద్యోగ యువతకు 2 లక్షల ఉద్యోగాల హామీ ఎటు పోయిందని అన్నారు. మట్టపల్లి వద్ద కృష్ణా నది జలాలు కాలుష్యం బారిన పడి పట్టణానికి మంచినీరు రాకుండా వున్నా మంత్రి ఉత్తమ్ ఎందుకు పట్టించు కోవడం లేద న్నారు. హుజూర్నగర్ ప్రాంతం తెలంగాణ సాయుధ పోరాటా నికి కేంద్రమని ఈ ప్రాంతం నుంచే తెలంగాణ జాగృతి పోరాటం ప్రారంభించి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు సాధించేలా అన్ని ప్రాంతాల్లో కొత్త కమిటీలను వేసి ఉద్యమిస్తామన్నారు. ఈ సమా వేశంలో జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి, కేవిఎల్‌ఎన్ రావు, ఎస్కే మస్తాన్, గోవర్ధన్, దుండి గల నారాయణ, సత్య నారా యణరెడ్డి, రహిమ కిషోర్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# రెండోరోజు టెట్‌కు 81.5 శాతం హాజరు

## ముగిసిన మ్యాథ్స్, సైన్స్ పరీక్షలు

## నేటి నుంచి సోషల్ పరీక్షలు ప్రారంభం

## మేడ్చల్ జిల్లాలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన పాఠశాల విద్యడైరెక్టర్ నవీన్ నికోలస్

## నేటి ఉదయం 55 కేంద్రాల్లో, మధ్యాహ్నం 39 కేంద్రాల్లో పరీక్షలు

**హైదరాబాద్, జనవరి 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలో శనివారం నుంచి ప్రారంభమైన ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) జనవరి-2026 పరీక్షలు ప్రశాంతంగా కొనసా గుతున్నాయి. రెండోరోజు పరీక్షలకు 81.5 శాతం మంది అభ్యర్థులు హాజరైనట్టు పాఠశాల విద్య డైరక్టర్, టెట్ ఛైర్మన్ నవీన్ నికోలస్ తెలిపారు. పరీక్షల తీరును ఆయన ఆదివారం మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని ఓల్డ్ ఆల్వాల్‌లోని ఐయాన్ డిజిటల్ జోన్‌లో పరీక్ష కేంద్రంలో పరిశీలించారు. ఆదివారం జరిగిన పరీక్ష ప్రశ్నల సరళి మధ్యస్థంగానే ఉన్నట్టు అభ్యర్థులు చెప్పారు. ఉదయం, మధ్యాహ్నం జరిగిన పరీక్షల్లో తెలుగు సైకాలజీ మెథడాలజీ విభాగాల్లో ప్రశ్నల సరళి కాస్త తేలికగానే ఉన్నాయని అభ్యర్థులు తెలిపారు. ఇంగ్లీష్ మ్యాథ్స్ సైన్స్ ప్రశ్నల్లో కొన్ని సులభంగా ఉన్నప్పటికీ.. కొన్ని కఠినంగా వచ్చినట్టు తెలిపారు. మేడారం జాతరపై, పలువురు కవులపై, ఛందస్సుపై, ఇన్స్పైర్ మనక్ పై, వివిధ పంట రకాల వ్యాధులపై, జాతీయ పాఠ్య ప్రణాళిక పై ప్రశ్నల సరళి ఇచ్చారు. ఆదివారంతో మ్యాథ్స్, సైన్స్ పరీక్షలు ముగిశాయి. నేటి(సోమవారం) నుంచి సోషల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జరిగిమొదటి రోజు టెట్ పరీక్షల ప్రశ్నల సరళి మధ్యస్థంగా ఉన్నట్టు అభ్యర్థులు చెబుతున్నారు. ఆదివారం ఉదయం పేపర్-2 పరీక్ష 85 పరీక్షా కేంద్రాల్లో జరగగా.. 22,546 మందికి గానూ 18,235 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మధ్యాహ్నా సెషన్‌లో పేపర్-2 పరీక్ష 91 కేంద్రాల్లో జరగగా.. 22,912 మందికి గానూ 18,819 మంది హాజరయ్యారు. ఉదయం సెషన్‌కి 80.88 శాతం మంది, మధ్యాహ్నం సెషన్‌కి 82.03 శాతం మంది హాజరైనట్టు పాఠశాల విద్య డైరక్టర్, టైట్ ఛైర్మన్ నవీన్ నికోలస్ ఒక ప్రకటనలో తెలిపారు. నేడు(సోమవారం) ఉదయం 55 కేంద్రాల్లో, మధ్యాహ్నం 39 కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించనున్నారు. రెండవ రోజు 45458 మందికిగాను 37054 మంది హాజరయ్యారు. 8404 మంది ఆబ్సెంట్ అయ్యారు. రెండో రోజు 81.5 శాతం మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు. శనివారం, ఆదివారం కలిపి 80919కిగాను 65270 మంది హాజరయ్యారు. టెట్ పేపర్-2 మ్యాథ్, సైన్స్ విభాగం మైనర్ మీడియం తప్ప మిగతా అభ్యర్థులకు పరీక్షలు ముగిశాయి. సోమ, మంగళవారాల్లో(5, 6) తేదీల్లో సోషల్ విభాగం వారికి పరీక్షలు జరగనున్నాయి.

# వెనిజులాపై అమెరికా సామ్రాజ్యవాద దాడులను తీవ్రంగా ఖండిస్తున్నాం

## డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ

**హైదరాబాద్, జనవరి 4, ప్రభాతవార్త:** వెనెజులాపై అమెరికా యుద్ధోన్మాద దాడులను, అప్రజాస్వామిక చర్యలను, దేశాధ్యక్షుడి అక్రమ అరెస్టులను భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఒక స్వతంత్ర దేశంపై అమెరికా సాగిస్తున్న ఆధిపత్య ధోరణి అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్ విమర్శించారు. వెనిజులా ప్రజల తీర్పును గౌరవించకుండా, అక్కడి ప్రభుత్వాన్ని కూలదోయాలని అమెరికా ప్రయత్నించడం ప్రజాస్వామ్య విలువలకే విఘాతమన్నారు. వెనిజులాలోని సహజ వనరులు.. ముఖ్యంగా చమురు నిల్వలను హస్తగతం చేసుకోవడమే లక్ష ్యంగా అమెరికా ఈ తరహా అక్రమ ఆంక్షలకు, కుట్రలకు పాల్పడుతోందన్నారు. వెనిజులా ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసి, సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ మదురో ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని చూడటం అమానుషమన్నారు. వెనిజులా అంతర్గత విషయాల్లో అమెరికా జోక్యాన్ని వెంటనే నిలిపివేయాలని, తమ దేశ నాయకుడిని ఎన్నుకునే హక్కు కేవలం వెనిజులా ప్రజలకు మాత్రమే ఉందన్నారు. సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్న వెనిజులా యువతకు, ప్రజలకు డివైఎఫ్ఐ సంపూర్ణ సంఘీభావాన్ని తెలియజెస్తుందని కోట రమేష్, అనగంటి వెంకటేష్ స్పష్టం చేశారు.

# వెనిజులాపై డొనాల్డ్ ట్రంప్ జోక్యం అమానుషం

## అమెరికా చర్యలను భారత్ ఖండించాలి

## సిపిఐ అగ్ర నాయకుడు నారాయణ

**హైదరాబాద్, జనవరి 4, ప్రభాతవార్త:** వెనుజులాపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అమానుషంగా జోక్యం చేసుకుంటున్నారని భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) జాతీయ నాయకులు డాక్టర్ కె నారాయణ మండిపడానడరు. వెనిజులాపై అమెరికా చర్యలను భారత్ ఖండించాలని డిమాండ్ చేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పాలనలో వెనిజువెలాలో ప్రజల చేత ఎన్నికైన నాయకుడిని అక్రమంగా అపహరించి నిర్బంధించడం ప్రజా స్వామ్యంపై, జాతీయ సార్వభౌమత్వంపై, అంతర్జాతీయ చట్టాలపై జరిగిన తీవ్ర దాడి అని దీనిని సిపిఐ ఖండిస్తోందన్నారు. ఈ చర్యకు మాదకద్రవ్యాలు గానీ, నేరాలు గానీ కారణం కాదని.. ఇది పూర్తిగా సామ్రాజ్యవాద దోపిడీ చర్య అని నారాయణ విమర్శించారు. వెనిజువెలాలో ఉన్న అపార చమురు వనరులు, ఖనిజ సంపదను కబళించాలనే దురాశే దీనికి మూల కారణమన్నారు. సహజ వనరులు సమృద్ధిగా ఉన్న దేశాలపై కుట్రలు, రాజ కీయ, సైనిక బెదరింపులు జరగడం చరిత్రలో పునరావృతమవుతూనే ఉందన్నారు. వెనిజులా ఒక స్వతంత్ర సార్వభౌమ దేశమని, అక్కడి ప్రజలు తమ నాయకత్వాన్ని నిర్ణయించుకునే పూర్తి హక్కు కలిగి ఉన్నారని, బయటి శక్తులు అపహరించడం, అస్థిరత సృష్టించడం, వారిపై అధికారం రుద్దడం అమానుషం, అక్రమం, అసహ్యకరమన్నారు. స్వతంత్ర విదేశాంగ విధానంతో, అనేక దేశాలతో సహకారం ద్వారా భారత్ ఆర్థిక, వ్యూహాత్మక ప్రయోజనాలు పొందుతోందని, కాబట్టి కార్పొరేట్-సామ్రాజ్యవాద ప్రయోజనాల కోసం ఇతర దేశాల్లో ప్రజాస్వామ్యాన్ని నలిపివేస్తే భారత్ మౌనంగా ఉండకూడదని నారాయణ అన్నారు. .భారత ప్రధాని నరేంద్ర మోడీ తక్షణమే అమెరికా చేసిన అక్రమ చర్యలను బహిరంగంగా ఖండించాలన్నారు. జాతీయ సార్వభౌమత్వం, అంతర్జాతీయ చట్టాలకు కట్టుబాటును ప్రకటించాలని, చమురు-ఖనిజ దోపిడీకి దారి తీసే సామ్రాజ్యవాద జోక్యాలను తిరస్కరించాలని నారాయణ డిమాండ్ చేశారు. ఈ సమయంలో ప్రధాని మోడీ మౌనం వహించడం అంటే.. నైతిక భాగస్వామ్యం వహించినట్టేనని మండిపడానడరు. అసంఘటిత కూటములు లేని విధానం, శాంతి, సార్వభౌమత్వ గౌరవం అనే భారత సంప్రదాయం స్పష్టమైన, ధృఢమైన స్పందనను కోరుతుందన్నారు. సామ్రాజ్యవాదాన్ని ఖండించాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని నారాయణ డిమాండ్ చేశారు.

# లారీ, బైక్ ఢీకొని ఇద్దరు యువకులు దుర్మరణం

**వలిగొండ, జనవరి 4, ప్రభాతవార్త :** లారీ బైక్ ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలోని నరసాపురం ఆవాస గ్రామం బోరబండ గూడ వద్ద వలిగొండ తోరూర్ రోడ్డుపై చోటుచేసుకుంది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాలు మోత్కూరు మండలం ముశిపట్ల గ్రామానికి చెందిన కుక్కల సాయికిరణ్ (19), దాచారం గ్రామానికి చెందిన బోళ్ల దీక్షిత్ (21) ఇద్దరు స్నేహితులు తమ పల్సర్ బైక్ గిళీ07బీతీ9040పై భువనగిరికి వెళ్లి తిరిగి వస్తుండగా ఇనుపరాడ్ల లోడ్‌తో వస్తున్న లారీ ఢీకొనడంతో లారీ వెనుక టైర్ల కింద ఇద్దరు యువకులు పడి మృతి చెందారు. సమాచారం తెలిసిన ఎస్సై యుగంధర్ గౌడ్ తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని కృతదేహాలను రామన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించి మృతుని తండ్రి కుక్కల యాదగిరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# అమానవీయంగా మేకలు, గొర్రెల నుంచి రక్తం తీస్తూ అమ్మకాలు

## కీసరలో దారుణం.. నకిలీ వెటర్నరీ డాక్టర్‌తోపాటు మటన్‌షాపు యజమాని అరెస్టు

**హైదరాబాద్, (కీసర) జనవరి 4, ప్రభాతవార్త:** డబ్బుల సంపాదన కోసం కొందరు ఎంతటి దుర్మార్గలకైనా ఒడిగడుతున్న రోజులివి. మంచి మానవ త్వం మరచిపోయిన కొందరు ఏకంగా మటన్ షాపుకు వధించే నిమిత్తం తీసుకువచ్చిన మేకలు, గొర్రెలకు ఎలాంటి మత్తు ఇవ్వకుండానే, అవి బతికి వుండగానే మనుషుల నుంచి రక్తం తీసినట్లు నేరుగా సిరంజిలు గుచ్చి రక్తాన్ని తీస్తూ వాటిని నగరంలోని కాచిగూడలో గల ఓ ప్రైవేటు సంస్థకు విక్ర యిస్తున్నారు. ఈ కిరాతక చర్యలకు ఆ మూగ జీవాలు బతికి వుండగానే జీవచ్ఛవాలుగా మారుతూ రక్తహీనత కారణంగా గంటా రెండు గంటల్లోపే చనిపోతున్నాయి. ఇలాంటి అమానవీయమైన దారుణ ఘటన నగర శివార్లలోని మేడ్చల్ జిల్లా కీసరలో వెలుగు చూసింది. దీనిపై వెంటనే స్పందిం చిన పోలీసులు ఈ దారుణానికి కారణమైన ఇద్దరిని అరెస్టు చేయడంతో పాటు మూగజీవాల నుంచి సేకరించిన రక్తం ప్యాకెట్లను పెద్ద సంఖ్యలో జ ప్తు చేశారు. వివరాలు ఇలావున్నాయి. కీసర పరిధిలోని సత్యనారాయణ కాలనీలో ఓ మటన్ షాపు వుంది. ఈ మటన్ షాపు యజమాని సుందర్ సోను కొంతకాలం క్రితం కాచిగూడలోని సిఎస్‌కె ఇంపోర్ట్ అండ్ ఎక్స్‌పోర్టు అనే ఓ ప్రైవేటు సంస్థతో ఒప్పందం కుదుర్చుకుని తన వద్దకు వధించేం దుకు వచ్చే మేకలు, గొర్రెల నుంచి ముందుగానే ఎలాంటి మత్తు ఇవ్వకుండా సిరంజీలతో రక్తాన్ని బయటకు తీస్తూ వాటిని ప్లాస్టిక్ సంచుల్లో నింపుతున్నాడు.

ఇందుకు నకిలీ వెటర్నరీ వైద్యుడు సంజయ్ తనవంతుగా సహాయం చేస్తున్నాడు. మూగజీవాల నుంచి రక్తాన్ని తీసివేశాక అవి అపస్మార క్షితిలో వెళ్లి చనిపోయాక వాటిని వధించి మాంసాన్ని మటన్ షాపు యజమాని సుందర్ సోను అమ్ముతున్నాడు. శనివారం రాత్రి కూడా పదికి పై గా మేకలు, గొర్రెలను ఇలాగే చిత్రహింసలకు గురిచేసి వాటి నుంచి రక్తాన్ని సేకరించారు. ఈ సమయంలో ఆ మూగజీవాల రోదన అరణ్య రోదన గానే మారింది. కాగా దీనిపై పక్కా సమాచారం అందుకున్న కీసర పోలీసులు ఆదివారం తెల్లవారు జామున మటన్ షాపుపై దాడిచేసి మూగజీవాల నుంచి సేకరించిన 130 రక్తం ప్యాకెట్లను జప్తు చేశారు. కాగా మూగజీవాల రక్తం నుంచి సేకరించిన రక్తంతో సిఎస్‌కె ఇంపోర్ట్ అండ్ ఎక్స్‌పోర్టు స ంస్థ వేరే జంతువుల కోసం బ్లడ్ అగర్ ప్లేట్‌లెట్లను తయారు చేస్తోందని పోలీసులు తేల్చారు. ఈ ఘటనలో మటన్ షాపు యజమాని సుందర్‌సోనుతోపాటు నకిలీ వెటర్నరీ వైద్యుడు సంజయ్‌ను అరెస్టు చేశారు. వీరివద్ద నుంచి 130 ప్లాస్టిక్ బ్యాగుల్లో వున్న మూగజీవాల రక్తాన్ని జిహెచ్‌ఎంసి వెటర్నరీ విభాగానికి అప్పగించారు. కాగా ఈ ఘటనలో వీరితోపాటు ఇంకా ఎవరిదైనా పాత్ర వుందా...? అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.



ఫ్రిడ్జ్‌లో నిల్వ చేసిన మేకలు, గొర్రెల నుంచి తీసిన రక్తం ప్యాకెట్లు




# సామాజిక పరిస్థితులతో అలుపెరగని పోరాటం

మహిళల రక్షణ ఆమె ఆకాంక్ష. అందుకు అసాంఘిక శక్తులతో, సామాజిక పరిస్థితులతో అలుపెరగని పోరాటం చేస్తున్నారు సునీతా కృష్ణన్. వ్యభిచార వృత్తిలో కూరుకుపోయిన ఆడపిల్లల్ని కాపాడేందుకు హైదరాబాద్‌లో ప్రజ్వల ఫౌండేషన్‌ను స్థాపించి చాలామందిని ఈ మురికికూపం నుంచి బయట పడేశారు. ఇటీవల షార్జా ఇంటర్నేషనల్ బుక్ ఫెయిర్ 2025 ఉత్తమ అంతర్జాతీయ పుస్తకం (నాన్ ఫిక్షన్) పురస్కారాన్నీ అందుకున్నారు.

బెంగళూరులో పుట్టినప్పటికీ తండ్రి ఉద్యోగరీత్యా సునీత బాల్యమంతా దేశంలో పలు ప్రాంతా. గడిచింది. చిన్నప్పటి నుంచి సమాజసేవే శ్వాసగా పెరిగారు. ఎనిమిదేళ్ల వయసులోనే మానస్ దివ్యాంగులైన విద్యార్థులకు నాట్యం నేర్పిస్తూ సమాజసేవ వైపు ఆకర్షితురాలయ్యారు. ఆపై మురికివాడల్లో పాఠశాలలు లేవు. పదిహేనేళ్లప్పుడు దళితుల పక్షాన ఉద్యమంలో పాల్గొన్నారని ఆమెపై కొందరు దుండగులు సామూహిక అత్యాచారం చేశారు. ఆ సంఘటనే సునీతను మహిళల రక్షణ కోసం ధైర్యంగా నిలబడేలా చేసింది. మాస్టర్స్ తరవాత సేవా రంగ డాక్టరేట్ తీసుకున్నారు. ఫీల్డు భాగంగా వేశ్యల జీవితాలను అధ్యయనం చేసేవారివె 1996లో పూర్తి సామాజిక కార్యకర్తగా మారారు. స్త్రీ శరీరాన్ని మార్కెట్ వస్తువుగా పెంచే ధోరణిని నిరసిస్తూ బెంగళూరులో జరిగిన మిస్ వరల్డ్ పోటీలను వ్యతిరేకించారు. ఆ సమయంలో రెండునెలలు జైలుశిక్ష కూడా అనుభవించారు. ఇప్పటికి పదిహేడుసార్లు కత్తులూ చెయిన్లూ, రాళ్లతో దాడులు జరిగాయి. ఒక ఘటనలో దెబ్బ తగిలి వినికిడి శక్తి తగ్గింది. మహిళ రక్షణ కోసమే ప్రజ్వల ఫౌండేషన్‌ను ప్రారంభించాం. స్త్రీలఅక్రమ రవాణా పూర్తిగా అంత రాంచా లంటే సమాజంలో మార్పు రావాలి. 'నా బంగారు తల్లి' సినిమాతో కొందరి



...గా ఆలోచింప చెయిగలి గాను. ఆడవాళ్ల మీద జరిగే దాడులు, మోసాల ను అరికట్టా లంటే ముందు మగవాళ్లలో మార్పు తీసుకురావాలి అంటారు సునీత. తను రచించిన ఐయామ్ వాట్ ఐయామ్ పుస్తకానికి షార్జా ఇంటర్నేషనల్ బుక్ ఫెయిర్ 2025 నవంబరులో "ఉత్తమ అంతర్జాతీయ పుస్తకం(నాన్ ఫిక్షన్) పుర స్కారం అందుకు న్నారు ఆడపిల్లలు అక్రమ రవాణా, బాధితులకి పునరావాసం, సోషల్ మీడియా తెస్తోన్న చిక్కులూ... ఇలా ఎన్నో అంశాల గురించి ఈ పుస్తకంలో చర్చించారు. ◻

## అమ్మ మాట ఆనందాల బాట !

చిట్టితల్లి ఏం చేస్తోంది... ఆమ్ తింటావా? లాల పోసుకుంటావా? బంగారుకొండ ఎంత ముద్దుగా ఉన్నావో... నెలల బిడ్డతో అమ్మనే ఇలా మాట్లాడుతుంది. బిడ్డకు ఇవన్నీ అర్థం అవుతాయో లేదో తెలియదు కానీ అమ్మ మాత్రం తన ప్రేమనంతా మాటల్లోకి తెచ్చేస్తుంది. వాళ్ళుచేసే చిన్న చిన్న పనులకూ సంబరపడిపోతుంటుంది. మరి ఇంత స్వచ్ఛమైన ప్రేమ... వట్టిగా పోతుందా? ఇదే బిడ్డలో ఆనంద హార్మోన్ల శాతాన్ని పెంచుతుందట. తొలిఏడాదిలో తల్లి బిడ్డతో మాట్లాడే ఈ మాటలు, "వాళ్లను అనుకరిస్తూ చేసే సరదా పనులు.... పసిపిల్లల్లో ఆక్సిటోసిన్ హార్మోన్ల ఉత్పత్తిని పెంచడం యూనివర్సిటీ కాలేజ్ లండన్ పరిశోధనలో వెల్లడైంది. ఇదే భవిష్యత్తులో వారు దృఢమైన సామాజిక బంధాలను ఏర్పరచు కోవడంలోనూ, ఎమోషనల్ డెవలప్ మెంట్‌లో కూడా కీలకపాత్ర పోషించడం. మధ్యలో, తల్లికీ, , నమ్మకం పెంపొంద దానికి ఈ చర్యలు సాయపడ తాయట. ఈ రిసెర్చ్ కోసం 39నెలల వయసుగల బిడ్డలున్న 62మంది అమ్మలను ఎంపిక చేశారు. బిడ్డలతో " వాళ్ల సహజంగా ఎలా మాట్లాడతారో, అలానే మాట్లాడతారో. సంబంధిత వీడియో రికార్డు. చేశారు. బిడ్డల ఆలోచనలు, భావోద్వేగాలు, ఇష్టాలను తల్లులు తమతో ఎంత బాగా వ్యక్తపరుస్తున్నారో చెప్పారు. పిల్లల్లో ఆక్సిటోసిన్ హార్మోను ఎక్కువగా పేర్కొన్నారు గడపడానికి, మాట్లాడడానికి ప్రయత్నిం చాలి అయితే, ప్రసవనం తర్వాత కుంగుబాటుతో బాధపడే తల్లులు తమ పిల్లలతో సంతోషంగా గడపలేకపోతున్నారట. ◻



## తిరుప్పావై

### 21వ పాశురము

.ఏత్తకలంగళ్ ఎదిర్ పొంగి
మీదళిప్ప
మాత్తాదేపాల్ శోరియం వళ్ళల్
పెరుం బశుక్కళ్
అత్తప్పదైత్తాన్ మగనే
అఱివురాయ్
ఊత్తముడై యాయ్
పెరియాయ్. ఉలగినిల్
తోత్తమాయ్ నిష్ట శుడరే
తుయిలెకాయ్
మాత్తారునక్కు వలితులైన్దున్
వాశఱ్కణ్
ఆత్తాతు వన్దున్న డిపణియు
మాప్పోలే
పోత్తియాం వన్దోం పుగళ్న్దేలో
రెమ్బావాయ్




నందగోపాలుని వద్ద మంచిస్వభావము గల పెద్ద అవి ఎన్నో కలవు. అవి పుష్కలంగా పాలిస్తాయి. అటు వంటి నందగోపాలుని కుమారుడా మేలుకో !"అప్రమేయా, తేజస్వరూపా, నీ శత్రువులు బల ముడిగి నీ వాకిట నీ పాదములను స్తుతిస్తున్నారు. మేము కూడా నీకు మంగళం పాడుటకు వచ్చియున్నాము. మేలుకో!" అని వెలుపలి గోపికలు కృష్ణుణ్ణి కోరుతున్నారు. ఫలం: "వేదార్థజ్ఞానం"

## తడి స్పాంజితో తాజాగా !

మేకప్ సరిగా వేసుకోకపోతే ముఖంపై గీతలు కనిపిస్తాయి. మేకప్ త్వరగానూ పోతుంది. అలాకాకుండా ఉండాలంటే ఈ చిట్కాలు పాటించమంటున్నారు నిపుణులు.

★ ముందు నిర్జీవంగా మారిన చర్మానికి తగిన తేమ అందించి మేకప్‌కి అనువుగా మార్చుకోవాలి. ఇందుకోసం పావుకప్పు పెసరపిండిలో కాసిని పాలు పోసి ఈ మిశ్రమంతో ముఖాన్ని స్క్రబ్ చేసుకోవాలి. పావుగంట య్యాక చల్లటి నీళ్లతో ముఖం కడిగి మాయిశ్చ రైజర్ రాస్తే సరి. మృత కణాలు తొలగి చర్మం తాజాగా, ఆరోగ్యంగా కనిపిస్తుంది. మేకప్ వేస్తే నిండుగా ఉంటుంది.



★ ముఖంపై ప్యాచులూ, గీతలూ, మచ్చలూ కనిపించకూడదంటే పౌడర్ ఆధారిత కీన్సలర్లు, మ్యాటిఫైయింగ్ సౌందర్య ఉత్పత్తులకు దూరంగా ఉండండి. బదులుగా ద్రవరూపంలో ఉన్న వాటిని మాత్రమే వాడండి. కన్సీలర్, ప్రైమర్‌లని వాడేందుకు తడి స్పాంజిని వినియోగించడం వల్ల సరిగ్గా పరచుకుంటాయి. ★ నీటి ఆధారిత మస్కారా, కాజల్ వంటివి వాడటం వల్ల అవి ఎక్కువ సేపు పాడవకుండా ఉంటాయి. ఐషాడో కోసం వీడియం కలర్స్‌నే వాడండి. అవి మీకు కొత్త లుక్‌ని తెచ్చిపెడతాయి. ★. ఈ కాలంలో పెదాలు పొడిబారి పగులుతుంటాయి. ఆ ఇబ్బంది లేకుండా తరచూ లిప్‌బామ్ రాసుకోవాలి. పంచదార, తేనె కలిపి రుద్దితే మృతచర్మం పోతుంది. ఆపై వేసేలిప్‌స్టిక్. మీ అందాన్ని రెట్టింపు చేస్తుంది. ◻

## చిలగడ గులాబ్‌జామ్

కావలసినవి. చిలగడదుంపలు రెండు, మైదాపిండి రెండు టేబుల్ స్పూన్లు, పంచదార కప్పు, బేకింగ్ సోడా, యాలకుల పొడి చిటికెడు చొప్పున, నెయ్యి అరటీస్పూన్, నూనె వేయించడానికి సరిపడా .



**తయారీ:** పిల్లలతోపాటు పెద్దలూ ఎంతో ఇష్టంగా గులాబీలను తింటారు. ఎప్పుడూ చేసే పద్ధతిలో కాకుండా ఇలాచేస్తే రుచితోపాటు ఆరోగ్యానికీ మంచిది. ఒకటి తిన్న తర్వాత మరోటి కావాలంటారు. ఇంతకీ వీటినెలా చేయాలంటే.. చిలగడదుంపలను మరీ మెత్తగా కాకండా ఆవిరి మీద ఉడికించుకోవాలి. (చాలామంది వీటిని నీళ్లతోనే ఊడికి. అలాచేస్తే దీంట్లో ఉంటే పోషకాలన్నీ నీళ్లతోపాటు బయటకు వెళ్లిపోతాయి), ఊడిన తర్వాత తొక్క తీసి.. మెత్తగా మెదుపుకుని మైదాపిండి వేసి ముద్దలా కలపాలి. పిండి పల్చగా ఉంటే మరికాస్త వేయొచ్చు. తర్వాత నెయ్యి వేసి కలపాలి. పిండిలో నుంచి చిన్న ముద్దను తీసుకుని గుండ్రంగా లేదా గుడ్డు ఆకారంలో గులాబీలు చేయాలి. కడాయిలో నూనె పోసి వేడిచేసి సిద్ధంగా ఉన్న ఉండలు వేసి తక్కువ మంట మీద వేయిం చాలి. ఒకేసారి ఐదారు ఉండలకు మించి వేయకుండా.. గోధుమరంగులోకి వచ్చేంత వరకూ వేయించాలి. ఇతే ఇలా అన్నీ అయిన తర్వాత తీసి పక్కన పెట్టుకోవాలి. గిన్నెలో పంచదార, కప్పు నీళ్లు పోసుకుని మరిగించాలి. దీంట్లో యాలకుల పొడి వేసి., లేత పాకం వచ్చేంత వరకూ మరగనివ్వాలి. ఇప్పుడు స్టాఫ్ చేసి.. సిద్ధంగా ఉన్న గులాబ్‌జామ్ లను ఈ పాకంలో వేసి గంట నుంచి రెండు గంటలపాటు బాగా నాననివ్వాలి. అంతే నోట్లో వేస్తేనే కరిగిపోయేలా ఉంటే గులాబీలు. ◻

## చిట్టి చిట్కా

ఫంక్షన్లు, పండగలప్పుడు కాస్త ఎక్కువగా తిన్నాం... లేదంటే అరగట్లేదు అనిపిస్తుంటుంది కదా!

చాలామంది అరగడానికి టానిక్లు, ట్యాబ్లెట్ల మీద ఆధారపడతారు. ఈసారి ఈ చిట్కా ప్రయత్నించండి. పావు స్పూను చొప్పున ధనియాలు, జీలకర్ర, వాము తీసుకోండి. వీట నాయిక రోట్లో వేసి, చిటికెడు ఉప్పునీ చేర్చి... కచ్చాపచ్చాగా దంచుకోండి. ఇప్పుడు ఒకగిన్నెలో గ్లాసు నీళ్లు పోసి వేడిచేయండి. ఆపై ఈ మిశ్రమాన్ని వేసి, నీళ్లు సగం అయ్యేదాకా మరిగించండి. స్టవ్ కట్టేసి, గోరువెచ్చగా అయ్యాక చిటికెడు వంటసోడ, స్పూను నిమ్మరసం చేర్చి తాగితే సరి. జీర్ణప్రక్రియ మెరుగవ్వడమే కాదు. ◻


## రంగవల్లి



15 చుక్కలు,
9వరుసలు,
సంధు చుక్కలు

గరిమెళ్ల పద్మావతి
విశాఖపట్నం





### ముగ్గులకు ఆహ్వానం

మా చిరునామా: ఎడిటర్, 'చెలి' వార్త, నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80. Gmail: cheli@vaartha.com

కృత్రిమ మేధతో రూపొందించిన ముగ్గులు పంపవద్దు

## 'హైందవ' బర్త్ డే స్పెషల్ పోస్టర్ రిలీజ్

'కిష్కింధపురి'తో బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకున్న యాక్షన్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ప్రస్తుతం అకల్ట్ థ్రిల్లర్ 'హైందవ'లో నటిస్తున్నారు. నూతన దర్శకుడు లుధీర్ బైరెడ్డి దర్శకత్వంలో, మూన్‌షైన్ పిక్చర్స్ బ్యానర్‌పై మహేష్ చందు నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. గత నెలలో మారేడుమిల్లిలో జరిగిన ఒక కీలకమైన షూటింగ్ షెడ్యూల్ తర్వాత, చిత్ర బృందం ఇప్పుడు తమ నాల్గవ మెయిన్ షెడ్యూల్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ, చిత్ర నిర్మాతలు ఒక ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. సినిమా నిర్మాణంలో 70 పూర్తయిందని నిర్మాతలు తెలియజేశారు. ఇప్పటివరకు జరిగిన షూటింగ్‌లో ఎక్కువ భాగం కథలోని మిస్టరీని, డ్రామాటిక్ టెన్షన్‌ను బలంగా నిలబెట్టే కీలక సన్నివేశాలకు కేటాయించారు. ఈ సినిమా కథ శతాబ్దాల నాటి దశావతార ఆలయం చుట్టూ తిరుగుతుంది. ఈ చిత్రంలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ సరసన సంయుక్త కథానాయికగా నటిస్తోంది. మహేష్ మంజ్రేకర్, సౌరభ్ సచ్‌దేవా, జెడి చక్రవర్తి, శివాజీ రాజా, గెటప్ శ్రీను వంటి నటీనటులు. ఈ సినిమాలో ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు.



## యాలో ఈ గుబులే ఎలో పాట రిలీజ్

అర్జున్ రెడ్డి, యానిమల్ పాన్ ఇండియా హిట్స్‌తో పాటు నేషనల్ అవార్డ్ అందుకున్న హర్షవర్ధన్ రామేశ్వర్ ఇప్పుడు మైథలాజికల్ జానర్‌లో రూపొందుతున్న "త్రికాల" సినిమా మ్యూజిక్ అందిస్తున్నారు. శ్రద్ధా దాస్, మాస్టర్ మహేంద్రన్, అజయ్ ప్రధాన పాత్రల్లో మణి తెల్లగూటి దర్శకత్వంలో రాధిక శ్రీనివాస్ నిర్మిస్తున్న చిత్రం నుంచి తాజాగా యాలో ఈ గుబులే ఎలో పాటని రిలీజ్ చేశారు. ఈ పాటలో హర్షవర్ధన్ రామేశ్వర్ స్టైల్‌తో పాటు మెలడీకి ఉన్న డెప్త్ అద్భుతంగా బ్యాలెన్స్ చేశాడు. ఆయన మ్యూజిక్ ట్రీట్ ఈ పాటకి ప్రధాన బలం. ప్రతి బీట్‌లోనూ ఆయన ట్రేడ్‌మార్క్ ఇంటెన్సిటీ స్పష్టంగా వినిపిస్తూ, పాటకి ఒక ప్రత్యేక ఐడెంటిటీ ఇచ్చింది. రిత్విక్ వేట్లా సమర్పణలో రాధిక, శ్రీనివాస్ నిర్మాతలుగా శ్రీసాయిదీప్ చాట్లా, వెంకట్ రమేష్ దాడి సహ నిర్మాతలుగా 'త్రికాల' సినిమాను మణి తెల్లగూటి తెరకెక్కిస్తున్నారు. శ్రద్ధా దాస్, మాస్టర్ మహేంద్రన్, అజయ్, సాహితి అవంచ, ఆమని, ప్రభాకర్, అంబటి అర్జున్, రౌడీ రోహిణి వంటి వారు ముఖ్యపాత్రల్ని పోషించారు. ఇప్పటికే రిలీజ్ చేసిన ట్రైలర్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ట్రైలర్‌తోనే సినిమాపై మరింత హైప్ క్రియేట్ అయింది. ఒక్క ట్రైలర్‌తోనే ఏకంగా నార్త్ ఇండియాలోనూ 'త్రికాల' బిజినెస్ జరిగిపోయింది. ప్రస్తుతం అన్ని చోట్లా "త్రికాల" మీద మంచి డిమాండ్ ఏర్పడింది. త్వరలోనే ఈ సినిమా ప్రేక్షకులు



## 'మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోమ్' ఎంటర్‌టైనింగ్ సినిమా



ఈవెంట్ లో హీరో త్రిగుణ్

తిగుణ్, పాయల్ రాధాకృష్ణ, అనీష్ కురువిల్లా ప్రధాన పాత్రల్లో చేస్తున్న హైలీ ఎంటర్టైనర్ 'మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోమ్'. మధుదీప్ చెలికాని రచన, దర్శకత్వం వహించారు. సి.హెచ్.వి.ఎస్.ఎన్ బాబ్జీ సమర్పణలో లోటస్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్ పై అరవింద్ మండెం నిర్మించారు. అరుణ్ చిలువేరు, ప్రకాష్ చెరుకూరి సంగీతం సమకూర్చారు. ఈ సినిమా టీజర్ గ్రాండ్ గా లాంచ్ చేశారు. టీజర్ లాంచ్ ఈవెంట్ లో హీరో త్రిగుణ్ మాట్లాడుతూ, ఈ వేడుకకి విచ్చేసిన అతిథులు అందరికీ నమస్కారం. గత కొన్ని రోజులుగా చిన్న సినిమాలన్నీ అద్భుతంగా ఆడుతున్నాయి. అందరికి ఒక హోప్ వచ్చింది. సినిమాలు చూడడం థియేటర్‌కి రావడం చాలా ఆనందంగా ఉంది. బాబ్జికి థాంక్యూ తక్కువ టికెట్ ధరల్లో పెడితే ఆడియన్స్ అందరూ వచ్చి చూస్తారని భావిస్తున్నాను. మోడరన్ లైఫ్, పాత పద్ధతిలో ఉన్న వ్యవసాయాన్ని ఎలా కలపొచ్చు అనేది ఈ సినిమాల్లో చాలా ఇంట్రెస్టింగ్ గా చూపించారు. మనమందరం కూడా వ్యవసాయం నుంచే వచ్చాము. వ్యవసాయం గురించి ఇంపార్టెంట్ విషయాలు మాట్లాడుతూనే సినిమా చాలా ఎంటర్టైనింగ్ గా ఉంటుంది. ఈ సినిమాకి పని చేసిన అందరికీ ధన్యవాదాల తప్పకుండా ఈ సినిమాని మీరందరూ సపోర్ట్ చేస్తారని కోరుకుంటున్నాను. డైరెక్టర్ మధుదీప్ మాట్లాడుతూ, నేను ఈ ఇండస్ట్రీలో ఉండ డానికి కారణం చంటి. ఆయన లేకపోతే ఈ జర్నీ ఇంత స్మూత్‌గా జరిగేది కాదు. పాయల్ మాట్లాడుతూ, ఇది నేను ఫస్ట్‌సైన్ చేసిన ఫిలిం. ఈ ప్రాజెక్ట్ నాకు చాలా స్పెషల్. కథ చెప్పినప్పుడు నేను చాలా పర్సనల్గా కనెక్ట్ అయ్యాను. ప్రొడ్యూసర్ అరవింద్ మాట్లాడుతూ, ఈ వేడుకకు విచ్చేసిన పెద్దలకు మీడియా మిత్రులకు అందరికీ ధన్యవాదాలు. ఇది ఒక ఇంపార్టెంట్ కంటెంట్ ఉంటూనే హైలీ ఎంటర్టైంగా ఉండే సినిమా అని అన్నారు.

## 'టైసన్ నాయుడు' నుంచి బర్త్ డే ప్యాక్డ్ పోస్టర్ రిలీజ్



యాక్షన్ హల్క్ బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కథానాయకుడిగా సాగర్ కె చంద్ర దర్శకత్వంలో రూపొందు తున్న యూనిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'టైసన్ నాయుడు'. 14 రీల్స్ ప్లస్ బ్యానర్ పై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ గ్లింప్స్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఈ రోజు బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ మేకర్స్ స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేశారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తుపాకీని పట్టుకొని, శత్రువుల వైపు గురిపెట్టి నిల్చున్న ఈ పోస్టర్ అదిరిపోయింది. అతని ఇంటెన్సిటీ, మజిల్డ్ ఫిజిక్, నెక్స్ట్ లెవల్ యాక్షన్‌ని ప్రజెంట్ చేస్తున్నాయి. ఈ పోస్టర్‌కి సోషల్ మీడియాలో అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ఈ చిత్రంలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌ను మునుపెన్నడూ చూడని యాక్షన్ ప్యాక్ క్యారెక్టర్‌లో ప్రెజెంట్ చేస్తున్నారు.

## 'జెట్లీ' గ్లింప్స్ ఈవెంట్‌లో డైరెక్టర్ రితేష్ రానా

తెర

మైత్రీ మూవీ మేకర్స్ ప్రజెంట్స్, సత్య, రితేష్ రానా, క్లాప్ ఎంటర్‌టైన్ మెంట్ 'జెట్లీ' హ్యూమర్ ఫిల్డ్ యాక్షన్ గ్లింప్స్ రిలీజ్ టాలీవుడ్ ఫేవరేట్ ద్వయం సత్య, దర్శకుడు రితేష్ రానా 'జెట్లీ'తో అలరించబోతున్నారు. ప్రతిష్టాత్మక మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ చిరంజీవి (చెర్రీ), హేమలత పెద్దమల్లు నిర్మించిన ఈ చిత్రంతో మిస్ యూనివర్స్ ఇండియా రియా సింఘా తెలుగులో పరిచయం కానుంది. సత్య వాయిస్‌లో వేమన శతకంతో గ్లింప్స్ ప్రారంభమవుతుంది. అకస్మాత్తుగా అల్లకల్లోలం ప్రయాణికులను భయాందోళనకు గురి కావడం, తుపాకీ కాల్పులు, హైజాక్ గురించి సూచిస్తూ, సత్య పరిచయం కావడం ఆకట్టుకుంది. సత్య- వెన్నెల కిషోర్ మధ్య వచ్చే డైలాగ్స్ గ్లింప్స్‌కు మరింత చార్మ్‌ని యాడ్ చేశాయి. నివ్వు ఏ టైర్ హీరో అని అడిగినప్పుడు, "జనరల్ కంపార్ట్‌మెంట్" అంటూ సత్య అన్సర్ ఇవ్వడం ప్రేక్షకులకు వెంటనే కనెక్ట్ అయ్యింది. మత్తు వదలరా వెనుక ఉన్న మెయిన్ టీం ఈ సినిమా క్రియేటివ్ ఇంజిన్‌గా పని చేస్తున్నారు. మ్యూజిక్ కాల భైరవ, సినిమాటోగ్రాఫర్ సురేష్ సారంగం, ఎడిటర్ కార్తీక శ్రీనివాస్, ప్రొడక్షన్ డిజైనర్ నార్ని శ్రీనివాస్‌తో కలిసి రితేష్ రానా మరోసారి యూనిక్ సినిమాటిక్ యూనివర్స్ క్రియేట్ చేశారు. గ్లింప్స్ లాంచ్ ఈవెంట్‌లో సత్య మాట్లాడుతూ, రితేష్, చెర్రీతో మళ్ళీ కలిసి వర్క్ చేయడం చాలా ఆనందంగా ఉంది. నిర్మాత చెర్రీ మాట్లాడుతూ, నవంబర్ 17న ఈ సినిమా మొదలుపెట్టాం. ఇప్పటికే 60 శాతం షూటింగ్ పూర్తయింది. బ్యాలెన్స్ జనవరి ఫెబ్రవరి నాటికి పూర్తయిపోతుంది. సమ్మర్ లో రిలీజ్‌కి ప్లాన్ చేస్తున్నాం అని అన్నారు.



## 'జాకీ' తమిళ్ సినిమా టీజర్ విడుదల



శిరీ7 స్టూడియోస్ నిర్మిస్తున్న కొత్త తమిళ సినిమా 'జాకీ' (టీజర్ విడుదలైంది. ఈ సినిమా మధురై గ్రామీణ నేపథ్యంలో రూపొందింది. చెన్నైలో జరిగిన వీధి తిరువిళా - 13వ ఎడిషన్ కార్యక్రమంలో టీజర్‌ను విడుదల చేశారు. 2021లో వచ్చిన 'మడి' సినిమా తర్వాత, శిరీ7 స్టూడియోస్ మరోసారి దర్శకుడు డా. ప్రగభల్ కలిసి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తోంది. ప్రేమ కృష్ణదాస్ సి.దేవదాస్ జయదేవదాస్ ఈ చిత్రానికి నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంలో యువన్ కృష్ణ, రిదాన్ కృష్ణాస్, అమ్ము అభిరామి ప్రధాన పాత్రల్లో నటించారు. శక్తి బాలాజీ ఈ సినిమాకి సంగీతం అందించారు. నటీనటులు నిజమైన పొట్టేలుతో శిక్షణ తీసుకొని నటించారు. 'జాకీ' సినిమా ద్వారా గ్రామీణ జీవితం, ప్రజల భావోద్వేగాలు, సంప్రదాయ క్రీడను సహజంగా ప్రేక్షకులకు చూపించనున్నారు. టీజర్ విడుదలతో ఈ సినిమా ప్రయాణం మొదలైంది. మరిన్ని విషయాలు త్వరలోనే వెల్లడిస్తామని చిత్ర యూనిట్ తెలిపారు.

# పైపర్స్ వీరోచిత ప్రదర్శన

## సూర్మా క్లబ్ 3-1తో చిత్తు



**న్యూఢిల్లీ:** ఉమెన్స్ హాకీ ఇండియా లీగ్, 2025-26లో ఎస్‌జి పైపర్స్ అటాకింగ్ ఫ్లెయిర్, మిడ్‌ఫీల్డ్ కెమిస్ట్రీ, గోల్ కీపింగ్ వీరోచిత ప్రదర్శనల తో అద్భుత విజయం అందించింది. సూర్మా హాకీ క్లబ్‌ను 3-1 తేడాతో చిత్తు చేసింది. అర్జెంటీనా రైజింగ్ స్టార్ జువానా కాస్టెల్లారో అద్భుతమైన పాస్‌తో స్పష్టమైన అవకాశాన్ని పైపర్స్ సృష్టించింది. సూర్మా పెనాల్టీ కార్నర్‌ను పొందగా, పెన్నీ స్క్విబ్ 12వ నిమిషంలో గోల్ చేసి స్కోరును 1-0కి చేర్చింది. కానీ పైపర్స్ తక్షణమే వరుసగా పెనాల్టీ కార్నర్‌లను అడ్డుకున్నా స్పెయిన్‌కు చెందిన ప్రపంచ స్థాయి పిసి స్పెషలిస్ట్ లోలా రియారా (13) ముందుకు వచ్చి గోల్ చేసి గోల్‌ను సమమైంది. మిడ్‌ఫీల్డర్ ఇషిక అద్భుతమైన పరుగుతో బంతిని కెప్టెన్ నవనీత్ కౌర్‌కు స్లిప్ చేయంతో మొదటి క్వార్టర్ 1-1తో ముగిసింది. రెండో క్వార్టర్‌లో పైపర్స్ వరుస దాడులతో సూర్మా క్లబ్‌ను వెనక్కి నెట్టడంతో పెనాల్టీ కార్నర్ లభించింది, అయితే అది గోల్‌గా మారలేదు, కెప్టెన్ నవనీత్ కౌర్ బంతిని సర్కిల్‌లోకి పంపించగా, జ్యోతి సింగ్ (18) నిర్ణయాత్మకంగా ముగించి పైపర్స్‌ను ఆధిక్యంలోకి తెచ్చింది. 27వ నిమిషంలో గోల్ కీపర్ క్రిస్టినా కోసెంటేనో అండగా నిలిచి పెనాల్టీకార్నర్ వేరియేషన్‌ను అద్భుతమైన సేవ్ చేయడంతో పైపర్స్ 2-1 ఆధిక్యాన్ని కాపాడుకునేలా చేసింది. పైపర్స్ దృఢమైన రక్షణతో సూర్మాను ఉక్కిరిబిక్కిరి చేసి గోల్ కీపర్ కోసెంటినో పైపర్స్‌ను ముందుకు తీసుకెళ్లే భాగంలో ఆధిక్యాన్ని 3-1కి పెంచింది. దీంతో పైపర్స్ నాలుగు మ్యాచ్‌లలో మూడు విజయాలతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉంది.

## యూత్ కాంటెండర్‌లో

# ఫైనల్స్‌కు వివాన్, నైషా




**న్యూఢిల్లీ:** వరల్డ్ టేబుల్ టెన్నిస్ యూత్ కాంటెండర్ 2026లో వివాన్ దేవ్-నైషా రేవాస్కర్ జోడీ అండర్ 15 మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్‌కు చేరుకున్నారు. టాప్ సీడ్ ఆదిత్య దాస్-అంకోలికా చక్రవర్తిని ఓడించడంతో ఫైనల్‌కు చేరుకోవడంతో పాటు, ఈ మ్యాచ్‌లో అదనపు పాయింట్లు వచ్చాయి. వివాన్-నైషా 13-11, 5-11, 11-7, 5-11, 23-21 స్కోరుతో టాప్ సీడ్‌లను తృటిలో ఓడించారు. వారు తోటి ఆటగాళ్ళు రేయాన్ష్ జలన్-తనిష్క కల్భైరవ్ ద్వయంపై ఫైనల్‌కు చేరుకున్నారు. వివాన్ మరియు నైషా ప్రారంభం నుండే తమ పోరాట స్ఫూర్తిని ప్రదర్శించారు. 58 తేడాతో వెనుకబడి, గేమ్ పాయింట్‌ను కాపాడుకున్నారు మరియు తరువాత మొదటి గేమ్‌ను గెలుచుకున్నారు. ఈ జంట మూడు మ్యాచ్ పాయింట్లను కాపాడుకోవడమే కాకుండా, ప్రత్యర్థులు మ్యాచ్ పాయింట్ ఎదుర్కొన్న ప్రతిసారీ స్కోరును సమం చేయకుండా అడ్డుకున్నారు. చివరికి వరుసగా 4 పాయింట్లు గెలుచుకుని మ్యాచ్‌ను ముగించారు. అంతకు ముందు సెమీఫైనల్ మ్యాచ్‌లో సంజయ్ జగదీష్-మైరా సంగెల్కర్‌పై 11-3, 15-13, 11-7 స్కోరుతో గెలిచారు. అలాగే టాప్ సీడ్లు అభినంద్ ప్రధివాధి-అనన్య మురళీధరన్ సార్థక్ ఆర్య-సింద్రెలా దాస్ లతో జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్‌లో స్థానం సంపాదించడం ద్వారా తమ అత్యుత్తమ ప్రదర్శనను ప్రదర్శించారు. సెమీఫైనల్లో అభినంద్-అనన్య 9-11, 14-12, 11-7, 11-8 స్కోరుతో రిత్విక్ గుప్తా-అహోనా రాయ్‌లను ఓడించగా, సార్థక్-సింద్రెలా 11-6, 12-10, 5-11, 11-5 తేడాతో సాహిల్ రావత్-హార్దీ పటేల్‌లను అడ్డుకున్నారు.



## ప్రో రెజ్లింగ్ లీగ్ వేలంలో..

# రూ.60 లక్షలతో సుసాకి టాప్

### భారత్ రెజ్లర్ సిజీత్‌కు రూ.52 లక్షలు

**న్యూఢిల్లీ:** భారత్‌కు చెందిన ప్రధాన ఫ్రాంచైజీ ఆధారిత రెజ్లింగ్ లీగ్ (పిడబ్ల్యూఎల్)-2026 ఏడు సంవత్సరాల విరామం తర్వాత 5వ సీజన్ మళ్లీ జరగనుంది. ఈ నెల 15 నుండి నోయిడాలో ప్రారంభం కానుంది. ఈ సీజన్‌లో ఢిల్లీ దంగల్ వారియర్స్, టైగర్స్ ఆఫ్ ముంబై దంగల్స్, యుపి డామినేటర్స్, మహారాష్ట్ర కేసరి, హర్యానా థండర్స్, పంజాబ్ రాయల్స్ పాల్గొంటున్నాయి. ఇందుకు న్యూఢిల్లీలో జరిగిన వేలంలో రెజ్లర్లపై కాసులు వర్షం కురిపించాయి. ఈ వేలంలో అతిపెద్ద స్టార్ అయిన యుయి సుసాకి (జపాన్)ని అత్యధిక ధరకు కొనుగోలు జరిగింది. గట్టి పోటీ ఎదురైనా హర్యానా థండర్స్ రూ.60 లక్షలకు కొనుగోలు చేసింది. ఈ జపనీస్ లెజెండ్ 4 సార్లు ప్రపంచ ఛాంపియన్, 2 సార్లు ఒలింపిక్ పతక విజేత. ఇందులో 2021 టోక్యోలో జరిగిన స్వదేశీ ఒలింపిక్స్‌లో బంగారు పతకం కూడా ఉంది. మొత్తంగా ఆమె 18 అంతర్జాతీయ ఈవెంట్లలో 17 బంగారు పతకాలను సాధించింది. పోలాండ్‌కు చెందిన హెవీవెయిట్ రెజ్లర్ రాబర్ట్ బరాన్ 125 కిలోల విభాగంలో అగ్రస్థానంలో ఉన్నాడు. అతడిని మహారాష్ట్ర కేసరి రూ.55 లక్షలకు కొనుగోలు చేసింది. ఇక యువ భారత రెజ్లర్ సుజీత్ కల్కల్ 2025 చివర్లో అండర్ 23 ప్రపంచ టైటిల్‌ను గెలుచుకున్నాడు, ఢిల్లీ దంగల్ వారియర్స్ 52 లక్షలకు కొనుగోలు చేసిన భారతీయులలో సుజీత్ అత్యధిక బిడ్‌లో నిలిచాడు. అంటీమ్ పంఘల్ (భారత్) రూ.52 లక్షలకు యుపి డామినేటర్స్ కొనుగోలు చేసింది. రెండుసార్లు ప్రపంచ పతక విజేత అయిన ఆమె ప్రస్తుతం ప్రపంచ నంబర్ 1 స్థానంలో ఉంది. గత సంవత్సరం ఆడిన 4 పోటీలలో పతకాలు (2 స్వర్ణం, 2 కాంస్య) గెలుచుకుంది. అలాగే 2024 పారిస్ ఒలింపిక్ పతక విజేత భారత్ ఏకైక రెజ్లర్ అమన్ సెహ్రావత్‌ను పురుషుల విభాగంలో టైగర్స్ ఆఫ్ ముంబై దంగల్స్ రూ.52 లక్షలకు దక్కించుకుంది.

## విజయ్ హజారే ట్రోఫీ..

# హైదరాబాద్, ఆంధ్రా ఔట్

### క్వార్టర్ రేస్‌కు నో ఛాన్స్

### ఐదు మ్యాచ్‌ల్లో 4 ఓడిపోయిన ఇరు జట్లు

**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాద్, ఆంధ్ర తీవ్రంగా నిరాశపర్చాయి. హైదరాబాద్ వరుసగా ఐదు మ్యాచ్‌లకు నాలుగు ఓడగా, ఆంధ్ర ఐదు మ్యాచ్‌ల్లో ఒక్క మ్యాచే గెలిచింది. ఇరు జట్లు ఇంకా రెండేసి మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఈ రెండు మ్యాచ్‌లు గెలిచినా ఆంధ్ర, హైదరాబాద్ క్వార్టర్స్ చేరే అవకాశాలు లేవు. ఈ ట్రోఫీలో మొత్తం 38 జట్లు పోటీపడుతున్నాయి. ఇందులో 32 జట్లు ఎలైట్ గ్రూప్‌లో ఆడనుండగా, మరో 6 జట్లు ప్లేట్ గ్రూప్‌లో బరిలోకి దిగుతున్నాయి. ఎలైట్ గ్రూప్‌లోని 32 జట్లను ఏ,బీ, సీ, డీ నాలుగు గ్రూపులుగా విభజించగా, ఒక్కో దానిలో 8 జట్లు ఉంటాయి. ప్రతీ గ్రూపులోని జట్టు తమ ప్రత్యర్థి జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడుతోంది. అంటే ఒక్కో జట్టు ఏడేసి మ్యాచ్‌లు ఆడుతోంది. గెలిచిన జట్టుకు 4 పాయింట్లు, మ్యాచ్ రద్దైనా లేదా ఫలితం తేలకపోయినా చెరో 2 లభిస్తాయి. ఎలైట్ గ్రూపుల నుంచి తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు నేరుగా క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. ఈ 8 జట్ల నుంచి 4 జట్లు సెమీఫైనల్స్ ఆడుతాయి. సెమీఫైనల్లో గెలిచిన జట్లు ఫైనల్లో తలపడుతాయి. ఇక ప్లేట్ గ్రూప్‌లోని 6 జట్లు తమ ప్రత్యర్థితో ఒక్కో మ్యాచ్ ఆడుతాయి. అంటే ఒక్కోటీమ్ ఐదు లీగ్ మ్యాచ్‌లు ఆడుతోంది. ఈ ఐదు మ్యాచ్‌లు ముగిసే సమయానికి టాప్2లో నిలిచిన జట్లు ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. ఫైనల్లో గెలిచిన జట్టు తదుపరి ఎలైట్ గ్రూప్‌కు అర్హత సాధిస్తోంది. నాలుగు ఎలైట్ గ్రూపుల్లో కలిపి అత్యంత తక్కువ పాయింట్లు, నెట్ రన్ రేట్ ఉన్న జట్టు ప్లేట్ గ్రూప్‌కు డీమోట్ అవుతుంది. ఈ విధంగానే క్వార్టర్స్ రేసు నుంచి హైదరాబాద్ ఔట్ కానుంది. ఎలైట్ గ్రూప్ బీలో ఉన్న హైదరాబాద్ ఐదు మ్యాచ్‌లకు నాలుగు ఓడి ఏడో స్థానంలో కొనసాగుతుండగా, మరో రెండు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఈ రెండు మ్యాచ్‌లను గెలిచినా క్వార్టర్స్ చేరే అవకాశాలు లేవు.ఈ గ్రూప్‌లో ఉత్తరప్రదేశ్ ఇప్పటికే 16 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా, జమ్మూ కాశ్మీర్, విదర్భ, బరోడా, బెంగాల్ వంటి జట్లు ఒక్కొక్కటి 12 పాయింట్లతో పోటీలో ఉన్నాయి. హైదరాబాద్ చివరి 2 మ్యాచ్‌ల గెలిచినా 8 పాయింట్లు మాత్రమే వస్తాయి. అలాగే ఎలైట్ గ్రూప్ డీలో ఉన్న ఆంధ్రా ఐదు మ్యాచ్‌లు ఆడి ఒక్క విజయం మాత్రమే నమోదు చేసింది. 4 పాయింట్లతో 7వ స్థానంలో కొనసాగుతోంది. ఈ గ్రూప్‌లో ఇప్పటికే ఒడిశా, రైల్వేస్, హర్యానా, ఢిల్లీ 12 పాయింట్లతో టాప్ 4లో ఉండగా, సౌరాష్ట్ర 8 తో 5వ స్థానంలో ఉంది. ఆంధ్ర తమ చివరి మ్యాచ్‌లు గెలిచినా 8 పాయింట్లతోనే నిలుస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో టాప్5 జట్లలో నాలుగు టీమ్స్ తమ చివరి మూడు మ్యాచ్‌ల్లో ఓటమి పాలవ్వాలి. అంతేకాకుండా ఆంధ్ర రన్ రేట్ మెరుగ్గా ఉండాలి. కానీ ఆంధ్ర రన్‌రేట్ మైనస్‌లో ఉంది. కాబట్టి ఆంధ్ర కూడా క్వార్టర్స్ చేరడం అసాధ్యం.










## యాషెస్ సిరీస్‌లో ఘనంగా

# ఆరంభించిన ఇంగ్లండ్

### తొలి రోజు ఆస్ట్రేలియాపై ఆధిపత్యం

**న్యూఢిల్లీ:** యాషెస్ సిరీస్ 2025-26లో ఆఖరి టెస్టును ఇంగ్లండ్ ఘనంగా ఆరంభించింది. సిడ్నీ వేదికగా ఆదివారం ప్రారంభమైన ఈ మ్యాచ్ తొలి రోజు ఆటలో ఆస్ట్రేలియాపై ఇంగ్లీష్ జట్టు పై చేయి సాధించింది. అయితే వర్షం కారణంగ ఖమొదటి రోజు కేవలం 45 ఓవర్లు ఆట మాత్రమే సాధ్యపడింది. తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్‌లో 3 వికెట్లు నష్టానికి 211 పరుగులు చేసింది. క్రీజులో జోరూట్ (72), హ్యారీ బ్రూక్ (78) ఉన్నారు. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 57 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ సమయంలో రూట్, బ్రూక్ అద్భుతమైన పోరాటం కనపరిచారు. మరో వికెట్ కోల్పోకుండా ఆచితూచి ఆడుతూ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించారు. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు అజేయంగా 154 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఆసిస్ బౌలర్లలో మిచెల్ స్టార్క్, మైఖల్ నీసర్, స్కాట్ బోలాండ్ తలా వికెట్ సాధించారు. కాగా ఇప్పటికే యాషెస్ సిరీస్‌ను 3-1 తేడాతో ఆస్ట్రేలియా సొంతం చేసుకుంది. వరుసగా మూడు మ్యాచ్‌లలో ఓటమి చవిచూసిన ఇంగ్లండ్ మెల్‌బోర్న్ వేదికగా జరిగిన బాక్సింగ్ డే టెస్టులో మాత్రం అద్భుతమైన విజయాన్ని అందుకుంది.

## కమోడిటీ, బులియన్‌లపై

# వెనిజులా దాడుల ఎఫెక్ట్!



**న్యూఢిల్లీ, జనవరి 4:** అంతర్జాతీయ కమోడిటీ మార్కెట్‌లకు వెనిజులా ఎఫెక్ట్ తీవ్రస్థాయిలోచూపిస్తోంది. వెనెజువెలాపై దాడులు ప్రకంపనలు సృష్టిస్తున్న తరుణంలో ముడి చమురు, బంగారం, వెండి తదితర కమోడిటీల ధరలకు రెక్కలొస్తున్నాయి. వెనెజువెలా ఆర్థిక వ్యవస్థ అంత పెద్దదేమీ కాదంటున్న ఆర్థిక నిపుణులు భారతీయ స్టాక్ మార్కెట్లపై ఈ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల ప్రభావం చెప్పుకోదగ్గ స్థాయిలో ఉండకపోవచ్చనే చెప్తున్నారు. అయితే గ్లోబల్ మార్కెట్‌లో గోల్డ్, సిల్వర్, క్రూడాయిల్ ఇతర కమోడిటీ ట్రేడింగ్ తప్పక ప్రభావితం కాగలదని చెపుతున్నారు. సోమవారం ఫ్యూచర్ మార్కెట్ కామెక్స్‌లో గోల్డ్ ధర ఔన్స్ 4,380 డాలర్లను తాకవచ్చని, సిల్వర్ కూడా 7578 డాలర్లను చేరవచ్చని ఆరంగ నిపుణుడు అనుజ్ గుప్తా అన్నారు. దీంతో స్పాట్ మార్కెట్‌లోనూ ఔన్స్ గోల్డ్ రూ.4,450 డాలర్లు, ఔన్స్ సిల్వర్ 80 డాలర్లు ఉండొచ్చన్న అంచనాలు నెలకొన్నాయి. ఇక భారతీయ ఫ్యూచర్ మార్కెట్ ఎంసీఎక్స్‌లోనూ బంగారం ధర 24 క్యారెట్ 10 గ్రాములు రూ.1.40లక్షలుగా నమోదు కావచ్చని, వెండి కిలో రూ.2.45లక్షలను తాకవచ్చన్నారు. అమెరికావెనెజువెలా సంక్షోభం సముద్ర మార్గంలో ఇబ్బందులకు దారితీయవచ్చని, ఈ దారిగుండానే ప్రపంచంలోనే వెండి ఎగుమతుల్లో దూసుకుపోతున్న పెరు, చాద్ దేశాలకు ప్రస్తుత పరిస్థితులు చిక్కులు తీసుకురావచ్చని మార్కెట్ నిపుణులు గుర్తుచేస్తున్నారు. ఈ దెబ్బకు గోల్డ్ ధరలు కొండెక్కుతాయని అంటున్నారు. ఇదే జరిగితే దేశీయ మార్కెట్‌లో బంగారం, వెండి ధరల పరుగుకు పట్టపగ్గాలనేవే ఉండకపోవచ్చు. ఇక ముడి చమురు విషయానికొస్తే ఎంసీఎక్స్‌లో బ్యారెల్ మరింత పెరిగే వీలుంటుందని పేర్కొంటున్నారు.

# వాణిజ్యం




## డిపాజిట్లకంటే ఫండ్స్ పెట్టుబడులపైనే

# ఎక్కువ ఫోకస్!

**ముంబయి,జనవరి 4:** పొదుపుచేసే చర్యల్లోప్రజల్లో పెట్టుబడి విధానాలు మారుతున్నాయి. ఈక్విటీలతోపాటు మ్యూచువల్‌ఫండ్స్‌లో పెట్టుబడులకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. 2022 నుంచి 2024 చివరి త్రైమాసికం వరకు స్టాక్ ధరల్లో ర్యాలీ వల్ల ప్రజలు ఇటువంటి నిర్ణయాలు తీసుకుంటున్నట్లు కనిపిస్తున్నది. ఆర్బీఐ విడుదల చేసిన నెలవారీ బులెటిన్ ప్రకారం, సాధారణ కుటుంబాల బ్యాంక్ డిపాజిట్లు 2024-25 ఆర్థిక సంవత్సరంలో 8.97 శాతం తగ్గిపోయి, రూ.12.54 లక్షల కోట్లకు చేరుకున్నాయి. అంతకు ముందు రెండేండ్లలో కనిపించిన వృద్ధి తిరోగమనం బాట పట్టింది. జీవిత బీమా నిధుల్లో పెట్టుబడులు 17.3 శాతం తగ్గి, రూ.5.3 లక్షల కోట్లకు చేరాయి. పీపీఎఫ్ మినహా చిన్న మొత్తాల పొదుపులు 24 శాతం పతనమయ్యాయి. తక్కువ ప్రతిఫలాన్ని ఇచ్చే సురక్షిత పెట్టుబడులను ఇన్వెస్టర్లు గట్టిగా తిరస్కరిస్తున్నారు. ప్రజలు తమ సొమ్మును అధిక ప్రతిఫలాన్ని ఇచ్చే పథకాల్లో పెడుతున్నారు. ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్లు దాదాపు 153 శాతం పెరిగాయి, మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు 95 శాతం పెరిగాయి. కరెన్సీ హోల్డింగ్స్ కూడా 77.6 శాతం ఎగబాకాయి. ప్రజలు నగదు అందుబాటులో ఉంచుకునేందుకు సైతం ప్రాధాన్యం ఇస్తున్నారు. వినియోగం కూడా అధికంగా కనిపించింది. 2021-22 నుంచి 2024-25 వరకు పొదుపులో బ్యాంక్ డిపాజిట్ల వాటా 40.9 శాతం నుంచి 35.2 శాతానికి తగ్గింది. అదే కాలంలో మ్యూచువల్ ఫండ్స్ వాటా 2.1 శాతం నుంచి 13.1 శాతానికి పెరిగింది. ఈక్విటీ హోల్డింగ్స్ వాటా 1.3 శాతం నుంచి 2.1 శాతానికి పెరిగింది. సాధారణ కుటుంబాలు పొదుపు చేసే తీరు క్రమంగా మారుతున్నట్లు ఈ గణాంకాలు చెప్తున్నాయి. సురక్షితమైన పొదుపు చేయాలనే భావం నుంచి అవకాశాల ఆధారిత పొదుపు చేయడం వైపు ప్రజలు మారుతున్నట్లు వెల్లడవుతున్నది.

# రియాల్టీలో విక్రయం కాని ఇళ్లు 5.77 లక్షలు!

### అనరాక్ రియాల్టీ కన్సల్టెన్సీ అంచనా



**న్యూఢిల్లీ, జనవరి 4:** భారత్ రియాలీట్టరంగంలో గత ఏడాది ఏడు మేజర్ నగరాల్లో నాలుగుశాతం ఇళ్లు విక్రయం కాకుండా నిలిచిపోయాయి. అంటే సుమారు 5.77 లక్షలయూనిట్లు అమ్మకాలు లేకుండా నిలిచినట్లు తేలింది. అనరాక్ డేటాను పరిశీలిస్తే ప్రైమరీ రెసిడెన్షియల్‌మార్కెట్‌లో అన్‌సోల్డ్ యూనిట్లు 5,76,617 యూనిట్లుగా ఉన్నాయి. అదే గత ఏడాది చివరినాటికి 5,53,073 యూనిట్లు ఉన్నట్లు తేలింది. సాలీనా అన్‌సోల్డ్ ఇళ్లను టాప్ ఏడు నగరాల్లో నాలుగుశాతంగా ఉంటుంది. ఏడు నగరాల్లో వార్షిక పద్ధతిలోచూస్తే 14శాతం క్షీణించి 3,95,625 మాత్రమే అమ్మకం జరిగాయి. కొత్త ఇళ్ల సరఫరా మాత్రం రెండుశాతం పెరిగి 4,19,170యూనిట్లకు చేరినట్లు అనరాక్ ప్రకటించింది. ముంబయి మెట్రోపాలిటన్‌రీజియన్, హైదరాబాద్‌లలోనే ఎక్కువ అన్‌సోల్డ్‌యూనిట్లు ఉన్నాయి. ఢిల్లీ, ఎన్సీఆర్, పూణె, చెన్నై, బెంగలూరు, కోల్‌కత్తా నగరాల్లోకూడా ఇదేపరిస్థితిఉ న్నట్లు అనరాక్ రియల్‌ఎస్టేట్ కన్సల్టెన్సీ ప్రకటించింది. ఢిల్లీఎన్సీఆర్‌ఫరిధిలో ఐదుశాతం అన్‌సోల్డ్స్ నిలిచాయి. 90,455 యూనిట్లు ఉన్నట్లు తేలింది. ముంబయి మెట్రో రీజియన్‌లో ఒకటిశాతం తగ్గి 1,79,228యూనిట్లు ఉన్నాయి. బెంగలూరులో అన్‌సోల్డ్స్ స్టాక్ 23శాతంపెరిగి 64,863యూనిట్లు ఉన్నట్లు సంస్థ వెల్లడించింది. పూణెలో మూడుశాతంపెరిగి 83,491 యూనిట్లు ఉంటే హైదరాబాద్‌లో 96,140 యూనిట్లు ఉన్నాయి. చెన్నైలో 18శాతం అన్‌సోల్డ్స్ పెరిగి 33,434 యూనిట్లకు చేరాయి. అదే కోల్‌కత్తాలో అన్‌సోల్డ్ ఇళ్లు 29,007కి చేరాయి. హోమ్‌లోన్లపై తక్కువ వడ్డీరేట్లకు రుణాలు లభిస్తే ఈ అన్‌సోల్డ్ సంఖ్య గణనీయంగా తగ్గిపోతుందని అనరాక్ అంచనావేసింది

## ఎయిర్‌లైన్స్‌లో పవర్ బ్యాంకుల వినియోగంపై

# డిజిసిఎ సర్క్యులర్ జారీ



**న్యూఢిల్లీ, జనవరి 4:** విమాన ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని విమానయాన నియంత్రణ, పర్యవేక్షణ సంస్థ డీజీసీఏ కీలక సూచనలు చేసింది. విమాన ప్రయాణికులు పవర్ బ్యాంక్, అదనపు బ్యాటరీలు వాడే విషయంలో తాజాగా కొన్ని నిబంధనల్ని ప్రవేశపెట్టింది. దీని ప్రకారం ఇకపై విమాన ప్రయాణికులు హ్యాండ్ లగేజ్ లో మాత్రమే పవర్ బ్యాంక్, అడిషనల్ బ్యాటరీలు, ఇతర లిథియం బ్యాటరీ డివైజ్ లను తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఓవర్ హెడ్ కంపార్ట్ మెంట్, ఇతర కార్గో లగేజ్ లలో వీటిని తీసుకెళ్లడానికి అనుమతించరు. దీని ద్వారా విమానంలో ప్రయాణికులకు మరింత భద్రత కలగనుంది. ఈ నిబంధనలకు సంబంధించి డీజీసీఏ డేంజరస్ గూడ్స్ అడ్వైజరీ సర్క్యులర్ జారీ చేసింది. సాధారణంగా లిథియం బ్యాటరీలు కొన్ని సార్లు వేడెక్కి పేలడం, వాటి ద్వారా నిప్పు రవ్వలు అంటుకుని మంటలు వ్యాపించడం వంటివి జరుగుతున్నాయి. అందులోనూ విమానం గాల్లో ఉండగా ఇలా బ్యాటరీలు పేలడం వల్ల అగ్ని ప్రమాదాలు జరిగితే విమాన ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. గాల్లో మంటల్ని నియంత్రించడం సాధ్యం కాదు. విమానాల్లోని ఓవర్ హెడ్ కంపార్టుమెంట్లు, కార్గోలు వంటి వాటిల్లో బ్యాటరీల ద్వారా అగ్నిప్రమాదాలను త్వరగా గుర్తించడం సాధ్యం కావట్లేదు. అందుకే డీజీసీఏ ఈ నిర్ణయం తీసుకుంది. హ్యాండ్ లగేజ్ లో మాత్రమే ఇవి ఉంటే వీటి ద్వారా ఎప్పుడైనా అనుకోని ఘటనలు జరిగితే ముందుగానే గుర్తించి నియంత్రించే వీలుంది. ఇటీవల కొన్ని విమానాల్లో పవర్ బ్యాంకుల ద్వారా మొబైల్స్ ఛార్జింగ్ పెడుతున్నప్పుడు, ఎయిర్ క్రాఫ్ట్ సీట్ పవర్ ఔట్లెట్లలో చార్జింగ్ చేస్తున్నప్పుడు అవి పేలి కొన్ని అగ్ని ప్రమాదాలు సంభవించాయి. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న డీజీసీఏ తాజాగా మార్గదర్శకాలు జారీ చేసింది. ఇకపై విమాన ప్రయాణానికి ముందుగా ఈ విషయంలో జాగ్రత్తగా తనిఖీలు చేస్తారు. హ్యాండ్ లగేజీలలో మాత్రమే వీటిని అనుమతిస్తారు. విమానంలో కూడా స్పష్టమైన ప్రకటన, హెచ్చరికలు జారీ చేస్తారు. గత అక్టోబర్లో ఒక దేశీయ విమానంలో పవర్ బ్యాంక్ పేలడం వల్ల విమానాన్ని మధ్యలో దింపాల్సి వచ్చింది. అయితే, ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి హానీ జరగలేదు.

# 10% పెరిగిన బంధన్‌బ్యాంకు అడ్వాన్సులు!




**న్యూఢిల్లీ, జనవరి 4:** ప్రైవేటురంగంలోని బంధన్‌బ్యాంకు రుణాలు అడ్వాన్సుల్లో పది శాతం వృద్ధినమోదుచేసింది. మొత్తం మూడో త్రైమాసికంలో 1,45,227 కోట్లు ఇచ్చిన ట్లుప్రకటించింది. ఇదే గత ఏడాది ఇదే త్రైమాసికంలో 1,32,019 కోట్లుమాత్రమే ఇచ్చినబ్యాంకుఈసారి కొంత వృద్ధినమోదు చేసింది. బిజినెస్ వివరాలను స్టాక్ ఎక్స్ఛేంజిలకు సమర్పించిన బ్యాంకు డిపాజిట్లుకూడా 11.1శాతంపెరిగి 1,56,723 కోట్లకు చేరినట్లు ప్రకటించింది. అదే గత ఏడాది ఇదే కాలంలో 1,42,002 కోట్లు ఉన్నట్లు తెలిపింది. మొత్తం డిపాజిటలపరంగా చూస్తే స్వల్పంగా క్షీణత ఉంది. 0.9శాతం క్షీణించి 1,58,075కోట్లవరకూ ఉన్నాయి. రిటైల్ డిపాజిట్లు కూడా బలమైన వృద్ధిని సూచించాయి. 17.2శాతం పెరిగినట్లు ప్రకటించింది. రూ.1,13,420 కోట్లకు చేరింది. రిటైల్ టర్మ్ డిపాజిట్లు కూడా 35.8శాతం పెరిగి 70,690 కోట్లకు చేరింది.

అదే గత ఏడాది ఇదేకాలంలో 52,063 కోట్లవరకూ ఉన్నట్లు బ్యాంకు తెలిపింది. కాసా డిపాజిట్లు మాత్రం 4.5శాతం క్షీణించి రూ.42,730 కోట్లకు చేరాయి. కాసా నిష్పత్తి 27.26శాతంగా ఉంది. గత ఏడాది ఇదేకాలంలో ఉన్న 31.73శాతంనుంచి గణనీయంగా తగ్గింది. ఇక బల్క్ డిపాజిట్లు కూడా 2.శాతం క్షీణించాయి. 43,303 కోట్లు వచ్చాయి. ఇక లిక్విడిటీ కవరేజి రేషియో కూడా 149.14 శాతంగా ఉన్నట్లు బ్యాంకు ప్రకటించింది.

# కోల్ ఇండియా అనుబంధ సంస్థ ఐపిఒకు!




**న్యూఢిల్లీ, జనవరి 4:** భారత్‌కోక్‌కోల్ లిమిటెడ్ సంస్థ ఈనెల 9వ తేదీ ఐపిఒకు వస్తోంది. కోల్ ఇండియాకు అనుబంధంగా పనిచేస్తున్న భారత్‌కోకింగ్‌కోల్ మొట్టమొదటి పబ్లిక్ ఇష్యూను ఈనెల 9వ తేదీ ఇస్తోంది. కొత్తసంవత్సరంలో ప్రభుత్వరంగ సంస్థలపరంగా మొట్టమొదటి ఐపిఒగా కూడా వస్తోంది. ఇప్పటికే సెబి వద్ద డిఆర్‌హెచ్‌పి దాఖలుచేసింది. ఆఫర్‌ఫర్‌సేల్ విధానంలో 46.57 కోట్ల ఈక్విటీషేర్లను జారీచేస్తోంది. జనవరి 13వ తేదీ బిడ్డింగ్‌ముగుస్తుంది. యాంకర్ ఇన్వెస్టర్ల బిడ్డింగ్ ఈనెల 8వ తేదీ ఉంటుంది. బొగ్గు రంగంలో ప్రభుత్వ పెట్టుబడుల ఉపసంహరణలో భాగంగానే బిసిసిఎల్ ఐపిఒ ఉంటుందని చెపుతున్నారు.

మార్కెట్‌క్రమశిక్షణ పాటించడంతో పాటు బొగ్గురంగంలో అనిశ్చితిని తొలగించి లాభదాయకత తక్కువ ఉన్నవాటిని ఉపసంహరించుకునే విధానంలో కేంద్రం ముందుకుపోతోంది. సోమవారం కంపెనీ ఆర్థిక పరిస్థితులు, లాట్‌సైజు, ఇష్యూధరలు వంటివాటిని ప్రకటిస్తుందని కంపెనీ ప్రతినిదులు పేర్కొంటున్నారు. గత ఏడాదే కోల్ ఇండియాకు అనుబంధంగా పూరినత స్వతంత్ర సంస్థగా ఉన్న సెంట్రల్‌మైన్ ప్లానింగ్ అండ్ డిజైన్ సంస్థ కూడా ఐపిఒకు వచ్చేందుకు సెబివద్ద డ్రాఫ్ట్ పేపర్లు దాఖలుచేసింది. ఈ సంస్థ కూడా ఒఎఫ్ఎస్ రూటులోనే వస్తోంది. 2025లో కంపెనీలు రికార్డుస్థాయిలో రూ.1.76 లక్షలకోట్లు ఐపిఒలద్వారా సమీకరించాయి. దేశీయంగా మంచి నగదు లభ్యతను సాధించింది. మొత్తం 2024లో 90 సంస్థలు 1.60 లక్షలు సమీకరిస్తే గత ఏడాది మరింతగాపెరిగింది. అదే 2023లో 57 కంపెనీలు రూ.49,436కోట్లు సమీకరించింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.